www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 16-11-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 211 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి తె. 4.48 తదుపరి త్రయోదశి; నక్షత్రం: హస్త రా.2.11 తదుపరి చిత్త; వర్జ్యం: ఉ.8.52-10.39; దుర్ముహూర్తం: సా.4.05-4.50; అమృతఘడియలు: రా.7.31-9.18; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.24; సూర్యాస్తమయం: 5.35 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రేవంత్ కా కమాల్!

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దాదాపుగా మట్టి కరచినా తెలంగాణలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భారీ మెజారిటీ సాధించడం ద్వారా రాజకీయాలు చేయడంలో తాను ఆరితేరానని రేవంత్ రెడ్డి రుజువు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని, అదే జరిగితే పార్టీలో, ప్రభుత్వంలో రేవంత్ బలహీనపడతారని చాలా మంది భావించారు.

ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్ తనలోని రాజకీయ చతురతను ప్రదర్శించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే మజ్లిస్ పార్టీతో అవగాహన కుదుర్చుకున్నారు. ఆ పార్టీ సూచన మేరకు నవీన్ యాదవ్ కు పార్టీ టికెట్ ఇవ్వాలని చెప్పి కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ఒప్పించారు. తాము సూచించిన అభ్యర్థికే కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడంతో మజ్లిస్ పార్టీ ఈ ఎన్నికల్లో గట్టిగా పనిచేసింది.

అదే సమయంలో ఈ నియోజకవర్గంలో ఆంధ్రా మూలాలు ఉన్న ఓటర్లు కూడా చెప్పుకోదగిన సంఖ్యలో ఉన్నారు. దీంతో ఆ వర్గం ఓట్లపై సీఎం దృష్టి పెట్టారు. వారందరూ తెలుగుదేశం పార్టీ అభిమానులు అయినందున అటు నుంచి నరుక్కొచ్చారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబును జైల్లో పెట్టడాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లో తెలుగుదేశం పార్టీ అభిమానులు ప్రదర్శన నిర్వహించినప్పుడు అప్పటి మంత్రి కేటీఆర్ హేళనగా మాట్లాడడాన్ని రేవంత్ రెడ్డి గుర్తుచేయించారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే జగన్‌రెడ్డికి బలం చేకూర్చినట్టేనని ఆంధ్రా మూలాలు ఉన్న ఓటర్లలో విస్తృతంగా ప్రచారం చేయించారు.

కాంగ్రెస్ పార్టీలోకి కొత్తగా వచ్చి ముఖ్యమంత్రి అయిన రేవంత్ పార్టీపైనా, ప్రభుత్వంపైనా పట్టు సాధించడం ఆషామాషీ విషయం కాదు. ఆయన సీఎం కావడమే పెద్ద విజయం. ఈ రెండేళ్లుగా తనను ఎవరు ఎన్ని విధాలుగా విమర్శించినా, హేళన చేసినా రేవంత్ ఆవేశపడలేదు. అవకాశం కోసం రేవంత్ ఎదురుచూస్తూ వచ్చారు.

జూబ్లీహిల్స్‌లో ఓడిపోయి ఉంటే రేవంత్ ప్రభుత్వం కూలిపోయి ఉండేదని చెప్పలేం. కాకపోతే పార్టీలో, ప్రభుత్వంలో ఆయన పరిస్థితి మరింత బలహీనపడేది. పార్టీలోని ఆయన ప్రత్యర్థులు కూడా జూలు విదిలించేవారు. ఇప్పుడు సీఎంకి ఆ బెడద లేదు. రేవంత్ అల్లాటప్పాగా గాలికి కొట్టుకొచ్చిన సీఎం కాదు.. శక్తివంతమైన నాయకుడు అని తనను అందరూ గుర్తించేలా ఆయన చేసుకోగలిగారు.

ప్రభుత్వంలోనే కాదు.. పార్టీలోనూ క్రమశిక్షణ నెలకొల్పే శక్తి రేవంత్‌కు ఇప్పుడు లభిస్తుంది. అధిష్ఠానం వద్ద ఆయన మాటే చెల్లుబాటవుతుంది.

రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని భావిస్తున్న బీజేపీ జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లలో ఐదు శాతం వరకు తగ్గిపోవడం ఏమిటి? బీజేపీ ఈ దుస్థితికి అంతర్గత కలహాలు ప్రధాన కారణమని భావించవచ్చు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మినహా మిగతా పార్టీ ముఖ్యులు ఎవరూ ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొనలేదు.

బిహార్ ఫలితాలు చూశాక ఇండియా కూటమిలోని పార్టీలు కూడా కాంగ్రెస్‌కు దూరం కావొచ్చు. కాంగ్రెస్ పార్టీ బతికి బట్ట కట్టాలంటే, ఆ పార్టీకి కాదు.. ఆ పార్టీ అధిష్ఠానానికి కాయకల్ప చికిత్స జరగాలి. కళ్ల ఎదురుగా పతనమైన పార్టీల నినాదాలు, విధానాలను అందిపుచ్చుకోవడమే ఆ పార్టీ అధిష్ఠానం చేస్తున్న ఘోర తప్పిదం.

కాంగ్రెస్ నాయకత్వ వైఖరిలో మార్పు రానంత వరకు ప్రధాని మోదీ నాయకత్వానికి తిరుగుండదు. ఆయన అంతట ఆయనకు విసుగు వచ్చి ప్రధానమంత్రి పదవి నుంచి తప్పుకొంటే తప్ప మోదీని సమీప భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ గానీ, మరొక పార్టీ గానీ ఓడించలేదు.

రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా తామే అధికారంలోకి వస్తామన్న అతి విశ్వాసంతో ఉన్న బీఆర్ఎస్‌కు ఈ ఫలితం అశనిపాతమే! రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు, ముఖ్యంగా కేటీఆర్ తక్కువగా అంచనా వేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అంతులేని వ్యతిరేకత నిజమే అయితే జూబ్లీహిల్స్‌లో 51 శాతం ఓట్లు రావడం ఎలా సాధ్యం అని బీఆర్ఎస్ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి.


కొత్త పలుకు

అధికారంలో ఉన్నప్పుడు వెనకేసుకున్న సొమ్ముతో యూట్యూబ్ చానళ్లు పెట్టించి, వాటిల్లో అనుకూలంగా ప్రచారం చేయించుకుంటూ అదే నిజమని కేటీఆర్ భ్రమల్లో బతుకుతున్నారు.

రాజకీయ పరీక్షలో ప్రస్తుతానికి రేవంత్ పాసయ్యారు. ఇకపై జనాభిమానాన్ని చూరగొనడానికి ఆయన ప్రయత్నించాలి. రాజధానిలో మధ్యతరగతి, ఆపై వర్గాల ప్రజల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రభుత్వంపై కొంత వ్యతిరేకత ఉంది. హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ వంటి స్థానాన్ని గెలుచుకోగలిగిన సీఎంకు రాష్ట్రంలోని మిగతా నియోజకవర్గాల ప్రజల మనోగతం తెలియదని అనుకోలేం. ప్రజల్లో ఫీల్ గుడ్ భావన కల్పించడానికి తీసుకోవలసిన చర్యలపై సీఎం దృష్టిసారించాలి.

4

స్థానిక ఎన్నికలకు ఎలా వెళదాం?

- రేపు క్యాబినెట్ భేటీ.. ఈ అంశంపై చర్చ
- పార్టీ పరంగా బీసీలకు 42% సీట్లిచ్చే యోచన
- ప్రజా పాలన విజయోత్సవాల ప్రణాళిక ఖరారు
- 8, 9 తేదీల్లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'
- హాజరు కానున్న సీఎం, 3వేల మంది ప్రతినిధులు
- గిగ్ వర్కర్ల ముసాయిదాపైనా క్యాబినెట్‌లో చర్చ!


ఢిల్లీలో రాహుల్‌గాంధీని కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మహేశ్‌గౌడ్, మీనాక్షి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సోమవారం (17న) జరగనుంది. సచివాలయంలో సీఎం రేవంత్ అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానుంది. ఈ భేటీలో చర్చించే ఎజెండాకు సంబంధించిన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని అన్ని శాఖల ముఖ్యకార్యదర్శులను సీఎస్ కె.రామకృష్ణారావు ఆదేశించారు. క్యాబినెట్‌లో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించనున్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోపై హైకోర్టు స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో నవంబరులో జరగాల్సిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ఎలా ముందుకు వెళ్లాలన్నదానిపై మంత్రులతో సీఎం చర్చించనున్నారు. మంత్రుల అభిప్రాయాలు, న్యాయ నిపుణుల సలహాలు తీసుకుని, స్థానికసంస్థల ఎన్నికలపై నిర్ణయం ప్రకటిస్తామని శుక్రవారం సీఎం రేవంత్ వెల్లడించిన విషయం

మిగతా 3వ పేజీలో...

ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లండి

- స్థానిక సంస్థల్లోనూ విజయబావుటా ఎగరేయండి
- జీహెచ్ఎంసీ, మున్సిపల్ ఎన్నికలపై శ్రద్ధ పెట్టండి
- జూబ్లీహిల్స్‌లో ఘన విజయంపై రేవంత్, మహేశ్, భట్టి, నవీన్‌లకు ఖర్గే, రాహుల్ అభినందనలు
- జూబ్లీహిల్స్ తీర్పు మా పాలనకు రెఫరెండం
- డిపాజిట్ రాని కిషన్‌రెడ్డి మాట్లాడ్డం హాస్యాస్పదం
- నేను మంత్రివర్గంలోకి వెళుతున్నాననే వార్తల్లో వాస్తవం లేదు: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

3

సీఎం రేవంత్‌తో విన్ గ్రూప్ సీఈవో భేటీ

భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులకు ఆసక్తి

కాంగ్రెస్ మేధో బృందంలో రేవంత్‌కు చోటు

- పార్టీ అధిష్ఠానం యోచన!
- జూబ్లీహిల్స్‌లో గెలుపుతో ఆయనపై విశ్వాసం
- దేశవ్యాప్తంగా పార్టీ బలోపేతానికి చర్యలపై రేవంత్‌తో ఢిల్లీ నేతల చర్చ

3



అమెరికాలో అర్చకత్వం
అద్భుతః

- పూజారులకు మాంచి డిమాండ్
- ఐటీ ఉద్యోగులకు మించి రాబడి!
- నిష్ఠగా వ్యవహరించేవారికి పెద్దపీట
- రకరకాల వీసాలపై వచ్చి అర్చకత్వం
- చదువు కోసం వచ్చి ఓపీటీలో ఉన్న కొందరు విద్యార్థులదీ అదే బాట
- సొంతంగా గుళ్లు నిర్మిస్తున్న వైనం

(డాలస్ నుంచి కిలారు గోకుల్‌కృష్ణ)

అమెరికా అనగానే ఠక్కున గుర్తొచ్చేది సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు.. హెచ్1-బీ వీసాలే!! కానీ.. ఇప్పుడు అర్చకత్వం ఆ రంగంతో పోటీ పడుతోంది! ఐటీ రంగంలో ఉన్నంత అస్థిరత్వం.. అర్చకత్వానికి లేదు. మంచి విద్వత్తు, సుస్వరంతో మంత్రం చెప్పగలిగే సామర్థ్యం, నిష్ఠగా వ్యవహరించే అర్చకులకు అగ్రరాజ్యంలో మాంచి గిరాకీ ఉందిప్పుడు. ఒక నివేదిక ప్రకారం.. అమెరికాలో వెయ్యికి పైగా హిందూ ఆలయాలు ఉన్నాయి. 1890లో షికాగోలో జరిగిన సర్వమత సమ్మేళనానికి హాజరైన స్వామి వివేకానంద.. న్యూయార్క్, శాన్‌ఫ్రాన్సిస్కోల్లో వేదాంత సమాజాలను స్థాపించారు. ఆ వేదాంత సమాజాలు 1905లో

మిగతా 14వ పేజీలో...

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో
ఏసీబీ సోదాలు

భారీగా అవకతవకల గుర్తింపు

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు 13 మంది సబ్ రిజిస్ట్రార్ల ఇళ్లలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. కార్యాలయాల్లో భారీగా అవకతవకలు జరుగుతున్నట్లు తనిఖీల్లో తేలింది. 289 రిజిస్టర్డ్ డాక్యుమెంట్లతో పాటు లెక్కచూపని రూ.2,51,990 నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గండిపేట, శేరిలింగంపల్లి, మేడ్చల్, నిజామాబాద్ టౌన్, జహీరాబాద్, మిర్యాలగూడ, వనపర్తి, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, వైరా తదితర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఏసీబీ అధికారులు 23 బృందాలుగా ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. రిజిస్ట్రేషన్ అనంతరం డాక్యుమెంట్లను ప్రజలకు ఇవ్వకుండా అధికారులు తమ వద్దే ఉంచుకోవడం, లెక్క చూపని డబ్బు, సీసీ కెమెరాలు పనిచేయకపోవడం తదితర లోపాలను గుర్తించారు. కార్యాలయాల్లో 60 మంది డాక్యుమెంట్ రైటర్లు అనధికారికంగా తిరుగుతున్నట్లు గుర్తించారు. సబ్ రిజిస్ట్రార్ల ఇళ్లల్లో జరిగిన సోదాల వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. భారీగా నగదు, బంగారు ఆభరణాలు, ఆస్తుల పత్రాలు గుర్తించామని వాటి పరిశీలన జరుగుతోందని పేర్కొన్నారు.

మారని అవినీతి అధికారుల తీరు

కోర్ అర్బన్ పరిధిలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బందిపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు

13



గర్భనిరోధక మాత్రల
అమ్మకాల జోరు

- దేశంలో ఏటా 35 మిలియన్ యూనిట్ల అమ్మకాలు
- అమెరికా, చైనా తర్వాత మూడో స్థానంలో భారత్
- పదేళ్లలో 12% మేరకు పెరిగిన విక్రయాలు
- అదే సమయంలో కండోమ్‌ల అమ్మకాలు తగ్గుముఖం
- ఎక్కువగా వాడటం ప్రమాదకరం అంటున్న వైద్యులు

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యవసర గర్భనిరోధక మాత్రల (ఎమర్జెన్సీ కాంట్రాసెప్టివ్ పిల్స్- ఈసీపీ) అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. దేశవ్యాప్తంగా ఏటా 35 మిలియన్ యూనిట్ల (3.5 కోట్లు) కు పైగా అమ్ముడవుతున్నట్లు మోర్డర్ ఇంటెలిజెన్స్ ఇండస్ట్రీ నివేదికలో వెల్లడించింది. ఈసీపీల వినియోగంలో ప్రపంచంలో అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉన్నట్లు

మిగతా 13వ పేజీలో...

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌కు
హరీశ్ మోసం



- కొందరు స్వతంత్రులు అడిగితే ఎవరికైనా సపోర్ట్ ఇవ్వండన్నారు
- ఉప ఎన్నికలో అనేక కుట్రలు
- టైం వచ్చినప్పుడు బయటపెడతా
- జగదీశ్, ప్రశాంత్, నిరంజన్‌రెడ్డిలకు వందల కోట్లు ఎలా వచ్చాయి?
- కేటీఆర్.. ట్విటర్ వదిలి వచ్చి ప్రజాక్షేత్రంలో పనిచేయ్: కవిత

3

కేసీఆర్‌తో కేటీఆర్ భేటీ

- నాలుగున్నర గంటలపాటు సమాలోచనలు
- జూబ్లీహిల్స్ వైఫల్యంపై సుదీర్ఘంగా చర్చ
- కవిత వ్యాఖ్యలతో జరుగుతున్న నష్టంపై కూడా!

3


ఇమ్మడి రవిని కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళ్తున్న పోలీసులు

ఐ బొమ్మ నిర్వాహకుడు
ఇమ్మడి రవి అరెస్ట్

- ఫ్రాన్స్ నుంచి వచ్చిన వెబ్‌సైట్ అడ్మిన్
- కూకట్‌పల్లిలో అరెస్టు చేసిన పోలీసులు
- అతని ఖాతాలోని రూ.3 కోట్లు ఫ్రీజ్
- పైరసీకి హైఎండ్ టెక్నాలజీ వినియోగం
- సర్వర్లు హ్యాక్ చేసి మరీ సినిమా చోరీ
- ఇందుకు హ్యాకర్లకు లక్షల్లో చెల్లింపులు
- తమను అడ్డుకోలేరంటూ పోస్టులు పెట్టిన రోజుల వ్యవధిలోనే అదుపులోకి

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్త సినిమాలు, ఓటీటీ కంటెంట్‌ను నిమిషాల వ్యవధిలో పైరసీ చేసి తమ సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్న 'ఐ బొమ్మ' నిర్వాహకుడు ఇమ్మడి రవిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనకు సంబంధించి మూడు బ్యాంకు ఖాతాల్లో

మిగతా 2వ పేజీలో...



2

ఫ్యాన్సీ నంబర్లు ప్రియం

- వాహనాల ఫ్యాన్సీ నంబర్ల కనీస ధర 3 రెట్లు
- 9999 నంబరు కావాలంటే లక్షన్నర కట్టాల్సిందే

ఎక్కడ ఉత్పత్తి చేసినా నచ్చిన చోట వాడుకోవచ్చు!

- సోలార్ రూఫ్‌టాప్‌పై నిబంధనలు విడుదల
- వినియోగదారులు ఓపెన్ యాక్సెస్‌లోనూ కరెంట్ కొనొచ్చు
- టీవోడీ రాయితీ ఎత్తివేస్తూ ఈఆర్‌సీ ఉత్తర్వు

13

రేషన్ కార్డు ఉంటేనే ఆదాయ ధ్రువీకరణ పత్రం

13

- ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల్లో అనర్హులను అడ్డుకోవాలని సర్కారు నిర్ణయం
- రేషన్ కార్డు లేకుండా దరఖాస్తు చేసుకుంటే.. 'మిస్సింగ్ ఫుడ్ సెక్యూరిటీ కార్డు' అని సందేశం

ఏపీకి రూ.13లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు

- విశాఖ సదస్సుకు వెల్లువెత్తిన కంపెనీలు
- 613 ఎంవోయూలు.. 16 లక్షల ఉద్యోగాలు
- రెండేళ్లలో అమరావతి నుంచి క్వాంటమ్ కంప్యూటర్లు.. ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడి

14



వారణాసి నా డ్రీమ్ ప్రాజెక్ట్

- మహేశ్‌బాబు

సినీ ప్రియులు.. మహేశ్‌బాబు, రాజమౌళి అభిమానులు వేయికళ్లతో ఎదురుచూస్తున్న అప్డేట్ వచ్చేసింది. వారి కలయికలో రూపొందుతున్న 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. మన ఇతిహాసాల్లో ఎంతో ప్రాముఖ్యం గల చారిత్రక నగరం 'వారణాసి'ని టైటిల్‌గా ఖరారు చేశారు. శనివారం రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ ఎత్తున ఏర్పాటు చేసిన ఈ వేడుకలో టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. మునుపెన్నడూ కనిపించనంత రఫ్, మాస్ లుక్‌లో ఉన్న మహేశ్‌బాబు అభిమానులకు థ్రిల్ ఇచ్చారు. త్రిశూలం పట్టుకుని నందిపై స్వారీ చేస్తూ ఓ భీకర పోరాటానికి సిద్ధమవుతున్న ఆయన లుక్, విజువల్స్, నేపథ్య సంగీతం, రాజమౌళి మేకింగ్ అన్నీ కలసి.. ఇప్పటికే ఆకాశాన్ని తాకుతున్న అంచనాలను మరింత పెంచేశాయి. ఇది వరకే విడుదల చేసిన మహేశ్‌బాబు ప్రీ లుక్‌లో మెడకు లాకెట్‌గా చూపించిన నంది, త్రిశూలాన్ని గ్లింప్స్‌లోనూ పరిచయం చేయడంతో అభిమానులు రాజమౌళి విజన్‌కు ఫిదా అయిపోతున్నారు. ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్ బేనర్‌పై కేఎల్ నారాయణతో రాజమౌళి తనయుడు కార్తికేయ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రచయిత విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 'ఈ సినిమాలోని యాక్షన్, మహేశ్ నటననూ చూస్తూ అలాగే ఉండిపోయా. సీజీ లేదు, డబ్బింగ్ లేదు, రీ రికార్డింగ్ లేదు. అయినా నన్ను సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. కొన్ని సినిమాలను మనుషులు తెరకెక్కిస్తారు. కానీ ఈ సినిమా మాత్రం దైవ నిర్ణయం. రాజమౌళి గుండెల్లో భగవంతుడు హనుమాన్ ఉండి ఏం చేయాలో చెబుతూ వచ్చాడు. రాముడు వారధి కడితే ఉడతా భక్తిగా కొందరు రాళ్లు ఎలా అందించారో.. అలాగే మాకు ఈ సినిమాలో భాగమయ్యే సదవకాశం, అదృష్టం కలిగాయి' అని పేర్కొన్నారు. కేఎల్ నారాయణ మాట్లాడుతూ '15 ఏళ్ల క్రితం రాజమౌళిగారితో సినిమా చేద్దామని అడిగా. వెంటనే అంగీకరించారు. ఇంత సమయం పడుతుందని ఆయన, నేను అస్సలు అనుకోలేదు. ఈ గ్యాప్‌లో ఆయనకు 'ఈగ' 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి అమోఘమైన హిట్స్ వచ్చాయి. దర్శకుడిగా అంతర్జాతీయ స్థాయికి ఎదిగినా, అప్పుడెలా ఉన్నారో, ఇప్పుడూ అలానే ఉన్నారాయన. ఇది ఆయన గొప్పతనం. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు రాజమౌళికి కృతజ్ఞతలు' అని తెలిపారు. కార్తికేయ మాట్లాడుతూ 'నిర్మాతగా చిన్న చిన్న సినిమాలు చేసుకుంటూ ఉన్న నాకు ఇంత భారీ ప్రాజెక్ట్ వస్తుంది అని ఊహించ లేదు. ఇందులో పనిచేస్తున్న వారంతా లెజెండ్స్. ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించడం నేను చేసుకున్న అదృష్టం. భారతీయ సినిమాను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లి.. ప్రపంచ సినీ ప్రేక్షకుల దృష్టిని మనవైపు తిరిగేలా చేస్తున్నాం' అని అన్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ 'నా పాతికేళ్ల కెరీర్‌లో ఎన్నో సినిమాలు చేశాను. ఇలాంటి సినిమా చేయలేదు. నేను చూసిన తొలి మహేశ్‌బాబు చిత్రం 'పోకిరి'. కృష్ణగారి వారసత్వాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు' అని



చెప్పారు. ప్రియాంక చోప్రా మాట్లాడుతూ 'నన్ను ఇంత గొప్పగా స్వాగతించినందుకు మీ అందరికీ కృతజ్ఞతలు. రాజమౌళిగారు భారతీయ సినిమాను ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి. మీ అందరికీ తెలిసిన మహేశ్‌బాబుకు ఎన్ని ముద్దు పేర్లు, ఎంత మంది అభిమానులు ఉన్నారో నాకు తెలుసు. నాకు తెలుగు పూర్తిగా రాకున్నా.. సినిమా పూర్తయ్యేలోపు నేర్చుకుంటా' అని అన్నారు. అలాగే 'మైండ్‌లో ఫిక్స్ అయితే బ్లైండ్‌గా వెళ్లిపోతా' అనే మహేశ్‌బాబు డైలాగ్ చెప్పి అందర్నీ అలరించారు. సంగీత దర్శకుడు కీరవాణి మాట్లాడుతూ 2027 వేసవికి సినిమా విడుదలవుతుందని తెలిపారు. రాజమౌళి మాట్లాడుతూ 'నన్నూ, మహేశ్‌నూ కలిపిన కేఎల్ నారాయణగారికి కృతజ్ఞతలు. ఇలాంటి సినిమా కథను మాటల్లో చెప్పలేను. అందుకే నా ముందు చిత్రాలకు చెప్పినట్లు ముందే ఈ సినిమా కథ చెప్పలేదు. కేవలం ఈ చిత్ర స్థాయిని తెలిపేలా గ్లింప్స్ విడుదల చేశాం. కృష్ణగారు తెలుగు సినిమాకు ఎంతో చేశారు. ఎన్నో కొత్త రకాల సాంకేతికతను పరిచయం చేశారు. ఆయన వారసుడు మహేశ్ నటిస్తున్న ఈ సినిమా ద్వారా తెలుగు సినిమాకు పూర్తి స్థాయి ఐమాక్స్ ఫార్మాట్‌ను పరిచయం చేస్తున్నాం' అని చెప్పారు.

శ్రీరాముడి పాత్రలో మహేశ్

'వారణాసి' చిత్రంలో శ్రీరాముడి పాత్రలో మహేశ్ కనిపించనున్నారని ఈ వేడుకలో రాజమౌళి వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచారు. 'మహేశ్ కృష్ణుడి పాత్రలో బాగుంటాడని నాకు ఓ నమ్మకం. అయితే ఈ సినిమా కోసం రాముడి గెటప్ వేసి ఫొటో షూట్ చేసినప్పుడు మహేశ్‌ను చూసి మైమరిచిపోయాను. ఆ గెటప్ స్టిల్‌ను నా వాల్ పేపర్‌గా పెట్టుకున్నా. కానీ ఎవరన్నా చూస్తారేమోనని తర్వాత తీసేశాను. శ్రీరాముడికి సంబంధించిన ఎపిసోడ్‌ను 60 రోజుల పాటు తీశాం' అన్నారు రాజమౌళి.


మహేశ్ ఎంట్రీ అదిరింది

చివరిగా మహేశ్ మాట్లాడారు. వేదిక దిగువన ఉన్న ఆయన పోస్టర్‌లో ఉన్నట్లుగా అదిరిపోయే లెవల్‌లో ఎద్దును అధిరోహించి వేదిక మీదకు రాగానే ఆయన అభిమానులు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేశారు. అభిమానులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 'నేను మాములుగానే వస్తానని చెప్పా. కానీ రాజమౌళిగారు ఇలా స్పెషల్‌గా తీసుకువచ్చారు. నాన్నగారు ఎప్పుడూ చెబుతుండేవారు.. ఒక్క పౌరాణిక చిత్రంలోనైనా చేయరా అని. కానీ ఆయన మాట నేను వినలేదు. ఇప్పుడు పై నుంచి ఆయన నా మాటలు వింటుంటారు. 'వారణాసి' నా డ్రీమ్ ప్రాజెక్ట్. జీవితంలో ఒక్క సారి మాత్రమే వచ్చే ప్రాజెక్ట్. దీనికోసం ఎంత కష్టపడాలో అంతా పడతా. అందరూ గర్వించేలా చేస్తా. 'వారణాసి' చిత్రం చూసి దేశమంతా గర్వపడుతుంది. ఈ రోజు జరిగింది టైటిల్ ప్రకటన మాత్రమే. సినిమా ఎలా ఉంటుందనేది మీ ఊహకే వదిలేస్తున్నా' అన్నారు.

ఫ్యాన్సీ నంబర్లు మరింత ప్రియం

- వాహనాల ఫ్యాన్సీ నంబర్ల ధర మూడింతలు
- 9999 నంబరు కావాలంటే రూ.లక్షన్నర కట్టాల్సిందే

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మీరు కొత్త కారు కొన్నారా? ఫ్యాన్సీ నంబర్లలో అత్యంత డిమాండ్ ఉన్న సూపర్ ఫ్యాన్సీ నంబరు అయిన 9999 కావాలనుకుంటున్నారా? తక్కువకు తక్కువగా రూ.లక్షన్నర కట్టాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఎవరు ఎక్కువగా పాడుకుంటే అంత ధర చెల్లించాల్సి ఉంటుంది. ఈ నంబరుకు ప్రాథమిక ధర ఇప్పటిదాకా రూ.50వేలుగా ఉండేది. అంటే.. తాజాగా మూడు రెట్లకు పెంచారన్నమాట! ఇలా సూపర్ ఫ్యాన్సీ నంబర్లే కాదు.. ఫ్యాన్సీ, సీక్వెన్స్, రిపీట్, సింగిల్ డిజిట్ రిపీట్, సాధారణ ఫ్యాన్సీ నంబర్ల ధరలనూ రాష్ట్ర రవాణా శాఖ పెంచేసింది. ఈ మేరకు ఫ్యాన్సీ నంబర్ల ధరలను 200శాతం నుంచి 300 శాతం దాకా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి రవాణా శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ శనివారం జీవో జారీ చేశారు. ఫ్యాన్సీ నంబర్ల కేటాయింపుతో రవాణా శాఖకు ఏటా దాదాపు రూ.120 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. పెంచిన కొత్త ఫీజుల ప్రకారం ఆదాయం మూడింతలు పెరిగే అవకాశం ఉంది. ఇటీవలే వాహనాల లైఫ్ ట్యాక్స్‌ను పెంచిన విషయం తెలిసిందే. ఇక ఇప్పటి వరకు వాహనాలకు ఫ్యాన్సీ నంబర్ల కేటాయింపు ఐదు శ్లాబులుగా ఉంది. ఇప్పుడు అవి ఏడుకు పెరిగాయి. ఇప్పటి వరకు రూ.50 వేలు, రూ.30వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5వేలుగా శ్లాబులు ఉండేవి. వాటిని తాజాగా ఏడు శ్లాబులకు పెంచారు. రూ.1.50 లక్షలు, రూ.లక్ష, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.6 వేలుగా వాటిని నిర్ణయించారు.



'ఐ బొమ్మ' నిర్వాహకుడి అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న రూ.3 కోట్లను ఫ్రీజ్ చేశారు. కొత్త సినిమాలను థియేటర్లలో ప్రదర్శించే సమయంలోనే రికార్డ్ చేసి, వాటిని 'ఐ బొమ్మ' వెబ్‌సైట్‌లో పెడుతున్నారని, పైరసీ కారణంగా 2023లో భారత సినీ పరిశ్రమకు రూ.22,400 కోట్లు నష్టం వాటిల్లగా.. ఒక్క తెలుగు సినీ పరిశ్రమే 2024లో రూ.3,700 కోట్లు నష్టపోయిందని తెలుగు ఫిలిం ఇండస్ట్రీ యాంటీ పైరసీ టీమ్ హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసును చాలెంజింగ్‌గా తీసుకున్న సైబర్ క్రైం అధికారులు దర్యాప్తు చేసి పైరసీ ముఠాకు చెందిన ఐదుగురు కీలక నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి భారీ సంఖ్యలో పైరేటెడ్ సీడీలను స్వాధీనం చేసుకున్నారు. ముఠాలో కీలక వ్యక్తి, పట్నాకు చెందిన అశ్వినీ కుమార్, ఇతర నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు 'ఐ బొమ్మ' అడ్మిన్ ఇమ్మడి రవికి సంబంధించి వివరాలు రాబట్టారు. ఈ సందర్భంగా అప్పటి సీపీ సీవీ ఆనంద్ 'ఐ బొమ్మ' సైట్ నిర్వాహకులకు అరెస్ట్ తప్పదంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఇమ్మడి రవి కదలికలపై మూడు నెలలుగా నిఘా పెట్టారు. కొంత కాలంగా ఆయన కరీబియన్ దీవుల్లో ఉంటూ 'ఐ బొమ్మ' వెబ్‌సైట్‌ను నిర్వహిస్తున్నాడని తెలుసుకున్నారు. ఇటీవల ఆయన ఫ్రాన్స్ నుంచి కూకట్‌పల్లిలోని ఇంటికి వచ్చినట్లు గుర్తించారు. వెంటనే, దాడి చేసి ఇమ్మడి రవిని అరెస్ట్ చేశారు. అనంతరం నాంపల్లి కోర్టుకు తరలించారు. అతడి నుంచి పోలీసులు కీలక సమాచారం సేకరించారు. అతడికి సహకరించిన, నెట్‌వర్క్‌లో ఉన్న మరికొందరి పేర్లు బయటకు వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. త్వరలో మరికొన్ని అరెస్టులు జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

సర్వర్లు హ్యాక్ చేసి...

'ఐ బొమ్మ'లో ఐ అంటే రవి ఇంటి పేరు ఇమ్మడి అని పోలీసులు గుర్తించారు. గడిచిన ఆరేళ్లుగా సదరు వెబ్‌సైట్‌లో పైరసీ చిత్రాలను అప్‌లోడ్ చేస్తున్నాడని, ఈ కాలంలో వేలాది సినిమాలను అప్‌లోడ్ చేశాడని దర్యాప్తులో భాగంగా గుర్తించారు. నిజానికి, గతంలో థియేటర్‌కు వెళ్లి మొబైల్‌లో సినిమా మొత్తం రికార్డు చేసి అప్‌లోడ్ చేసేవారు. హెచ్‌డీ క్వాలిటీ చిత్రాల కోసం తర్వాత రూటు మార్చాడు. హైఎండ్ టెక్నాలజీని ఉపయోగించి సినిమా ప్రసారం చేసే సంస్థల సర్వర్లు హ్యాక్ చేసేవాడు. డీసీఐ పరికరాలు, హార్డ్ డిస్కులు, మెయిల్స్‌లో ఉన్న సినిమాను చోరీ చేస్తున్నాడు. ఇందు కోసం రవి హ్యాకర్లకు లక్షలు చెల్లిస్తున్నాడని పోలీసులు తాజాగా గుర్తించారు. రవిని అరెస్ట్ చేసిన సైబర్ క్రైం అధికారులు ఏజెంట్ నెట్‌వర్క్‌తో పాటు హ్యాండ్లర్ల నెట్‌వర్క్‌ను గుర్తించే పనిలో పడ్డారు.

చాలెంజ్ విసిరాడు.. పట్టుబడ్డాడు

'మమ్మల్ని ఆపలేరు.. వెతకలేరు' అంటూ రవి గతంలో పోలీసులకు సవాల్ విసిరాడు. తాము ఒక్క దేశానికే పరిమితం కాదని, తమది గ్లోబల్ నెట్‌వర్క్ అంటూ 'ఐ బొమ్మ' వెబ్‌సైట్‌లో పోస్టులు సైతం పెట్టాడు. పోలీసుల చర్యలతోనే సినీ పరిశ్రమకు నష్టం కలుగుతుందని కూడా పేర్కొన్నాడు. తమను అడ్డుకోవడం, ఆపడం కష్టమని కూడా పోస్టులు పెట్టాడు. కానీ, పోలీసులు అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించి అతడిని అరెస్టు చేశారు.

బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్‌తో కోట్ల ఆదాయం

కొత్త సినిమాలను పైరసీ చేస్తున్న 'ఐ బొమ్మ' వంటి వెబ్‌సైట్ల నిర్వాహకులకు బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ల ద్వారా ఆదాయం వస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. 'ఐ బొమ్మ' వెబ్‌సైట్‌లోనూ బెట్టింగ్ యాప్‌ల ప్రచారం చేస్తున్నారు. 1ఎక్స్ బెట్టింగ్, పరిమ్యాచ్, రాజ్‌బెట్, ఫోరాబెట్, 4ఆర్‌ఏ బెట్ వంటి యాప్‌లకు సంబంధించిన వాణిజ్య ప్రకటనలు వాటిలో ఉన్నాయి. సినిమా మధ్యలో ప్రసారమయ్యే ఈ బెట్టింగ్ యాప్‌ల ప్రచారాలతో ఎక్కువ మందిని ఆకర్షిస్తున్నారు. దీనికి ప్రతిగా బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు వీరికి కోట్లలో చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ డబ్బు వీరికి క్రిప్టో కరెన్సీ రూపంలో అందుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న రవి కూడా కోట్లు సంపాదించాడని పోలీసులు గుర్తించారు.

మావోయిస్టు నేత ఆజాద్ లొంగుబాటు?

- ఆయనతో పాటు మరో 24 మంది కూడా

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కీలక నేత ఆజాద్ అలియాస్ కొయ్యాడ సాంబయ్య మరికొందరితో కలిసి తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయినట్లు తెలుస్తోంది. ఆజాద్ లొంగుబాటును ఒకట్రెండు రోజుల్లో పోలీసులు ప్రకటించవచ్చని సమాచారం. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన ఆజాద్ 30 ఏళ్లుగా మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్నారు. ఆయన భద్రాద్రి కొత్తగూడెం ఏరియా కమిటీ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆజాద్‌తో పాటు దళ సభ్యుల్లో కీలకమైన టెక్నికల్ విభాగం చూస్తున్న నారాయణ అలియాస్ రమేశ్ కూడా లొంగిపోయినట్లు తెలుస్తోంది. వీరితో పాటు మరో 23 మంది దళ సభ్యులు కూడా లొంగిపోయినట్లు సమాచారం. ఆజాద్‌పై రూ.20 లక్షలు, నారాయణపై రూ.5 లక్షల రివార్డు ఉన్నట్లు తెలుస్తోంది.



ఏపీ నుంచి గంజాయి.. బెంగళూరు నుంచి డ్రగ్స్

- నగరానికి సరఫరా చేస్తున్న దంపతులు
- కత్తితో దాడి చేసి పరార్ అయ్యేందుకు ముఠా యత్నం
- ఇద్దరిని పట్టుకున్న పోలీసులు
- పరారైన మహిళ

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయిని, బెంగళూరు నుంచి డ్రగ్స్‌ను నగరానికి సరఫరా చేస్తున్న ముఠాలో ఇద్దరిని ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. రాజమండ్రికి చెందిన గోబెరు వెంకట చైతన్య అలియాస్ షేక్ రిజ్వాన్, నడిమిటి మమత భార్యాభర్తలు. వీరిద్దరూ ఏపీ నుంచి గంజాయి, బెంగళూరు నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి, కారులో తీసుకొచ్చి నగరానికి సరఫరా చేస్తున్నారు. ఈ జంటపై నగరంలో పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు కూడా ఉన్నాయి. తమ వ్యాపారంలో భాగంగా ఈ జంట గంజాయి, ఎండీఎంఏ తీసుకొని నగరానికి బయలు దేరారు. కారు నడిపేందుకు పడమటి రవీందర్ అనే వ్యక్తిని నియమించుకున్నారు. కారులో గంజాయి, డ్రగ్స్ సరఫరా అవుతున్నట్లు పక్కా సమాచారమందుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బాలరాజు, ఎస్సై సంధ్య, సిబ్బంది పెద్ద అంబర్‌పేట ఓఆర్ఆర్ వద్ద నిఘా పెట్టారు. ఓఆర్ఆర్ ఎగ్జిట్ పిస్తా హౌస్ సమీపంలో కారును ఎక్సైజ్ సిబ్బంది అడ్డగించారు. దాంతో గంజాయి ముఠా ఎస్‌టీఎఫ్ సిబ్బందిపై కత్తులతో దాడి చేసి, పరారయ్యే ప్రయత్నం చేసింది. నిందితులను అడ్డుకున్న ఎస్‌టీఎఫ్ సిబ్బందికి స్వల్పగాయాలయినా, వెంటాడి చైతన్య, రవీందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితురాలు మమత పరారయిందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. వారి నుంచి 4.50 కిలోల గంజాయి, 0.65 గ్రాముల ఎండీఎంఏతో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు.

గూగుల్ మ్యాప్స్‌లో మెట్రో రియల్‌టైమ్‌సేవలు

» ఐటీ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో రైలు రాకపోకల సమయాలు ఇకపై గూగుల్ మ్యాప్స్‌లో రియల్‌టైమ్‌గా కనిపిస్తాయని ఐటీ మంత్రి డి.శ్రీధర్ బాబు తెలిపారు. ఓపెన్ డేటా తెలంగాణ పోర్టల్-హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ సంయుక్తంగా సిద్ధం చేసిన పూర్తి జీటీఎఫ్ఎస్ డేటాసెట్‌లో 3కారిడార్లు, 118స్టేషన్లు, 6,958ట్రిప్‌ల వివరాలున్నాయని చెప్పారు. మెట్రో షెడ్యూల్‌లో మార్పులు లేదా ఆలస్యం జరిగితే అవి ఆటోమేటిక్‌గా గూగుల్ మ్యాప్స్, ఇతర యాప్‌లతో సమకాలీకరణ అవుతాయన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఆర్టీసీ బస్సులకోసం 50,807 వారాంత ట్రిప్‌లు, 5,920 స్టాప్‌లను కలిగిన జీటీఎఫ్ఎస్ డేటాసెట్ కూడా పూర్తికావచ్చిన దశలో ఉందన్నారు. ఇది విడుదలైన తర్వాత బస్సు-మెట్రో ప్రయాణాల కోసం ఒకే ప్లాట్‌ఫామ్‌లో సమగ్ర మార్గనిర్దేశం లభ్యం కానుందన్నారు.

స్థానిక ఎన్నికలకు ఎలా వెళదాం?

(మొదటిపేజీ తరువాయి)

తెలిసిందే. అయితే.. రిజర్వేషన్ల పెంపు జోలికి వెళ్లకుండా పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లను కేటాయిస్తూ ముందుకెళ్లడమే ప్రస్తుతం పార్టీ ముందున్న మార్గమని నిపుణులు చెబుతున్నారు. కాంగ్రెస్ పెద్దలు, ప్రభుత్వాధినేతలు కూడా ఇదే దిశగా యోచిస్తున్నట్లు సమాచారం. అదే జరిగితే.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచుతూ జారీ చేసిన జీవో (9)ను ప్రభుత్వం నిలుపుదల చేయక తప్పదని అంటున్నారు. దీంతో ప్రస్తుతం స్థానిక సంస్థల్లో బీసీలకు అమలవుతున్న రిజర్వేషన్ల కోటానే వర్తింపజేసే అవకాశాలున్నాయి. దీనిపై క్యాబినెట్ నుంచి ఏదైనా నిర్ణయం వెలువడుతుందని భావిస్తున్నారు.

ప్రజా పాలన విజయోత్సవాలు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఈ డిసెంబరు 7 నాటికి రెండేళ్లు పూర్తి కానుంది. దీంతో డిసెంబరు మొదటి వారంలో ప్రభుత్వం ప్రజా పాలన విజయోత్సవాలను నిర్వహించనుంది. అందుకే ఈ ఉత్సవాల తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూలు విడుదల చేయాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ప్రభుత్వం కోరనుందని చెబుతున్నారు. ఉత్సవాల సందర్భంలో షెడ్యూలు వెలువడితే ప్రజలు, పార్టీ గ్రామీణ క్యాడర్ మొత్తం ఎన్నికల్లో తలమునకలవుతారని ప్రభుత్వం భావిస్తోంది. ఈ దృష్ట్యా ఎన్నికల ప్రక్రియ డిసెంబరులో ప్రారంభమవుతుందని తెలుస్తోంది. మరోవైపు ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ప్రభుత్వం డిసెంబరు 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025'ను నిర్వహించనుంది. దీనికి దేశ విదేశాల నుంచి 3వేల మంది ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు హాజరు కానున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారు. 9న 'తెలంగాణ రైజింగ్ - 2047' డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తారు.

రాష్ట్ర భవిష్యత్తుకు రోడ్‌మ్యాప్..

డిసెంబరు 8న ప్రజా ప్రభుత్వ రెండో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవిష్యత్తుకు ఒక రోడ్ మ్యాప్‌ను ఆవిష్కరించనున్నారు. రెండు రోజుల సదస్సులో తెలంగాణ రైజింగ్-2027 డాక్యుమెంట్ గురించి ప్రతినిధులకు వివరించనున్నారు. ఈ సందర్భంగా పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చే సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకునే అవకాశముంది. ఈ ప్రజా పాలన వియోజత్సవాల ప్రణాళిక ఖరారు, సదస్సు నిర్వహణ, విదేశీ ప్రతినిధులకు సౌకర్యాలు, భద్రత, ఏర్పాట్లపై క్యాబినెట్ సమావేశంలో చర్చించనున్నారు. ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పూర్తికావడంతో ఈ నెల 14తో ఎన్నికల కోడ్ ముగిసింది. దీంతో ఇన్ని రోజులపాటు పెండింగ్‌లో ఉన్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశాలున్నాయి. గిగ్ వర్కర్ల ముసాయిదాపైనా క్యాబినెట్ చర్చిస్తుందని సమాచారం.

ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లండి

» స్థానిక సంస్థల్లోనూ విజయబావుటా ఎగరవేయండి
» జీహెచ్ఎంసీ, మున్సిపల్ ఎన్నికలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి
» జూబ్లీహిల్స్‌లో ఘన విజయంపై రేవంత్, మహేశ్,భట్టి, నవీన్ యాదవ్‌లకు ఖర్గే, రాహుల్ అభినందనలు
» జూబ్లీహిల్స్ తీర్పు మా రెండేళ్ల పాలనకు రెఫరెండం
» డిపాజిట్ రాని కిషన్‌రెడ్డి దీనిపై మాట్లాడటం హాస్యాస్పదం
» నేను మంత్రివర్గంలోకి వెళుతున్నాననే వార్తల్లో వాస్తవం లేదు: టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
» కేటీఆర్ వ్యాఖ్యలు అవాస్తవం.. నేనెవరిపైనా దాడి చేయలేదు: నవీన్‌యాదవ్


ఢిల్లీలో మల్లికార్జున ఖర్గేతో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్

న్యూఢిల్లీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయంపై ఆ పార్టీ అధిష్ఠానం హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర పార్టీ నేతల పనితీరును అభినందించింది. శనివారం ఢిల్లీలోని సోనియాగాంధీ నివాసంలో అగ్రనేత రాహుల్ గాంధీని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, జూబ్లీహిల్స్ తాజా ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ కలిశారు. నవీన్‌యాదవ్‌ను రాహుల్‌కు రేవంత్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానంలో కాంగ్రెస్ విజయం సాధించడం శుభ పరిణామం, అభినందనీయమని రాహుల్ పేర్కొన్నారు. "గుడ్.. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లండి. స్థానిక సంస్థల్లోనూ విజయబావుటా ఎగురవేయండి. జీహెచ్ఎంసీ ఎన్నికలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి. అన్ని మున్సిపాలిటీల్లో విజయానికి ప్రణాళికలు సిద్ధం చేయండి" అని సూచించారు.

ఖర్గే, కేసీతో రేవంత్ బృందం భేటీ

రేవంత్, మహేశ్, భట్టి, నవీన్ ఒకే కారులో పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నివాసానికి వెళ్లి కలిశారు. ఉప ఎన్నికలో విజయం, రాష్ట్ర రాజకీయాలు, డీసీసీ అధ్యక్షుల నియామకం, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలపై 45 నిమిషాల పాటు చర్చించారు. తర్వాత ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. కేసీతో చర్చించిన అంశాలను ఖర్గేకు వివరించారు. కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీనే ప్రథమమని, ఆ స్ఫూర్తితో ముందుకెళ్లడం వల్లే జూబ్లీహిల్స్‌లో ఘన విజయం సాధ్యమైందని రేవంత్ బృందాన్ని అభినందించారు.

డిపాజిట్ రాని కిషన్‌రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదం: పీసీసీ చీఫ్

ఖర్గే నివాసం నుంచి బయటికి వచ్చిన తర్వాత భట్టి విక్రమార్క, నవీన్ యాదవ్‌తో కలిసి మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. "జూబ్లీహిల్స్‌లో భారీ మెజార్టీతో యావత్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తోనే ఉందనే సందేశాన్ని ఇచ్చింది. ఉప ఎన్నికల్లో విజయం మా రెండేళ్ల పాలనకు రెఫరెండం. ఇదే ఉత్సాహంతో జీహెచ్ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకుంటాం. ఎంఐఎం మద్దతు, డబ్బులతో కాంగ్రెస్ గెలిచిందన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు ఆయన అవివేకానికి నిదర్శనం. బీజేపీ అభ్యర్థికి డిపాజిట్ కూడా దక్కించలేని కిషన్‌రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదం. కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రివర్గం నిర్ణయం తీసుకుంటుంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై నిబద్ధతతోనే ఉన్నాం. బలహీన వర్గాలకు ఈ రిజర్వేషన్లు అందకుండా బీజేపీ అడ్డుకుంటోంది" అని మహేశ్‌గౌడ్ ఆరోపించారు. మంత్రివర్గ విస్తరణలో మీ పేరు కూడా ఉంటుందని ప్రచారం జరుగుతోందని మీడియా ప్రస్తావించగా.. అలాంటి ప్రచారంలో వాస్తవం లేదని మహేశ్‌గౌడ్ చెప్పారు. తర్వాత నవీన్ యాదవ్ మాట్లాడారు. "నన్ను భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటా. కాంగ్రెస్ పెద్దలకు కృతజ్ఞతలు చెప్పడానికి ఢిల్లీ వచ్చాను. అగ్రనేతల ఆశీర్వాదం తీసుకున్నాను" అని చెప్పారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై తాను దాడి చేశానన్న కేటీఆర్ ఆరోపణలు అవాస్తవమన్నారు.

సీఎం రేవంత్‌తో విన్ గ్రూప్ సీఈవో భేటీ



భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులకు ఆసక్తి
తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానించిన సీఎం

తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి విన్‌గ్రూప్ ఆసియా సీఈవో ఫామ్ సాన్‌చౌ ఆసక్తి వ్యక్తం చేశారు. తెలంగాణలో కీలక ప్రాజెక్టులను స్థాపించడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. శనివారం ఢిల్లీలో సీఎం రేవంత్‌ను సాన్ చౌ కలిశారు. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ యూనిట్లు, బ్యాటరీ విద్యుత్ నిల్వ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు విన్‌గ్రూప్ ఆసక్తిగా ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెడతామని తెలిపారు. ఈ సందర్భంగా డిసెంబర్ 8-9 తేదీల్లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025లో పాల్గొనాలని ఫామ్ సాన్‌చౌతోపాటు విన్‌గ్రూప్ ఛైర్మన్ ఫామ్ ఫూంగ్‌లను రేవంత్ ఆహ్వానించారు.

ఓడినా కేటీఆర్‌లో అహంకారం తగ్గలేదు

» కర్మ ఈజ్ బ్యాక్ అని నీ చెల్లెలే చెపుతోంది: ఆది శ్రీనివాస్
» కేటీఆర్‌తో బీఆర్ఎస్ పతనం ఖాయం: అద్దంకి దయాకర్

హైదరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధించిన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరిపై కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఉప ఎన్నికలో చిత్తుగా ఓడిపోయినా కేటీఆర్‌లో అహంకారం ఇసుమంతైనా తగ్గలేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్వజమెత్తారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, ఫేక్ సర్వేల పేరుతో మైండ్ గేమ్‌లు ప్లే చేసినా జనం ఛీ కొట్టారని విమర్శించారు. "కేటీఆర్.. ఒక ఎన్నిక కాదు, ప్రతి ఎన్నికల్లో నీ పార్టీని చిత్తు చిత్తు చేశాం. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, పార్లమెంటు ఎన్నికల్లో గుండు సున్నా, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ బై ఎలక్షన్స్‌లో గాడిది గుడ్డు అయినా కేటీఆర్‌కు బుద్ధి రావడం లేదు. కర్మ ఈజ్ బ్యాక్ అని నీ చెల్లెలే చెపుతోంది" అంటూ శనివారం ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. కేటీఆర్ ఒక్కడితో బీఆర్ఎస్ పతనం ఖాయమన్నారు. బీసీలు అంటే కేటీఆర్‌కు చులకన అని, మాగంటి గోపీనాథ్ తల్లి చేసిన ఆరోపణలకు కూడా ఆయన సమాధానం చెప్పలేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి వస్తే బుల్డోజర్ వస్తది అన్న కేటీఆర్ వ్యాఖ్యలను ఉద్దేశిస్తూ.. బుల్డోజర్ వచ్చి కారును ఈడ్చుకుంటూ పోయిందని ఎద్దేవా చేశారు. కేటీఆర్ డ్రామా ప్రచారం, బీఆర్ఎస్ నేతల అహంకారపూరిత మాటలను ప్రజలు తిప్పికొట్టారని, రాబోయే స్థానిక ఎన్నికల్లో ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని టీపీసీసీ జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ అన్నారు.

హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్

» పోలీసులకు ఫిర్యాదు చేసిన హైకోర్టు ఐటీ రిజిస్ట్రార్..

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌ను గుర్తు తెలియని దుండగులు హ్యాక్ చేయడం కలకలం సృష్టించింది. ఐదు రోజులుగా వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయడంలో సమస్యలు ఎదురవుతుండటంతో పాటు 'బీడీజీ స్లాట్' అనే ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ఓపెన్ అవుతుండటంతో హ్యాక్ అయినట్లు గుర్తించారు. హైకోర్టు వెబ్‌సైట్‌లో ఉండే పీడీఎఫ్ ఫైల్స్‌కు దుండగులు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌తో అనుసంధానం చేశారు. ఈనెల 10న కోర్టు తీర్పుల పీడీఎఫ్ ఫైల్స్‌ను అప్‌లోడ్ చేస్తుండగా బెట్టింగ్ సైట్ ఓపెన్ అవుతుండటంతో హైకోర్టు రిజిస్ట్రార్ (ఐటీ విభాగం) టి.వెంకటేశ్వరరావు డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే సైబర్ క్రైం పోలీసులు ఐటీ చట్టం, బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి హ్యాకింగ్ పాల్పడిన దుండగులను గుర్తించే పనిలో పడ్డారు. ఇటు అక్రమంగా హైకోర్టు ఫైల్స్‌ను యాక్సెస్ చేసిన ఘటనపై అధికారిక వెబ్‌సైట్‌ను నిర్వహిస్తున్న నేషనల్ ఇన్‌ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) సైతం విచారణ చేపట్టింది. ఎన్ఐసీ నుంచి వివరాలు అందితే హ్యాకింగ్‌కు సంబంధించి మరింత స్పష్టత వస్తుందని పోలీసులు భావిస్తున్నారు. మరిన్ని వివరాలు సేకరించేందుకు సైబర్ క్రైం పోలీసులు హైకోర్టును సందర్శించారు. ఇటు అధికారిక వెబ్‌సైట్‌లో అంతరాయం నేపథ్యంలో న్యాయవాదులు తమ కేసుల లిస్టు చూసుకునేందుకు వీలుగా కాజ్ లిస్ట్ లింకును రిజిస్ట్రీ అధికారులు ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చారు.

నేటి నుంచి అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ, పీజీ తరగతులు ప్రారంభం

అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ కౌన్సెలింగ్ తరగతులు, పీజీ ద్వితీయ సంవత్సరం తరగతులు ఆదివారం నుంచి ప్రారంభించనున్నట్లు విశ్వవిద్యాలయ విద్యార్థి సేవా విభాగ డైరెక్టర్ డా.వై.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. విద్యార్థులు వారి అధ్యయన కేంద్రాల్లో కౌన్సెలింగ్ తరగతులకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాల కోసం అధ్యయన కేంద్రాల్లో, వర్సిటీ పోర్టల్ www.braouonl-ine.in ను సందర్శించాలని వెల్లడించారు.

కాంగ్రెస్ రౌడీయిజాన్ని సహించం

గెలిచిన 24 గంటల్లోనే మా కార్యకర్తపై దాడి .. సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలి: కేటీఆర్

» దాడిలో గాయపడ్డ బీఆర్ఎస్ కార్యకర్తకు పరామర్శ
» ఎన్నికల్లో గెలుపోటములు సహజం.. ధైర్యంగా ఉండాలి
» మాగంటి సునీత కుటుంబసభ్యులతో కేటీఆర్
» రిగ్గింగ్ చేసి గెలిచారు: ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్


రహ్మత్‌నగర్‌లో బీఆర్ఎస్ కార్యకర్త రాకేశ్ క్రిస్టోఫర్‌ను పరామర్శిస్తున్న కేటీఆర్

హైదరాబాద్ సిటీ/బోరబండ/హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం వెలువడి 24 గంటలు గడవక ముందే కాంగ్రెస్ పార్టీ రౌడీయిజానికి దిగి.. దిగజారుడు రాజకీయాలు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. శుక్రవారం రాత్రి రహ్మత్‌నగర్ డివిజన్‌కు చెందిన తమ కార్యకర్త రాకేశ్ క్రిస్టోఫర్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసి గాయపరిచారని తెలిపారు. కాంగ్రెస్ గూండాయిజాన్ని సహించబోమని, తమ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. శనివారం ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ అభ్యర్థి మాగంటి సునీతతో కలిసి రాకేశ్ క్రిస్టోఫర్‌ను కేటీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ కార్యకర్తపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పదేళ్లు తాము ప్రభుత్వంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉందని, ఏనాడైనా తమ కార్యకర్తలు హద్దులు దాటి ప్రవర్తించారా? అని ప్రశ్నించారు. ఈ దాడికి కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఇలా కక్షపూరితంగా రౌడీయిజం చేస్తామంటే తెలంగాణ ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ నేతలు రిగ్గింగ్‌లు, గుండాగిరి, దొంగ ఓట్లు, పైసలు, చీరలు, కుక్కర్లు పంచినా తమ అభ్యర్థికి 75 వేల ఓట్లు వచ్చాయని, ఇది స్వల్ప సంఖ్యకాదని అన్నారు. ఈ నెల 18 జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహిస్తామన్నారు. భవిష్యత్తులో జూబ్లీహిల్స్‌లో మళ్లీ గులాబీ జెండా ఎగరేస్తామన్నారు. కాగా.. దాడి ఘటనపై రాకేశ్ క్రిస్టోఫర్ ఫిర్యాదు మేరకు రాఖీ అనే యువకుడితో పాటు అతని అనుచరులపై కేసు నమోదు చేసినట్లు మధురానగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ తెలిపారు.

రేవంత్ పాలనకు ఆమోదం కాదు..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలుపు సీఎం రేవంత్ రెడ్డి పాలనకు ప్రజల ఆమోదం కాదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. బిహార్, రాయలసీమ, పాతబస్తీలో జరిగినట్లు జూబ్లీహిల్స్‌లోనూ రిగ్గింగ్ జరిగిందని ఆరోపించారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉప ఎన్నికల్లో అధికార పార్టీ గెలవడం సర్వసాధారణమన్నారు. గతంలో కాంగ్రెస్ అనేక ఉప ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయిందని గుర్తు చేశారు. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పనిచేసి రూ.200 కోట్లు ఖర్చుపెట్టి ఎంఐఎంను బతిమిలాడి గెలిచారని విమర్శించారు. ఈ ఎన్నికలో ఓడిపోతే రేవంత్‌రెడ్డి సీఎం పదవి పోతుందని భయపడ్డారని ఎద్దేవా చేశారు. ప్రజలు నవీన్‌యాదవ్‌ను చూసి ఓటు వేశారే తప్ప.. రేవంత్‌ను చూసి కాదన్నారు. బండి సంజయ్‌తో కుమ్మక్కయి బీజేపీ ఓట్లు కాంగ్రెస్‌కు వేయించుకుని గెలిచారని ఆరోపించారు.

మాగంటి సునీత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన కేటీఆర్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన మాగంటి సునీత, ఆమె కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం మాదాపూర్‌లోని ఆమె నివాసంలో కలిసి ధైర్యం చెప్పారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ధైర్యంగా ఉండాలని అన్నారు. ఎన్నికల్లో సునీతతోపాటు వారి పిల్లలు చూపిన స్ఫూర్తి, పోరాటం అభినందనీయమన్నారు.

కేసీఆర్‌తో కేటీఆర్ భేటీ

» నాలుగున్నర గంటలపాటు సమాలోచనలు
» జూబ్లీహిల్స్ వైఫల్యంపై సుదీర్ఘంగా చర్చ కవిత వ్యాఖ్యలతో జరుగుతున్న నష్టంపైనా..

గజ్వేల్/మర్కుక్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ అయ్యారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని ఫాంహౌజ్‌లో శనివారం సాయంత్రం భేటీ అయిన కేటీఆర్.. పలు అంశాలపై కేసీఆర్‌తో చర్చించినట్లు తెలిసింది. ముఖ్యంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమికి కారణాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా పార్టీ శ్రేణుల కష్టాన్ని, అధికార కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యాన్ని వివరించినట్లు సమాచారం. అలాగే, కవిత ఇటీవల పార్టీ నాయకులపై చేస్తున్న కామెంట్లపై సైతం చర్చించినట్లు తెలిసింది. ఆమె వ్యాఖ్యలతో పార్టీకి జరుగుతున్న నష్టంపై చర్చ సాగినట్లు సమాచారం. త్వరలోనే పార్టీకి పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేసే దిశగా ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. దాదాపు నాలుగున్నర గంటలపాటు కేసీఆర్, కేటీఆర్ భేటీ సాగినట్లు తెలిసింది. పార్టీ భవిష్యత్తు కార్యాచరణపైనా ఆలోచన చేసినట్లు తెలిసింది.

కవిత ఆరోపణలు అబద్ధం : ఎమ్మెల్సీ నవీన్ కుమార్

» బీఆర్ఎస్‌లో హరీశ్, కేటీఆర్‌లు కృష్ణార్జునులు
» మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్

హైదరాబాద్/మెదక్ మునిసిపాలిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్ పక్కన మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం రెడ్డిపల్లిలో తనకు 18 ఎకరాల భూమి ఉందని అక్కడి రైతులు చెప్పారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధాలని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ అన్నారు. ఈ అలైన్‌మెంట్ తన కోసం మార్చారని ఆమె చేసిన ఆరోపణలు అసత్య ప్రచారం తప్ప మరొకటి కాదని, ఆ వాఖ్యలను ఖండిస్తున్నట్లు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. తనకు గానీ, తన కుటుంబ సభ్యులకు గానీ ఆ ప్రాంతంలో భూమి లేదని స్పష్టం చేశారు.తన ప్రతిష్ఠకు ఉద్దేశపూర్వకంగా నష్టం కలిగించే ఈ తప్పుడు వ్యాఖ్యలపై, చట్టపరమైన స్థాయిలో చర్యలు తీసుకోవడానికి తాను వెనుకాడనని ఆయన పేర్కొన్నారు. కాగా, ఆదరించిన బీఆర్ఎస్‌ను, కృష్ణార్జునుల్లాంటి హరీశ్‌రావు, కేటీఆర్‌లను ఎమ్మెల్సీ కవిత విమర్శిస్తూ మాట్లాడటం తిన్నింటి వాసాలు లెక్కబెట్టినట్లుగా ఉందని మెదక్ మునిసిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్ మండిపడ్డారు. శనివారం మెదక్ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో కవిత బీఆర్ఎస్ పార్టీ వల్లే ఎంపీ అయ్యారని, ఆమె అవినీతికి పాల్పడి అడ్డమైన దందాలు చేసి ప్రజాదరణ కోల్పోయిన విషయం గుర్తెరగాలన్నారు. కవిత సోయి తప్పి మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో..

బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వని హరీశ్

» కొందరు స్వతంత్రులు అడిగితే ఎవరికైనా సపోర్ట్ ఇవ్వండని అన్నారు
» ఉప ఎన్నికలో అనేక కుట్రలు.. సమయం వచ్చినప్పుడు బయటపెడతా
» కేటీఆర్.. ట్విటర్ వీడి, ప్రజాక్షేత్రంలో పనిచేయ్
» 'జాగృతి జనం బాట'లో కల్వకుంట్ల కవిత



మెదక్, చిన్నశంకరంపేట/చేగుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): "జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తమ తరఫున ప్రచారం చేయాలని సుమారు 15 మంది ఇండిపెండెంట్లు నన్ను సంప్రదించారు. నాకు, జూబ్లీహిల్స్ ఎన్నికకు సంబంధం లేదని చెప్పాను. తర్వాత వాళ్లు హరీశ్ రావు దగ్గరకు వెళ్లారు. మేం ఏ పార్టీ అభ్యర్థికి మద్దతివ్వాలని హరీశ్‌ను అడిగారు. ఆయన కూడా అదే జవాబు చెప్పారట. మీ ఇష్టం.. ఎవరికైనా మద్దతు ఇచ్చుకోండి అన్నారట. నేను బీఆర్ఎస్‌లో లేను కాబట్టి ఉప ఎన్నికకు దూరంగా ఉన్నాను. కానీ, హరీశ్ రావు ఆ పార్టీలో ఉంటూ పార్టీని మోసం చేశారు" అని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆయన వ్యాఖ్యల అంతరార్థం.. బీఆర్ఎస్‌కు ఆయన మద్దతు ఇవ్వడం లేదనేనని చెప్పారు. మోసం చేయడం, బీఆర్ఎస్ ఓడిపోగానే పార్టీ ఓటమికి తాను కారణం కాదని తప్పించుకోవడం హరీశ్ నైజమని దుయ్యబట్టారు. ఆయన గురించి గట్టిగా మాట్లాడితేనే తనను బయటకు పంపారని చెప్పారు. పైగా తండ్రి మరణించడం వల్లనే ఎన్నికల ప్రచారంలో హరీశ్ పాల్గొనలేదని, లేకపోతే, ఆయన ఈల వేస్తే విజయం వచ్చిపడేదని ఆయన భజనపరులు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఇంటిదొంగను ఈశ్వరుడైనా పట్టలేడుకదా అని వ్యాఖ్యానించారు. ఉప ఎన్నికలో అనేక కుట్రలు జరిగాయని, సమయం వచ్చినప్పుడు వాటిని బయటపెడతానని చెప్పారు. రెండు రోజులుగా మెదక్ జిల్లాలో జాగృతి జనం బాట నిర్వహించిన కవిత శనివారం చిన్న శంకరంపేటలో మాజీ సీఎం కేసీఆర్ ప్రారంభించిన మొట్టమొదటి అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. హవేలీ ఘనపూర్ మండలం ధూప్‌సింగ్ కూచన్‌పల్లిలో రైతులతో మాట్లాడారు. పోలంపల్లిలోని కేవల్ కిషన్ సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం మెదక్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రవ్యతిరేకత ఉన్నా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిపై అంత భారీ మెజారిటీ రావడానికి కారణం బీఆర్ఎస్ నేతలు కేవలం సోషల్ మీడియాకు పరిమితం కావడమేనని అన్నారు. కేటీఆర్ ట్విటర్ వీడి బయటకొచ్చి ప్రజాక్షేత్రంలో పని చేయాలని సూచించారు. పార్టీకి తాము కృష్ణార్జునులమని బిల్డప్‌లు ఇస్తూ ఒకరి జబ్బ ఒకరు చరుచుకుంటున్నారని, అంతే తప్ప క్షేత్రస్థాయిలో పని చేయడం లేదని కేటీఆర్, హరీశ్‌రావులను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. ఉపఎన్నికల ఫలితాల తర్వాత వేలాదిమంది బీఆర్ఎస్ శ్రేణులు తమను సంప్రదిస్తున్నారని, జాగృతిలో చేరి పని చేస్తామని ఫోన్లు చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు ఆస్తులు పెంచుకున్నారని, కానీ, క్యాడర్‌ను పెంపొందించుకునే ఉద్దేశంవారికి లేదని ఆరోపించారు. చిన్న చింతకుంటలో మాజీ మంత్రి గంగుల కమలాకర్‌కు 15 ఎకరాల భూమి ఉందని, కేసీఆర్‌కు ఈ విషయాలు ఏవీ తెలియవని అన్నారు. కేసీఆర్ కళ్లకు గంతలు కట్టి పార్టీ ద్వారా సంపాదించుకున్నవారు ఎందరో ఉన్నారన్నారు. జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి.. వీళ్లకు ఇప్పుడు వందల కోట్లు ఎలా వచ్చాయని, వీళ్ల ఆస్తులు ఎన్ని పెరిగాయని ప్రశ్నించారు. ఇక తన ఆస్తుల వివరాలకొస్తే 2014కు పూర్వం ఉన్న ఆస్తిపాస్తులే ఇప్పుడున్నాయని, అయినా, ఈడీ, సీబీఐ 3 నెలలపాటు వేధించాయని తెలిపారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డికి గతంలో బీఆర్ఎస్ టికెట్ ఇవ్వలేదని, దాంతో, ఆమె కేసీఆర్‌పై దోసిళ్లతో దుమ్మెత్తి పోసి పార్టీని వీడిపోయిందని, అప్పట్లో హరీశ్ కూడా పార్టీ అభ్యర్థికి సపోర్ట్ చేయకపోవడంతో మరో పార్టీకి విజయం సాధ్యమైందన్నారు. కేసీఆర్ దీక్ష విజయవంతమైన తర్వాత మళ్లీ ఆమె పార్టీలోకి వచ్చిందని చెప్పారు. కేసీఆర్‌మీద దుమ్మెత్తి పోసిన పద్మా దేవేందర్‌రెడ్డికి హరీశ్ రావు ఎలా సపోర్ట్ చేస్తారని ప్రశ్నించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

నిజానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితంతో రాష్ట్ర రాజకీయాలలో గానీ, ప్రజల జీవితాలలో గానీ ఇప్పటికిప్పుడు వచ్చే గుణాత్మకమైన మార్పులు ఏమీ ఉండవు. అయితే రేవంత్‌రెడ్డికి మాత్రం ఈ విజయం ఎంతో ముఖ్యం. తాను బలహీన ముఖ్యమంత్రి అని ఎద్దేవా చేస్తున్న వారికి దీటైన జవాబు చెప్పే అవకాశం ఆయనకు లభించింది. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా రాజకీయాలలో మరింత ఎత్తుకు ఎదగడానికి ఆయనకు ఈ విజయం అవసరం. పార్టీలోనే ఒక వర్గం ఆశలు వదులుకున్న సీటును భారీ మెజారిటీతో గెలుచుకోవడం ద్వారా పార్టీ అధిష్ఠానం వద్ద కూడా ముఖ్యమంత్రి ప్రతిష్ఠ అమాంతం పెరుగుతుంది. అపాయింట్‌మెంట్ ఇవ్వడానికి కూడా పార్టీ అధిష్ఠానం ఇష్టపడటం లేదన్న ప్రచారం నిజమే అనుకుందాం. ఈ ఫలితం తర్వాత పార్టీ అధిష్ఠానం రేవంత్‌రెడ్డిని కాదనుకోగలదా? ఒక్క మాటలో చెప్పాలంటే రేవంత్‌రెడ్డి నాయకత్వానికి ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో ఇప్పట్లో తిరుగుండదు.

రేవంత్ కా కమాల్!

"నాకు రాజకీయాల్లో లోతులు తెలియవు అనుకోవద్దు.. రాజకీయం చేయడం రాదు అని కూడా అనుకోవద్దు".. కొంతకాలం క్రితం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. "జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం కష్టం. మాకు, భారత రాష్ట్ర సమితికి మధ్య పది శాతానికి పైగా ఓట్ల తేడా ఉంది. ముఖ్యమంత్రి ఒక్కరికే గెలుస్తామన్న నమ్మకం ఉంది" ..ఎన్నికల ప్రచారం ప్రారంభమయ్యాక కొందరు మంత్రులు చేసిన వ్యాఖ్యలివి. "రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ అధిష్ఠానం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. నమ్మి ముఖ్యమంత్రి పదవి కట్టబెడితే రేవంత్ రెడ్డి పార్టీని నాశనం చేస్తున్నాడు అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చిరాకుపడుతున్నారు" ..గత కొద్ది రోజులుగా రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా ఆయన ప్రత్యర్థులు చేసిన ప్రచారం ఇది. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఫలితం వెల్లడైంది. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా దాదాపు 51 శాతం ఓట్లు సాధించింది. దాదాపు 25 వేల ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించారు. తనకు రాజకీయాల్లో లోతులు తెలియవని హేళన చేసిన వారికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విజయం ద్వారా తానేమిటో సమాధానం చెప్పారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దాదాపుగా మట్టి కరచినా తెలంగాణలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భారీ మెజారిటీ సాధించడం ద్వారా రాజకీయాలు చేయడంలో తాను ఆరితేరానని రేవంత్‌రెడ్డి రుజువు చేసుకున్నారు. గత శాసన సభ ఎన్నికల్లో హైదరాబాద్ మహా నగరంలో కాంగ్రెస్ పార్టీ చతికిలపడిన విషయం తెలిసిందే. అంతకుముందు జరిగిన గ్రేటర్ మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటు బ్యాంకు పది శాతం దిగువకు పడిపోయింది. పార్టీ కార్యకర్తలు చెల్లాచెదురయ్యారు. ఈ నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో వచ్చిన ఉప ఎన్నిక ముఖ్యమంత్రి నాయకత్వ పటిమకు అగ్నిపరీక్షగా మారింది. గోపీనాథ్ భార్యకు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చినందున సానుభూతి కూడా తోడై ఆ పార్టీనే గెలుస్తుందని విశ్లేషకులు కూడా భావించారు. సంస్థాగతంగా బలహీనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని, అదే జరిగితే పార్టీలో, ప్రభుత్వంలో రేవంత్‌రెడ్డి బలహీనపడతారని చాలా మంది భావించారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనలోని రాజకీయ చతురతను ప్రదర్శించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే మజ్లిస్ పార్టీతో అవగాహన కుదుర్చుకున్నారు. ఆ పార్టీ సూచన మేరకు నవీన్ యాదవ్‌కు పార్టీ టికెట్ ఇవ్వాలని చెప్పి కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ఒప్పించారు. జూబ్లీహిల్స్ అభ్యర్థి విషయమై మీడియాలో వచ్చిన ఊహాగానాలతో నిమిత్తం లేకుండా నవీన్ యాదవ్ అభ్యర్థిత్వాన్ని సైలెంట్‌గా చాలా ముందుగానే ఖరారు చేయించుకున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే పార్టీ అభ్యర్థిని ఖరారు చేయించడం రేవంత్ సాధించిన తొలి విజయం. అధిష్ఠానం సూచన మేరకు క్షేత్ర స్థాయిలో పనిచేసుకోవలసిందిగా నవీన్ యాదవ్‌కు ముఖ్యమంత్రి సూచించారు. పార్టీలో చాలామందికి ఈ విషయం తెలియదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసిన అజారుద్దీన్ అడ్డు పడకుండా ఉండడం కోసం ఆయన్ను మంత్రివర్గంలోకి తీసుకోవడానికి అనుమతించాలని పార్టీ అధిష్ఠానానికి చెప్పి ఒప్పించుకున్నారు. తాము సూచించిన అభ్యర్థికే కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడంతో మజ్లిస్ పార్టీ ఈ ఎన్నికల్లో గట్టిగా పనిచేసింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ముస్లిం ఓటర్లు గణనీయంగా ఉన్న విషయం తెలిసిందే. అదే సమయంలో ఈ నియోజకవర్గంలో ఆంధ్రా మూలాలు ఉన్న ఓటర్లు కూడా చెప్పుకోదగిన సంఖ్యలో ఉన్నారు. దీంతో ఆ వర్గం ఓట్లపై ముఖ్యమంత్రి దృష్టి పెట్టారు. వారందరూ తెలుగుదేశం పార్టీ అభిమానులు అయినందున అటు నుంచి నరుక్కొచ్చారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబును జైల్లో పెట్టడాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లో తెలుగుదేశం పార్టీ అభిమానులు ప్రదర్శన నిర్వహించినప్పుడు అప్పటి మంత్రి కేటీఆర్ హేళనగా మాట్లాడడాన్ని రేవంత్‌రెడ్డి గుర్తుచేయించారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే జగన్‌రెడ్డికి బలం చేకూర్చినట్టేనని ఆంధ్రా మూలాలు ఉన్న ఓటర్లలో విస్తృతంగా ప్రచారం చేయించారు. తాను ముఖ్యమంత్రిననీ, ఉప ఎన్నిక కోసం ప్రచారం చేయడం ఏమిటి అనీ భావించకుండా కాలికి బలపం కట్టుకుని విస్తృతంగా ప్రచారం చేశారు. మొత్తంగా సామ దాన భేద దండోపాయాలను ప్రయోగించి బీఆర్ఎస్ సీటును కాంగ్రెస్ ఖాతాలోకి వేసుకున్నారు. అది కూడా 25 వేల మెజారిటీతో! ప్రధాన రాజకీయ ప్రత్యర్థి అయిన బీఆర్ఎస్ అతి విశ్వాసంతో ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ మాత్రం గెలుపే లక్ష్యంగా పనిచేశారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను కార్యక్షేత్రంలో మోహరింపజేశారు. ఈ ఎన్నిక గెలవడం కష్టమని భావించిన మంత్రులు, ఇతరులకు కూడా తన సత్తా ఏమిటో రుజువు చేసి చూపారు. కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద రేవంత్‌రెడ్డి పరపతి పడిపోతోందని ప్రచారం చేసిన వారికి కూడా ఈ విజయంతో సమాధానం చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్న ప్రచారం గత కొంత కాలంగా జోరుగా జరుగుతోంది. ఈ పరిస్థితులలో ఈ ఘన విజయం కాంగ్రెస్ పార్టీకి ఏమో గానీ, రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠ అమాంతం పెరగడానికి దోహదం చేసింది. ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో రేవంత్ పట్టు సడలుతోందన్న అభిప్రాయం కూడా ఈ మధ్య కాలంలో బలంగా వినిపించింది. వైఎస్ రాజశేఖరరెడ్డి వలె రేవంత్‌రెడ్డి పార్టీ పైనా, ప్రభుత్వం పైనా పట్టు సాధించలేకపోయారన్న అభిప్రాయం కూడా వ్యాపించింది. నిజానికి రాజశేఖరరెడ్డి నాటి పరిస్థితులు వేరు.. ఇప్పటి పరిస్థితులు వేరు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉంది. జాతీయ స్థాయిలో పార్టీ బలంగా ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్నందున పార్టీ అధిష్ఠానం మాటకు తిరుగులేకుండా ఉండేది. దీంతో అధిష్ఠానం ఆశీస్సులతో రాజశేఖరరెడ్డి బలంగా ఎదిగారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అందరికీ తెలిసిందే. పదకొండున్నరేళ్లుగా కేంద్రంలో అధికారానికి దూరంగా ఉంది. రెండు మూడు రాష్ట్రాలు మినహా అన్నిచోట్లా అధికారాన్ని కోల్పోయింది. పార్టీ అధిష్ఠానానికే దశా దిశా లేకుండా పోయింది. అధిష్ఠానాన్ని లెక్క చేసే స్థితిలో రాష్ట్రాల నాయకులు లేరు. బిహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ పరిస్థితి మరింత దీనంగా మారే అవకాశాలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలోకి కొత్తగా వచ్చి ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి పార్టీపైనా, ప్రభుత్వంపైనా పట్టు సాధించడం ఆషామాషీ విషయం కాదు. ఆయన ముఖ్యమంత్రి కావడమే పెద్ద విజయం. ఈ రెండేళ్లుగా తనను ఎవరు ఎన్ని విధాలుగా విమర్శించినా, హేళన చేసినా రేవంత్ రెడ్డి ఆవేశపడలేదు. అవకాశం కోసం ఎదురుచూస్తూ వచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రూపంలో ఆయనకు ఆ అవకాశం వచ్చింది. ఆత్మవిశ్వాసంతో అడుగులు వేశారు. పదునైన వ్యూహ రచనతో విజయాన్ని అందుకున్నారు.

ఇంతింతై.. వటుడింతై..

నిజానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితంతో రాష్ట్ర రాజకీయాలలో గానీ, ప్రజల జీవితాలలో గానీ ఇప్పటికిప్పుడు వచ్చే గుణాత్మకమైన మార్పులు ఏమీ ఉండవు. అయితే రేవంత్ రెడ్డికి మాత్రం ఈ విజయం ఎంతో ముఖ్యం. తాను బలహీన ముఖ్యమంత్రి అని ఎద్దేవా చేస్తున్న వారికి దీటైన జవాబు చెప్పే అవకాశం ఆయనకు లభించింది. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా రాజకీయాలలో మరింత ఎత్తుకు ఎదగడానికి ఆయనకు ఈ విజయం అవసరం. పార్టీలోనే ఒక వర్గం ఆశలు వదులుకున్న సీటును భారీ మెజారిటీతో గెలుచుకోవడం ద్వారా పార్టీ అధిష్ఠానం వద్ద కూడా ముఖ్యమంత్రి ప్రతిష్ఠ అమాంతం పెరుగుతుంది. అపాయింట్‌మెంట్ ఇవ్వడానికి కూడా పార్టీ అధిష్ఠానం ఇష్టపడటం లేదన్న ప్రచారం నిజమే అనుకుందాం. ఈ ఫలితం తర్వాత పార్టీ అధిష్ఠానం రేవంత్ రెడ్డిని కాదనుకోగలదా? "సోనియాగాంధీ అపాయింట్‌మెంట్ కుదరదు.. జూబ్లీహిల్స్ ఫలితం తర్వాత చూద్దాం" అని కేసీ వేణుగోపాల్ ముఖ్యమంత్రిని ఉద్దేశించి కసురుకున్నట్టుగా కేసీఆర్ సొంత మీడియాలో రాసుకొని మురుసుకున్నారు. అయితే వారి ఆనందం ఎంతోసేపు నిలవలేదు. శుక్రవారం మధ్యాహ్నానికల్లా ఫలితం వచ్చింది. ఈ దశలో రేవంత్‌ను చిన్న చూపు చూడగలరా? బిహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానం పైనే ఆ పార్టీ నాయకులు, శ్రేణులకు నమ్మకం పోయే పరిస్థితి ఏర్పడింది. జూబ్లీహిల్స్‌లో ఓడిపోయి ఉంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూలిపోయి ఉండేదని చెప్పలేం. కాకపోతే పార్టీలో, ప్రభుత్వంలో ఆయన పరిస్థితి మరింత బలహీనపడేది. పార్టీలోని ఆయన ప్రత్యర్థులు కూడా జూలు విదిలించేవారు. ఇప్పుడు ముఖ్యమంత్రికి ఆ బెడద లేదు. రేవంత్‌రెడ్డి అల్లాటప్పాగా గాలికి కొట్టుకొచ్చిన ముఖ్యమంత్రి కాదు.. శక్తివంతమైన నాయకుడు అని తనను అందరూ గుర్తించేలా ఆయన చేసుకోగలిగారు. ఒక్క మాటలో చెప్పాలంటే రేవంత్ రెడ్డి నాయకత్వానికి ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో ఇప్పట్లో తిరుగుండదు. ప్రభుత్వంలోనే కాదు.. పార్టీలోనూ క్రమశిక్షణ నెలకొల్పే శక్తి రేవంత్‌రెడ్డికి ఇప్పుడు లభిస్తుంది. అధిష్ఠానం వద్ద ఆయన మాటే చెల్లుబాటవుతుంది. కాంగ్రెస్ పార్టీ మహా అయితే ఐదారు వేల కంటే మెజారిటీ దాటదని విశ్లేషకులు కూడా భావించారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్‌లో వచ్చిన ఓట్లు 35 శాతం మాత్రమే. అప్పుడు బీఆర్ఎస్‌కు దాదాపు 44 శాతం ఓట్లు వచ్చాయి. అంటే, కాంగ్రెస్ కంటే దాదాపు 9 శాతం అధికం. గత ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి 14 శాతం పైగా ఓట్లు వచ్చాయి. ఇప్పుడు 9 శాతం లోపే. ఈసారి బీజేపీ డిపాజిట్ కూడా కోల్పోయింది. 2023 ఎన్నికలతో పోల్చితే కాంగ్రెస్ పార్టీకి దాదాపు పదహారు శాతం ఓట్లు అధికంగా వచ్చాయి. అప్పటితో పోలిస్తే బీఆర్ఎస్, బీజేపీలకు కలిపి 11 శాతం ఓట్లు తగ్గాయి. ఇవన్నీ కాంగ్రెస్‌కు బదిలీ అయ్యాయని భావించాలి. గత ఎన్నికల్లో మజ్లిస్ పోటీ చేయగా, ఇప్పుడు ఆ పార్టీ కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించింది. దీంతో మరో ఐదు శాతం ఓట్లు కాంగ్రెస్‌కు కలిసి వచ్చాయి. అధికారంలో ఉన్న పార్టీలకు ఉప ఎన్నికల్లో కొన్ని అనుకూలతలు ఉంటాయి. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి 51 శాతం ఓట్లు లభించడం విశేషమే అని అంగీకరించాలి. ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి ఐదు శాతం వరకు అనుకూలతల వల్ల లబ్ధి చేకూరుతుంది. కాంగ్రెస్‌కు 16 శాతం వరకు పెరిగినందున ఆ విజయాన్ని గుర్తించవలసిందే. రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని భావిస్తున్న భారతీయ జనతా పార్టీ జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లలో ఐదు శాతం వరకు తగ్గిపోవడం ఏమిటి? బీజేపీ ఈ దుస్థితికి అంతర్గత కలహాలు ప్రధాన కారణమని భావించవచ్చు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మినహా మిగతా పార్టీ ముఖ్యులు ఎవరూ ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొనలేదు. కొందరు ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ముఖం చాటేశారు. బిహార్ ఎన్నికల్లో అంచనాలకు మించి స్వీప్ చేసిన బీజేపీకి తెలంగాణలో ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడిందో ఆ పార్టీ అధిష్ఠానం ఆలోచించుకోవాలి. ఉత్తరాదిన తిరుగులేని శక్తిగా ఎదిగిన బీజేపీ దక్షిణాదిలో ఎందుకు ఆపసోపాలు పడుతోందో ఆలోచించుకోవాలి. ఉత్తరాది ప్రజల నాడిని దొరకపుచ్చుకున్న మోదీ–షా ద్వయం దక్షిణాది జన నాడిని ఎందుకు అందుకోలేకపోతున్నారో ఆత్మపరిశీలన చేసుకోవాలి. బీజేపీకి దక్షిణాదిన చోటు దొరకని విషయం అటుంచితే కాంగ్రెస్ పార్టీకి ఉత్తరాదిన పట్టుచిక్కడం లేదు. దక్షిణాది ప్రజల ఆశీస్సులు అడపాదడపా అయినా పొందుతున్న కాంగ్రెస్ పార్టీ, ఉత్తరాది ప్రజలకు ఎందుకు దూరమైందో ఆత్మపరిశీలన చేసుకోవాలి. దక్షిణాదిన బీజేపీకి పట్టు దొరకనప్పటికీ కేంద్రంలో ఆ పార్టీకి మద్దతు ఇచ్చే పార్టీలకు కొదవ లేదు. కాంగ్రెస్ పార్టీకి ఆ అవకాశం కూడా లేదు. బిహార్ ఫలితాలు చూశాక ఇండియా కూటమిలోని పార్టీలు కూడా కాంగ్రెస్‌కు దూరం కావొచ్చు. కాంగ్రెస్ పార్టీ బతికి బట్టకట్టాలంటే, ఆ పార్టీకి కాదు.. ఆ పార్టీ అధిష్ఠానానికి కాయకల్ప చికిత్స జరగాలి. కళ్ల ఎదురుగా పతనమైన పార్టీల నినాదాలు, విధానాలను అందిపుచ్చుకోవడమే ఆ పార్టీ అధిష్ఠానం చేస్తున్న ఘోర తప్పిదం. కాంగ్రెస్ నాయకత్వ వైఖరిలో మార్పు రానంత వరకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికి తిరుగుండదు. ఆయన అంతట ఆయనకు విసుగు వచ్చి ప్రధానమంత్రి పదవి నుంచి తప్పుకొంటే తప్ప మోదీని సమీప భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ గానీ, మరొక పార్టీ గానీ ఓడించలేదు. మహాభారతంలో భీష్ముడికి తన చావుకు తానే ముహూర్తం పెట్టుకొనే వరం ఉన్నట్టుగా వర్తమాన రాజకీయాలలో నరేంద్ర మోదీ కూడా పదవీ విరమణ ఎప్పుడు చేయాలి అన్నది తానే నిర్ణయించుకొనే విధంగా అలాంటి వరమే పొందారేమో!

> చంద్రబాబు, రాజశేఖరరెడ్డి, కేసీఆర్ రాజకీయాలు చూసి ఎదిగిన రేవంత్‌రెడ్డికి రాజకీయాల్లోని లోతులు గురించి వేరే వాళ్లు చెప్పాల్సిన అవసరం ఉంటుందనుకోకూడదు. ప్రస్తుతానికి ముఖ్యమంత్రికి బెస్టాఫ్ లక్ చెబుదాం. జూబ్లీహిల్స్‌లో లభించిన విజయంతో మరింత మెరుగైన పాలన అందిస్తారని ఆశిద్దాం!

ఇంకా భ్రమల్లోనే..

ఇప్పుడు మళ్లీ జూబ్లీహిల్స్ ఎన్నికల విషయానికి వద్దాం. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా తామే అధికారంలోకి వస్తామన్న అతి విశ్వాసంతో ఉన్న బీఆర్ఎస్‌కు ఈ ఫలితం అశనిపాతమే! ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు, ముఖ్యంగా కేటీఆర్ తక్కువగా అంచనా వేశారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రిని కేటీఆర్ తరచుగా కించపరుస్తూ రెచ్చగొట్టారు. రాజకీయంగా ఉండాల్సిన వైరాన్ని వ్యక్తిగత వైరంగా మార్చారు. రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గుర్తించడానికి కూడా కేటీఆర్ నిరాకరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అంతులేని వ్యతిరేకత నిజమే అయితే జూబ్లీహిల్స్‌లో 51 శాతం ఓట్లు రావడం ఎలా సాధ్యం అని బీఆర్ఎస్ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రభుత్వంపై ప్రజాభిప్రాయం ఎలా ఉంది? అన్న విషయం పక్కనపెడితే, కేసీఆర్ కుటుంబం ఇంకా నేల మీదకు దిగి రాలేదన్న అభిప్రాయం మాత్రం ప్రజల్లో ఉంది. కేసీఆర్ ఆరోగ్యం కొంత దెబ్బతిని ఉన్నందున పార్టీలో అంతా తానే అన్నట్టుగా గత రెండేళ్లుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారు. అయినా ప్రజల అభిమానాన్ని మాత్రం ఆయన చూరగొనలేకపోతున్నారు. కేటీఆర్‌లో ఇంకా అహంభావం ఛాయలు పోలేదని ప్రజలు అనుకుంటున్నారు. మరుగుజ్జు లాంటి నాయకులను చుట్టూ పెట్టుకుని కాబోయే ముఖ్యమంత్రిని తానేనని ఆయన భ్రమల్లో బతుకుతున్నారు. చుట్టూ ఉన్నవాళ్లు హై హై నాయకా అంటూ చిడతలు కొడుతున్నారు. అదే నిజమని కేటీఆర్ నమ్ముతున్నారు. పోలింగ్‌కు ముందు వరకు పరిస్థితి తమకే అనుకూలంగా ఉందని, చివరి మూడు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడటంతో ఓడిపోయామని ఆయన చెప్పుకొచ్చారు. అదే నిజం అనుకుందాం. 2014–2023 మధ్య అధికారంలో ఉన్నప్పుడు జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ అధికార దుర్వినియోగానికి పాల్పడలేదా? ఓటర్లకు డబ్బు పంచలేదా? 'జో జీతా వహీ సికందర్' అని అంటారు. ఎలా గెలిచామన్నది కాదు, ఎన్నికల్లో గెలిచామా లేదా అన్నదే ముఖ్యం అని కేటీఆర్‌కు తెలియదా? 2023 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత జరిగిన ఏ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ గెలవలేదు. పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాలేదు. కొన్నిచోట్ల పోటీ కూడా చేయలేదు. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఎన్నిక. కర్మ మనల్ని వెంటాడుతుందని కేటీఆర్ సొంత చెల్లి కవిత తాజాగా వ్యాఖ్యానించారు. గతంలో అహంభావంతో వ్యవహరించినందునే ఇప్పటి దుస్థితి అని తెలుసుకోకుండా ఇప్పటికీ "త్వరలోనే అధికారంలోకి వస్తాం, మీ సంగతి తేలుస్తాం" అని బీరాలు పోవడం ఏమిటి? ఆంధ్రప్రదేశ్‌లో తాము అభిమానించే జగన్‌రెడ్డికి పట్టిన గతి చూసి కూడా కేసీఆర్ కుటుంబం తమ వైఖరి మార్చుకోకపోవడం ఆశ్చర్యంగా ఉంది. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ సొంతంగా పోటీ చేసి సీట్లు గెలుచుకోలేకపోవచ్చు. కానీ ఆ పార్టీకి పలు నియోజకవర్గాలలో గణనీయంగా ఓట్లు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును అవమానించినా, ఆయనకు రాజకీయంగా నష్టం చేయాలనుకున్నా ఆ పని చేసిన వారికి ఈ వర్గం ఓటర్లందరూ వ్యతిరేకం అవుతారు. ఈ విషయం తెలిసి కూడా కేసీఆర్ కుటుంబం జగన్‌రెడ్డే మాకు ముద్దు అని భావించడం వింతగా ఉంది. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో 16 వేల ఓట్ల మెజారిటీతో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ గెలవడానికి ఆంధ్రా మూలాలు ఉన్న ఓటర్లు కారణం కాదా? కేసీఆర్ అండ్ కో జగన్‌రెడ్డితో అంటకాగడం వల్ల ఈ వర్గం ఓటర్లు అందరూ బీఆర్ఎస్‌కు దూరమయ్యారు. అయినా జగన్‌రెడ్డే మాకు ముఖ్యం అని కేసీఆర్ అండ్ కో అనుకుంటున్నారు. ఇది గమనించిన రేవంత్‌రెడ్డి ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే జగన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో బలపడతారని తెలుగుదేశం ఓటర్లకు నచ్చజెప్పి తన వైపునకు తిప్పుకొన్నారు. ఈ వర్గం ఓట్లతో పాటు ముస్లింలు కూడా ఇప్పుడు బీఆర్ఎస్‌కు దూరమయ్యారు. భారతీయ జనతా పార్టీతో పొత్తు పెట్టుకోవడానికి బీఆర్ఎస్ సిద్ధపడిందని కేసీఆర్ కుమార్తె కవిత బహిరంగంగా చెప్పిన తర్వాత ముస్లింలు బీఆర్ఎస్‌కు దూరమయ్యారు. ఒకవైపు తెలుగుదేశం ఓటర్లు, మరోవైపు ముస్లింలు దూరమవడం వల్ల దాదాపు 50కి పైగా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు దెబ్బ పడుతుంది. అయినా ఆ పార్టీ నాయకత్వం తమ విధానాలను సమీక్షించుకోవడానికి సిద్ధంగా లేదు. అదే సమయంలో వాపును చూసి బలుపు అనుకుంటోంది. అధికారంలో ఉన్నప్పుడు వెనకేసుకున్న సొమ్ముతో యూట్యూబ్ చానళ్లు పెట్టించి, వాటిల్లో అనుకూలంగా ప్రచారం చేయించుకుంటూ అదే నిజమని కేటీఆర్ భ్రమల్లో బతుకుతున్నారు. ప్రస్తుత ఉప ఎన్నిక సందర్భంగా కూడా బీఆర్ఎస్ అనుకూల సోషల్ మీడియా వేదికలు ఊదరగొట్టాయి. అయినా ప్రయోజనం కలగలేదు. మీడియా అయినా, సోషల్ మీడియా అయినా రాజకీయ పార్టీలకు కొంత నష్టం చేయగలవే గానీ, ఎన్నికల్లో ఏదో ఒక పార్టీని గెలిపించలేవు. ప్రజలకు అన్నీ తెలుసు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి కూడా సోషల్ మీడియా వారియర్స్‌ను నమ్ముకొని పదకొండు సీట్లకు పరిమితం అయ్యారు. కేటీఆర్ ఇదే వైఖరితో ఉంటే భవిష్యత్తులో కూడా ఫలితాలు ఇంతకు భిన్నంగా ఉంటాయని భావించలేం. కేసీఆర్ ఆరోగ్యంగా ఉన్నంత వరకు బీఆర్ఎస్ మనుగడకు ఢోకా ఉండదు. ఏ కారణం వల్లనైనా కేసీఆర్ క్రియాశీలంగా వ్యవహరించలేకపోతే బీఆర్ఎస్ పరిస్థితి ఏమిటి? అన్నది ఇప్పుడు ఆ పార్టీ శ్రేణులను వేధిస్తున్నది. దేనికైనా కాలమే సమాధానం చెబుతుంది. కవిత అన్నట్టుగా బీఆర్ఎస్‌ను, ముఖ్యంగా కేటీఆర్‌ను కర్మ వెంటాడుతోందని ప్రస్తుతానికి సరిపెట్టుకుందాం.

ఇక జనాభిమానమే టార్గెట్!

ఇప్పుడు మళ్లీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విషయానికి వద్దాం. ఇల్లు అలకగానే పండగ కాదు. ఒక ఉప ఎన్నికను సర్వశక్తులూ ఒడ్డి గెలవొచ్చు గాక. అంత మాత్రాన అంతా పచ్చగా ఉందని భావిస్తే పప్పులో కాలేసినట్టే. రాజకీయ పరీక్షలో ప్రస్తుతానికి రేవంత్‌రెడ్డి పాసయ్యారు. ఇకపై జనాభిమానాన్ని చూరగొనడానికి ఆయన ప్రయత్నించాలి. ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వసనీయత పెంచేలా ఆయన వెంటనే చర్యలు తీసుకోవాలి. పార్టీలో క్రమశిక్షణ నెలకొల్పడానికి ఇంతకంటే మంచి అవకాశం మళ్లీ ఆయనకు లభించదు. ప్రస్తుత పరిస్థితులలో కాంగ్రెస్ అధిష్ఠానం కూడా రేవంత్‌రెడ్డికి స్వేచ్ఛ ఇవ్వొచ్చు. ఈ రెండేళ్ల పాలనలో మంచి చెడులను ఆయన ఇప్పుడు సమీక్షించుకోవాలి. హైదరాబాద్ మహానగరంలో మధ్య తరగతి, ఆపై వర్గాల ప్రజల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఉంది. గణనీయమైన సంఖ్యలో అసెంబ్లీ సీట్లు ఉన్న హైదరాబాద్ ప్రజల మనసు గెలుచుకోవడంపై ఆయన దృష్టి పెట్టాలి. ఉప ఎన్నిక అంటే పార్టీ యంత్రాంగం అంతా మోహరిస్తుంది. సాధారణ ఎన్నికల్లో అలా చేయడం సాధ్యం కాదు. వనరులు కూడా అంతంత మాత్రంగానే ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రభుత్వంపై కొంత వ్యతిరేకత ఉంది. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల వ్యవధి ఉన్నందున ఈ పరిస్థితిని అధిగమించడానికి అవకాశం లేకపోలేదు. హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ వంటి స్థానాన్ని గెలుచుకోగలిగిన ముఖ్యమంత్రికి రాష్ట్రంలోని మిగతా నియోజకవర్గాల ప్రజల మనోగతం తెలియదని అనుకోలేం. ఇప్పుడు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ తన స్థానం పటిష్ఠం అయినందున ప్రజల్లో ఫీల్ గుడ్ భావన కల్పించడానికి తీసుకోవలసిన చర్యలపై ముఖ్యమంత్రి దృష్టిసారించాలి. చంద్రబాబు, రాజశేఖరరెడ్డి, కేసీఆర్ రాజకీయాలు చూసి ఎదిగిన రేవంత్‌రెడ్డికి రాజకీయాల్లోని లోతులు గురించి వేరేవాళ్లు చెప్పాల్సిన అవసరం ఉంటుందనుకోకూడదు. ప్రస్తుతానికి ముఖ్యమంత్రికి బెస్టాఫ్ లక్ చెబుదాం. జూబ్లీహిల్స్‌లో లభించిన విజయంతో మరింత మెరుగైన పాలన అందిస్తారని ఆశిద్దాం!



> 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్‌లో వచ్చిన ఓట్లు 35 శాతం మాత్రమే. అప్పుడు బీఆర్ఎస్‌కు దాదాపు 44 శాతం ఓట్లు వచ్చాయి. అంటే, కాంగ్రెస్ కంటే దాదాపు 9 శాతం అధికం. గత ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి 14 శాతం పైగా ఓట్లు వచ్చాయి. ఇప్పుడు 9 శాతంలోపే. ఈసారి బీజేపీ డిపాజిట్ కూడా కోల్పోయింది. 2023 ఎన్నికలతో పోల్చితే కాంగ్రెస్ పార్టీకి దాదాపు పదహారు శాతం ఓట్లు అధికంగా వచ్చాయి. అప్పటితో పోలిస్తే బీఆర్ఎస్, బీజేపీలకు కలిపి 11 శాతం ఓట్లు తగ్గాయి. ఇవన్నీ కాంగ్రెస్‌కు బదిలీ అయ్యాయని భావించాలి. గత ఎన్నికల్లో మజ్లిస్ పోటీ చేయగా, ఇప్పుడు ఆ పార్టీ కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించింది. దీంతో మరో ఐదు శాతం ఓట్లు కాంగ్రెస్‌కు కలిసి వచ్చాయి. అధికారంలో ఉన్న పార్టీలకు ఉప ఎన్నికల్లో కొన్ని అనుకూలతలు ఉంటాయి. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి 51 శాతం ఓట్లు లభించడం విశేషమే అని అంగీకరించాలి. ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి ఐదు శాతం వరకు అనుకూలతల వల్ల లబ్ధి చేకూరుతుంది. కాంగ్రెస్‌కు 16 శాతం వరకు పెరిగినందున ఆ విజయాన్ని గుర్తించవలసిందే.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

భ్రమలు.. భయాలు...



'న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో జోహ్రాన్ మమ్దానీ గెలుపు– యావత్ ప్రపంచానికే ఒక మలుపు' అంటూ వివిధ పత్రికల్లో వ్యాసాలు, టీవీలో ఒకటే చర్చలు. సోషల్ మీడియాలో అయితే లెక్కలేనంత హైప్ జరుగుతోంది. మమ్దానీ గెలుపును వేడుక చేసుకుంటున్న వారిలో సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు ఉన్నారు. వీరంతా పెట్టుబడిదారులను వ్యతిరేకించే వామపక్ష భావజాలం ఉన్నవారు, సెక్యులర్ల ముసుగులోని ముస్లింలు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన నోటి దురుసు కారణంగానే రెండోసారి ఎన్నికల్లో ఓడిపోయారు. అయితే, జోబైడెన్ ఉదారవాదం మొత్తం అమెరికా ఉనికికే ప్రమాదమని భావించి నందునే అమెరికన్లు మళ్లీ ట్రంప్‌కే పట్టం కట్టారు. మమ్దానీ గెలుపు అమెరికా గడ్డపై నాన్ అమెరికన్ల ఏకీకరణతో సాధించిన విజయం. న్యూయార్క్ నగరంలో పెరిగిన ముస్లింల జనాభా, ఆయన తండ్రి మహమూద్ మమ్దానీ కావడం, ఇస్లామిక్ సంప్రదాయ వివాహం, పాలస్తీనా–ఇజ్రాయెల్ యుద్ధ నేపథ్యం, భారతీయురాలైన తల్లి, ఇస్లామిక్ తీవ్రవాదంపై తండ్రి రాసిన సాహిత్యం, క్రైస్తవ అభ్యుదయవాదుల మద్దతు వంటివి కలగలిసిన విజయం ఇది. ఇలాంటి విజయాలు భవిష్యత్తులో అమెరికా అంతటా పునరావృతమవుతాయనే ఆశలు, భ్రమలు వద్దు. గెలుపు ఏకపక్షంగా కూడా ఏమీ లేదు. న్యూయార్క్ పట్టణం ప్రపంచ సంస్కృతికి ప్రతిబింబం. ఇటీవలికాలంలో అక్కడ క్రైస్తవుల జనాభా తగ్గి ముస్లింల జనాభా గణనీయంగా పెరిగింది. 51 లక్షల మంది ఓటర్లలో 30 లక్షల మంది ఓటర్లు (60శాతం) ఓటింగులో పాల్గొనలేదు. నగరంలోని ధనవంతులెవరూ పోలింగ్ బూత్‌లకు రాలేదు. పోలైన ఓట్లలో మమ్దానీకి 10,36,051 (50.6 శాతం) ఓట్లు, రిపబ్లికన్ అభ్యర్థికి 8,54,995 (41.7శాతం) వచ్చాయి. మొత్తం ఓటర్లలో కేవలం 20.3శాతం, న్యూయార్క్ జనాభాలో 10శాతం మమ్దానీకి మద్దతు పలికినా అతనిని మేయర్ పీఠంపై కూర్చోపెట్టింది అక్కడి ప్రజాస్వామ్యం. ధనవంతులే తన ప్రత్యర్థులంటూ మమ్దానీ చేసిన ప్రచారంతో పేదల ఓట్ల ఏకీకరణ జరిగింది.

సామ్యవాద వ్యతిరేకతతో వాణిజ్య సామ్రాజ్యవాదం విస్తరించే పనిలో ఉండే అమెరికా గతంలో ముస్లిం దేశాల్లో ఇస్లామిక్ తీవ్రవాద గ్రూపులను సృష్టించి, పెంచి, పోషించింది. అవి తమకే ద్రోహం చేస్తున్నాయని 9/11 దాడులతో తెలిసొచ్చాక, ఆయా ఉగ్రగ్రూపులను అంతమొందించేందుకు పూనుకుంది. లాడెన్, అల్ జవహరీ వంటి ఇస్లామిక్ ఉగ్రవాద నేతలను మట్టుబెట్టింది. పెట్టుబడిదారీ విధానం అవలంబించే దేశాలకు పెద్దన్న అయిన అమెరికాలో పెట్టుబడిదారుల లాభాలకు నష్టం కలిగించే పరిపాలన ఎప్పటికీ ఉండదు. అయితే... మమ్దానీ సోషలిస్టు కాదు, కమ్యూనిస్టు అంతకన్నా కాదు. కానీ ఆయన గెలుపు పట్ల అమెరికాకే కాదు, యావత్ ప్రపంచానికే అనేక భయాలు ఉన్నాయి.

ఎన్నికల ప్రచారంలో 'గ్లోబలైజ్ ఇంతిఫాదా' అంటూ ఇస్లాం వ్యాప్తిని మమ్దానీ ప్రస్తావించారు. విజయోత్సవ ర్యాలీలో ఆయన తనను తాను ముస్లింగా ప్రకటించుకుంటూ చేసిన ప్రసంగం లోతుగా గమనించాల్సిందే. 'సౌండ్ పెంచుకొని విను, ఇక్కడ ఎవ్వరిని తాకాలన్నా మా అందరినీ దాటుకుంటూ రావాలి' అని ట్రంప్‌కు ఆయన ఘాటైన హెచ్చరిక చేశారు. తన భార్యకు అరబ్బు దేశాలతో ఉన్న అనుబంధం నేపథ్యంలో, ప్రపంచ ముస్లిం రాజ్యాలు తనకు అండగా నిలవాలని పరోక్షంగా వ్యాఖ్యానించాడు. ఆయన ఎప్పుడూ, ఎక్కడా ఇస్లామిక్ తీవ్రవాదంపై మాట్లాడలేదు. ఇస్లామిక్ ఉగ్రవాదులకు శాంతి సందేశం ఇవ్వలేదు.

అమెరికా అండతో పాలస్తీనాపై యుద్ధం ప్రకటించిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును యుద్ధ నేరస్థుడంటూ, 'న్యూయార్క్ వస్తే అరెస్టు చేయిస్తా'నన్నారు. కానీ, యూదు స్త్రీలపై, పిల్లలపై హమాస్ చేసిన అమానుష నరమేధంపై మమ్దానీ ఒక్కమాట కూడా మాట్లాడలేదు. గతంలో ఇస్లామిక్ టెర్రరిస్టులకు అమెరికా అంటే కాస్తో కూస్తో భయం ఉండేది. కానీ, ఇప్పుడు ఆ వేదికమీద ఉన్నవారి ప్రసంగాలతో ఆ భయం కూడా మిగలకపోవచ్చు.

మమ్దానీ గెలుపుతో ఆయన అభిమానులు భ్రమ పడుతున్నట్లుగా... అట్లాంటిక్ మహాసముద్రానికి ఇరువైపులా గానీ, యూరప్‌లో గానీ అనూహ్య మార్పులేమీ రావు. న్యూయార్క్ నగర ఎన్నికలు క్యాపిటలిస్టులకు, సోషలిస్టులకు మధ్య పోటీ కాదు. క్రైస్తవ ఛాందసవాదులకు, సెక్యులర్ ముసుగులో ఉన్న ఇస్లామిక్ ఛాందసవాదులకు మధ్య జరిగిన ఎన్నికల పోరు ఇది. క్రైస్తవ ఛాందసవాదులతో ప్రపంచానికి ప్రమాదమేమీ ఉండకపోవచ్చు కానీ, ఇస్లామిక్ ఛాందసవాదులతో నిత్యం సమస్యే. మమ్దానీ గెలుపుతో ఇస్లామిక్ ఛాందసులు తమకు ఒక ఆసరా దొరికినట్లుగా భావిస్తారు. అమెరికాను మరో ఇస్లామిక్ రాజ్యంగా చేస్తామని ప్రకటించిన సంస్థలకు ఉత్సాహం లభిస్తుంది. ఇప్పటికే యూరప్ దేశాలు వలసవచ్చిన ముస్లింలతో ఎంత ఇబ్బంది పడుతున్నాయో అమెరికా గమనిస్తోంది. ఒకవైపు అమెరికా ఔన్నత్యాన్ని పొగుడుతూనే న్యూయార్క్‌లో ముస్లిం జనాభా పెరుగుదలను ఇతడు అనుమతిస్తాడన్న అనుమానం అమెరికాలో లేకపోలేదు.

'ఇస్లామోఫోబియా' అంటూ యూరప్‌లో అబద్ధపు ప్రచారం జరుగుతోందని బాధపడిపోతున్న మమ్దానీ అభిమాన ముస్లిం మేధావులు ఇక్కడ కొందరున్నారు. కానీ, అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా, భారత్ వంటి దేశాల్లో జరిగే అధిక ఉగ్రదాడుల్లో ఉన్నది ఈ మతంవారే. 'లజ్జ' రచయిత్రి తస్లీమా నస్రీన్‌పై హైదరాబాద్‌లో జరిగిన అమానుష దాడిని ఈ కుహనా ముస్లిం మేధావులు ఖండించరు, తమ మతంలో స్త్రీ వివక్షను ఎదుటివారు ప్రశ్నించకూడదనీ అంటారు. కానీ, మమ్దానీ తల్లి మీరానాయర్ దర్శకత్వం వహించిన 'India Cabaret' డాక్యుమెంటరీలోని ఒక యువతి పాత్రపై మాత్రం పొగడ్తల వర్షం, సానుభూతి ఒలకబోస్తారు. ఆఫ్రికన్ దేశాల్లో క్రైస్తవులపై ఇస్లామీయులు సాగిస్తున్న మారణకాండ వీరికి కన్పించదు.

మమ్దానీ గెలుపుతో అమెరికా వాణిజ్య సామ్రాజ్యవాదానికి బ్రేకులేమీ పడవు. పెట్టుబడిదారీ విధానంలో మార్పులేమీ రావు. ఈ మాత్రం దానికే అదేదో ప్రపంచ వింతనీ, అద్భుతమనీ, మొత్తం ప్రపంచాన్నే మలుపుతిప్పే తీర్పు అనీ... ఇలా ఏవేవో భ్రమల్లో తేలియాడేవారు అసలు విషయాలను ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారు.

▪ మామిడి నారాయణ

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
హైదరాబాద్
నగర వార్తలు
ఆదివారం 16 నవంబరు 2025



శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.6 కనిష్ఠం 13.8

విమానంలో స్మోకింగ్.. ప్రయాణికుడిపై కేసు

శంషాబాద్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విమానంలో స్మోకింగ్ చేస్తున్న ప్రయాణికుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రియాద్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న 6ఈ 94 ఇండిగో విమానంలో సయ్యద్ అంజర్ అలీ స్మోకింగ్ చేస్తున్నారు. సిబ్బంది గమనించి స్మోకింగ్ చేయొద్దని చెప్పినా వినలేదు. విమానం శనివారం ఉదయం 8 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కాగానే పైలట్ ఆర్జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారంలో ఇది రెండో సంఘటన.



విజయోత్సవ ర్యాలీ (ఫైల్)

నవీన్ లైఫ్‌లో నవంబరు!

జీవితంలో కొత్త మార్పులకు నాంది
జననం.. కాంగ్రెస్‌లో చేరిక.. ఎమ్మెల్యేగా గెలుపు..

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో విజయం సాధించిన నవీన్ యాదవ్‌కు నియోజకవర్గ ప్రజలు బర్త్‌డే గిఫ్టును మూడు రోజుల ముందే ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన 42వ జన్మదినోత్సవాన్ని సోమవారం నియోజకవర్గ ప్రజల మధ్యలో జరుపుకోనున్నారు. 1983 నవంబరు 17న పుట్టిన నవీన్ యాదవ్.. ఈ నెల 14న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అసెంబ్లీలో అడుగు పెట్టాలనే తండ్రి ఆశయాన్ని నెరవేర్చేందుకు రెండుసార్లు ఓడిపోయినా పట్టు వదలలేదు. మూడోసారి విజయం వరించింది. నవీన్ నవంబరు నెలలో పుట్టడంతో పాటు కాంగ్రెస్ పార్టీలో తన ప్రస్థానాన్ని ఇదే నెల నుంచి ప్రారంభించారు. సీఎం రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సందర్భంలో 2023లో అసెంబ్లీ ఎన్నికల ముందు నవంబరు 15న కాంగ్రెస్‌లో చేరారు. నవంబరు నెలలోనే జన్మించడం.. కాంగ్రెస్‌లో ప్రస్థానాన్ని ప్రారంభించడం, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా ఎన్నికవడం యాదృచ్ఛికమే అయినా.. ప్రాధాన్యం సంతరించుకుంది. ఎమ్మెల్యేగా కూడా ఈ నెలలోనే ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

నెక్ట్స్ టార్గెట్.. గ్రేటర్

జూబ్లీహిల్స్‌లో గెలుపుతో పార్టీ శ్రేణుల్లో జోష్
జీహెచ్‌ఎంసీ ఎన్నికల సన్నద్ధానికి టీపీసీసీ ప్రణాళిక

బలపడేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం అడుగులు



హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధించడంతో ఆ పార్టీ నేతలు, శ్రేణుల్లో జోష్ పెరిగింది. ఇదే ఊపుతో గ్రేటర్‌లో సంస్థాగతంగా బలపడి పూర్వ వైభవం సాధించడానికి అధిష్ఠానం అడుగులేస్తోంది. జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు సన్నద్ధమయ్యేలా టీపీసీసీ నాయకత్వం భారీ ప్రణాళికలు రూపొందిస్తోంది. మున్సిపల్ కార్పొరేషన్ హైదరాబాద్ (ఎంసీహెచ్) ఉన్న సందర్భంలోనూ నగరంలో కాంగ్రెస్ తిరుగులేని ఆధిక్యత ప్రదర్శించింది. ఆ తర్వాత వైఎస్ హయాంలో నగర విస్తరణతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) ఏర్పడినా కాంగ్రెస్ హవా కొనసాగింది. స్థానిక సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఆధిక్యత ప్రదర్శించింది. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రేటర్‌లో ఊహించని మలుపులు తిరిగాయి. జీహెచ్‌ఎంసీ మేయర్‌గా సుదీర్ఘకాలం పని చేసిన కాంగ్రెస్‌కు స్వరాష్ట్రం వచ్చిన తొలినాళ్లలోనే రెండు కార్పొరేటర్ స్థానాలు దక్కితే.. 2021లో జరిగిన గ్రేటర్ ఎన్నికల్లో మూడు స్థానాలు దక్కాయి. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌లో కాంగ్రెస్ కేవలం రెండు స్థానాలు గెలిచింది. గెలిచిన ఆ ఇద్దరూ ఎమ్మెల్యేలు అప్పట్లో పార్టీని వీడారు. 2018లో గ్రేటర్‌లో ఒక్క అసెంబ్లీ స్థానాన్ని కూడా కాంగ్రెస్ గెలవలేదు. రెండేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా.. గ్రేటర్‌లో ఒక్క స్థానాన్నీ గెలవలేదు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు కాంగ్రెస్‌కు కలిసివచ్చాయి. ఈ రెండు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది.

గెలుపుతో ఆ నేతలు కాంగ్రెస్ వైపు..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రేటర్‌లోని పలు ప్రాంతాల్లో ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్ బాట పట్టారు. తాజాగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో విజయం సాధించడంతో మరికొందరు నేతలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. పదేళ్లలో కాంగ్రెస్‌కు బూత్‌ల వారీగా ఏజెంట్‌లు లేని పరిస్థితి. ఉప ఎన్నికల్లో వచ్చిన ఫలితాలతో బూత్‌లవారీగా పనిచేయడానికి పార్టీ నేతలు, కార్యకర్తలు ఆసక్తి కనబరుస్తున్నారు.

సంస్థాగతంగా బలోపేతానికి..

గ్రేటర్‌లో సంస్థాగతంగా బలోపేతం కావడంపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. ఇందుకోసం నెల రోజుల క్రితం ఏఐసీసీ ఇన్‌చార్జీలు పలు జిల్లాల్లో పర్యటించారు. డివిజన్లు, బ్లాక్‌లు, జిల్లాల వారీగా పార్టీలో పని చేసేందుకు ఆసక్తి ఉన్న వారి వివరాలను సేకరించారు. వాటి ద్వారా త్వరలో డీసీసీ కమిటీలు, నియోజకవర్గం, డివిజన్,

మిగతా 6వ పేజీలో..

కాల్చేశారా?

పారిశుధ్య కార్మికుడి అనుమానాస్పద మృతి

జీడిమెట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో పారిశుధ్య కార్మికుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్ డివిజన్‌కు చెందిన పాము ఆంజనేయులు(50) కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్‌లో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కొన్నేళ్ల నుంచి మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. శుక్రవారం విధులకు హాజరయ్యాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు తోటి కార్మికులకు ఫోన్ చేయగా తెలియదని చెప్పారు. ఆంజనేయులు శనివారం ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో ఎస్ఎఫ్ఏకు ఫోన్ చేశారు. అతడి కోసం వెతుకుతుండగా కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం సమీపంలో రోడ్డు పక్కన చెత్త రిక్షా కనపడింది. ఆ ప్రాంతంలో వెతకగా చెట్ల పొదల్లో కాలిపోయిన మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులను పిలిపించారు. మృతదేహం ఆంజనేయులుదిగా గుర్తించారు. ఎవరైనా చంపి కాల్చేశారా.. లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అందజేశారు.



ఆంజనేయులు (ఫైల్)

జైళ్ల శాఖ స్థలం..

అక్రమ లీజ్‌పై హోం శాఖ సీరియస్!

దందాపై చర్యలకు డీజీ సన్నద్ధం



ప్రైవేటు వ్యక్తులకు లీజ్‌కు ఇచ్చిన జైళ్లశాఖ స్థలం

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయల విలువైన జైళ్లశాఖ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేసి అక్రమంగా లీజ్‌కు ఇచ్చి సుమారు రూ. 60 లక్షలు దండుకుంటున్న వ్యవహారంపై హోం శాఖ సీరియస్ అయింది. జైళ్ల శాఖ ఉన్నతాధికారులకు నోటీసు జారీ చేసినట్లు ఆలస్యంగా తెలిసింది. ఈ ఏడాది మే 25న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'సొమ్ము జైళ్ల శాఖది.. సోకు అధికారిది!, జైళ్లశాఖ స్థలం దొడ్డిదారిన లీజ్ కథనంపై సీఎంవో, హోం శాఖ ఎస్‌బీ, ఇంటెలిజెన్స్ నుంచి నివేదిక తెప్పించుకున్నాయి. ఐదు నెలలు దాటినా జైళ్ల శాఖ చర్యలు తీసుకోలేదు. హోంశాఖకు ఫిర్యాదు రావడంతో ప్రభుత్వం స్పందించింది. ఉన్నతాధికారుల తీరుపై జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రాను వివరణ కోరినట్లు తెలిసింది. హోంశాఖ నోటీసుతో జైళ్ల శాఖ డీజీ లీజ్ దందాపై చర్యలకు సమాయత్తమయ్యారు. దీనికి ఓ ఉన్నతాధికారి సహకరించినట్లు ఆధారాలు ఉన్నట్లు తేలడంతో చర్యలు సిద్ధమైనట్లు సమాచారం. 2020, జూలై నుంచి జైలు అధీనంలో ఉన్న స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు ఓ ప్రైవేటు నిర్మాణ సంస్థకు లీజ్‌కు ఇచ్చి నెలకు లక్ష రూపాయలు దండుకుంటున్నారు. ఐదేళ్ల నుంచి జైళ్ల శాఖ సుమారు రూ. 60 లక్షలకు పైగా ఆదాయం కోల్పోయింది. లీజ్ వ్యవహారంలో అక్రమాలు జరిగాయని గుర్తించిన చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ ఈ ఏడాది జూన్ 5న లీజు ఒప్పందం కుదుర్చుకున్న నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ప్రైవేటు వ్యక్తులపై చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకూ విచారణ ముందుకు సాగకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో పోలీసులు, జైళ్లశాఖ ఉన్నతాధికారులు కేసును నీరుగారుస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది.

కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే..

జైళ్ల శాఖ స్థలాన్ని కాపాడాల్సిన అధికారులే ప్రైవేటు వ్యక్తులకు ప్రయోజనం చేకూరేలా వ్యవహరించడంపై పలు ఆరోపణలు వస్తున్నాయి. సర్వే నంబరు 138, 136/1 పార్ట్, వార్డు నంబరు 176, బ్లాక్ నంబరు1లో 2.77 ఎకరాల స్థలం జైళ్లశాఖ అధీనంలో ఉంది. ఈ స్థలం తమదని, గోడ నిర్మించొద్దంటూ ఐదుగురు వ్యక్తులు ప్రభుత్వ ముద్రాణాలయ డైరెక్టర్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌ను ప్రతివాదులుగా చేర్చి 2011లో హైకోర్టును

మిగతా 6వ పేజీలో..

కథనం క్లిప్పింగ్



100 శాతం నీటి బిల్లులు

ప్రతీ నెల జారీ చేస్తాం

- ఆలస్యం చేసిన మీటర్ రీడర్లపై చర్యలు తీసుకుంటాం: వాటర్ బోర్డు

హైదరాబాద్ సిటీ, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ప్రాంతాల్లో తాగునీటి బిల్లులు వంద శాతం జారీ చేస్తామని వాటర్‌బోర్డు రెవెన్యూ చీఫ్ జనరల్ మేనేజర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర శివారు ప్రాంతాల్లో నీటి బిల్లులు ప్రతీ నెలా జారీ చేయకుండా ఒకేసారి ఆరేడు నెలలకు ఇస్తున్నారని, దీంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై.. 'నీటి బిల్లులిస్తలేరు' అనే శీర్షికతో ఈ నెల 14న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించింది. దీనిపై వాటర్‌బోర్డు ఉన్నతాధికారులు స్పందించారు. శివారులతోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నీటి బిల్లులు క్రమం తప్పకుండా జారీ చేయకపోవడంపై ఆరా తీశారు. మీటర్ రీడర్లు క్రమం తప్పకుండా విధులకు హాజరుగాకపోవడం వల్ల బిల్లుల జారీలో ఆలస్యమవుతున్నట్లు గుర్తించారు. వినియోగదారులకు ప్రతీ నెల బిల్లులు జారీ చేస్తామని, ఆలస్యం చేసిన మీటర్ రీడర్లపై చర్యలు తీసుకుంటామని చీఫ్ జనరల్ మేనేజర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

హైడ్రా అంటే అభయం



బోడుప్పల్ సుద్దకుంట చెరువు ప్రాంత నివాసితులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

ప్రజలను భయపెడితే కఠిన చర్యలు

- బోడుప్పల్ సుద్దకుంట చెరువు ప్రాంతాన్ని సందర్శించిన కమిషనర్ ఏవీ రంగనాథ్
- ఇళ్లపై అక్రమ మార్కింగ్‌ల పరిశీలన
- తొలగించాలని అధికారులకు ఆదేశం

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): హైడ్రా అంటే అభయమని, హైడ్రా పేరుతో అపోహలు సృష్టించడం, ప్రజలను భయాందోళనకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, మేడిపల్లి బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ కుంట (సుద్దకుంట చెరువు) వద్ద ద్వారకానగర్ నివాసితుల ఫిర్యాదు మేరకు కమిషనర్ శనివారం పర్యటించారు. హైడ్రా పేరు చెప్పి వసూళ్లు చేస్తున్న సంఘటనలు తమ దృష్టికి వస్తున్నాయని, అలాంటి విషయాలను సహించేది లేదన్నారు.

నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం

సుద్దకుంట చెరువు ప్రాంతంలో 30 ఏళ్ల నుంచి నివసిస్తున్నామని, తమ ఇళ్లు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తున్నాయని హైడ్రా పేరు చెప్పి కొందరు బెదిరిస్తున్నారని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. హెచ్‌ఎండీఏ, మున్సిపల్ స్థానిక అధికారులు ఎఫ్‌టీఎల్ మార్కింగ్ చేసి ఇనుప కడ్డీలు పాతి.. ఇళ్లపై నంబర్లు వేసి

మిగతా 6వ పేజీలో..

పెట్రోల్ పోసి చంపుతాం

- అధికారులను బెదిరించిన నలుగురిపై కేసు
- రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఘటన

6



పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవేపై కారు బోల్తా

6

వారాంతపు పర్యాటకం.. అవకాశాలు అపారం

తెలంగాణ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్



6



ఖైరం హోం అవతార్ జంక్షన్ నుంచి కోకాపేట నియోపోలిస్ వరకు ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్న లింకు రోడ్డు (గ్రాఫ్‌లో)

ట్రాఫిక్ రద్దీకి పరిష్కారం లింక్ రోడ్లే

సైబరాబాద్ పోలీసుల సూచన

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ పెరుగుతుండడంతో పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. నానక్‌రాంగూడ నుంచి నార్సింగ్ వైపు వచ్చే ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డులో ట్రాఫిక్ రద్దీగా ఉండడంతో వన్‌వే విధానాన్ని అమలు చేస్తున్నారు. అయినా ఖైరం హోం అవతార్ జంక్షన్ వద్ద రద్దీ పెరుగుతోంది. ఒక్కోసారి కిలోమీటరు నుంచి 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోతోంది. దీంతో ప్రధాన రహదారులకు ప్రత్యామ్నాయంగా లింక్ రోడ్లను నిర్మించాల్సిన అవసరం ఉందని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో కోకాపేట నియోపోలిస్ నుంచి ప్రధాన రహదారులకు ప్రత్యామ్నాయంగా లింకు రోడ్లను నిర్మించాల్సిన అవసరం ఉందని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు క్షేత్ర స్థాయిలో చేపట్టిన సర్వేలో గుర్తించారు. కోకాపేట నియోపోలిస్ నుంచి ఓఆర్ఆర్‌పైకి వెళ్లేందుకు ట్రంపెట్ నిర్మించినా, కోర్ సిటీ లోపలికి వెళ్లే వారికి లింకు రోడ్ల అవసరం ఉంటుందని సూచిస్తున్నారు.

ప్రతిపాదిత లింకు రోడ్డు ఇలా..

కోకాపేట నియోపోలిస్ లేఅవుట్ నుంచి శాంతినగర్, సీబీఐటీ హాస్టల్స్ వెనక భాగం,

మిగతా 6వ పేజీలో..

సిటిజన్స్.. బీ అలర్ట్..!

- నా పేరుతో ఫేక్ 'ఫేస్‌బుక్ ఖాతా'
- డబ్బులడుగుతున్న సైబర్ మోసగాళ్లు
- నమ్మొద్దన్న హైదరాబాద్ సీపీ సజ్జనార్



హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హితవు చెప్పారు. 'నా పేరుతో ఫేక్ ఫేస్‌బుక్ ఖాతాలు సృష్టించి, నా స్నేహితులకు నేను ఆపదలో ఉన్నాను, డబ్బులు పంపండి అని సైబర్ నేరగాళ్లు సందేశాలు పంపుతున్నారు. దురదృష్టవశాత్తు నిజమేననుకుని నా స్నేహితుడొకరు రూ. 20 వేలు మోసగాళ్ల ఖాతాకు పంపారు. ఇలా ఇతరులు ఎవరూ మోసపోవద్దు' అని సజ్జనార్ తన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు. నా వ్యక్తిగత ఫేస్‌బుక్ పేజీ లింక్ "(https://facebook.com/share/¡DHPndApWj/)'. 'ఇది మినహా నా పేరుతో ఉన్న మిగతా ఖాతాలన్నీ నకిలివే. మెటా యాజమాన్యం సహకారంతో ఫేక్ ఖాతాలను హైదరాబాద్ సైబర్ క్రైం టీం తొలగించే పనిలో ఉంది. నా పేరుతో గానీ, ఏ అధికారి/ప్రముఖ వ్యక్తి పేరుతో గానీ ఫేస్‌బుక్‌లో వచ్చే విజ్ఞప్తులకు స్పందించకండి, అలా వచ్చే సందేశాలను నమ్మకండి. ఎవరైనా మెసేజ్‌లు చేస్తే.. ముందుగా ఆ వ్యక్తిని ఫోన్‌లో లేదా స్వయంగా గానీ సంప్రదించండి.. అనుమానాస్పద లింకులు, మెసేజ్‌లు, వీడియో కాల్స్‌ను బ్లాక్ చేసి రిపోర్ట్ చేయండి.

సైబర్ మోసాలపై 1930 హెల్ప్‌లైన్‌కు లేదా http://cybercrime.gov.inకు ఫిర్యాదు చేయండి. 'జాగ్రత్తగా ఉంటేనే సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా డబ్బును కాపాడుకోగలుగుతాం' అని ప్రజలకు సజ్జనార్ సూచించారు.





పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ పత్రాలు, కంప్యూటర్, స్కానర్, సీపీయూ

నకిలీ పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్లు

తయారు చేస్తున్న ఇద్దరి అరెస్ట్.. పలు పత్రాలు, సామగ్రి స్వాధీనం

రాయదుర్గం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నకిలీ పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్లతోపాటు పలు ధ్రువపత్రాలు తయారు చేస్తున్న ముఠా గుట్టురట్టు చేశారు మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు. ఇద్దరు కీలక వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి నుంచి నకిలీ పత్రాలు, తయారీ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాదాపూర్ ఏసీపీ శ్రీధర్ వివరాలు వెల్లడించారు. గచ్చిబౌలి ఇందిరానగర్‌లో జిరాక్స్ కేంద్రాన్ని అడ్డాగా చేసుకుని కొంత మంది నకిలీ పత్రాలు తయారీ చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు దాడిచేసి నకిలీ పత్రాలు తయారు చేస్తున్న నిందితులు మహమ్మద్ నజీద్, గంట రాజీవ్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి నకిలీ పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్లు, నకిలీ పేబిల్స్, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు, వివిధ విద్యాసంస్థలకు చెందిన మార్కుల మెమోలు, పాన్‌కార్డులు, ఫేక్ మెడికల్ రిపోర్టులు, థెరపీ సర్టిఫికెట్స్, ఫేక్ హోంగార్డు ఐడీ కార్డులు, కంప్యూటర్, సీపీయూ స్వాధీనం చేసుకున్నారు. మరో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఏసీపీ తెలిపారు.

200 ఏళ్లు మన్నేలా బ్రాస్ గ్రిల్స్: కొండా సురేఖ

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆత్మ గౌరవానికి మేడారం సమ్మక్క-సారక్క జాతర ప్రతీక అని మంత్రి కొండా సురేఖ అన్నారు. మేడారం జాతరలో అమ్మవారి దగ్గెల చుట్టూ భక్తుల క్యూలైన్‌ల కోసం ఏర్పాటు చేయిస్తున్న బ్రాస్‌గ్రిల్స్ నమూనాను సచివాలయంలో మంత్రి సురేఖ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచ నలుమూలల నుంచి కోట్లాది మంది భక్తులు అమ్మ వారిని దర్శించు కునేందుకు మేడారం వస్తుంటారన్నారు. భక్తులు క్యూలో సాఫీగా వెళ్లేందుకు బ్రాస్ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుమారు 200 ఏళ్లపాటు మన్నికగా ఉండేలా గ్రిల్స్‌ను పటిష్ఠంగా తయారు చేయిస్తున్నామన్నారు.

'క్యాబినేట్ సమావేశంలో ఆర్టీసీ కార్మికుల వేతనాలపై చర్చించాలి'

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) కార్మికుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్ష తన సోమవారం జరిగే క్యాబినేట్ సమావేశంలో చర్చించాలని కార్మికులు కోరుతున్నారు. సంవత్సరానికి రూ.9వేల కోట్ల ఆదాయం సమకూరుతున్న ఆర్టీసీలో కార్మికులకు 55 నెలలుగా వేతనాలు పెంచక పోవడం సరైంది కాదని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు 2021 ఏప్రిల్ నుంచి 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ ప్రకటించాలని సీఎం రేవంత్ రెడ్డికి శనివారం ఒక ప్రకటనలో నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

రేపు కలెక్టరేట్‌లో ప్రజావాణి

● జీహెచ్‌ఎంసీలో పునరుద్ధరణ

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ఈనెల 17న (సోమవారం) ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హరిచందన దాసరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో ఎన్నకల కోడ్ ఆదివారంతో ముగిసిందని, దాంతో ప్రజా వాణిని సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కాగా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాల యంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 17వ తేదీ నుంచి యథావిధిగా కొనసాగుతుందని అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఎన్నిక ముగిసినందున సోమవారం (రేపు)నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ పునరుద్ధరించింది.

గచ్చిబౌలి ఫైనాన్సియల్ డిస్ట్రిక్‌లో నేడు సేల్స్‌ఫోర్స్ 5కే రన్

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సేల్స్‌ఫోర్స్ ఐటీ కంపెనీ గచ్చిబౌలి ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లో 5కే రన్ నిర్వహిస్తుంది. ఈ నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు 5కే రన్ ఉంటుందని, ఈ రన్ ఫైనాన్సియల్ డిస్ట్రిక్‌లోని లీగ్ ఎరినా నుంచి ప్రారంభమై నెక్స్‌వేవ్ టెక్నాలజీస్, టీ-గ్రిల్స్ జంక్షన్, వన్‌గోల్ఫ్ రోటరీ, అన్వయ టీ జంక్షన్ మీదుగా హెచ్ఎండీఏ కొత్తగా నిర్మించిన రోడ్డు మీదుగా తిరిగి మళ్లీ వన్ గోల్ఫ్ రోటరికీ, అక్కడి నుంచి టీ గ్రిల్స్ మీదుగా మళ్లీ లీగ్ ఎరినా వద్ద ముగుస్తుందని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ మార్గాల్లో రాకపోకలు సాగించే వారు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 9, 10వ తరగతి బీసీ విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఆశన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఏడాదికి రూ.4వేల చొప్పున ప్రభుత్వం ఉపకార వేతనం అందిస్తుందన్నారు. డిసెంబర్ 15లోపు https://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకో వాలన్నారు. ఆధార్‌కార్డు, కులం, ఆదాయం సర్టిఫికెట్లు (గ్రామీణ ప్రాంతా నికి చెందిన కుటుంబ యజమాని వార్షిక ఆదాయము రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతం ప్రాంతానికి చెందిన వారి ఆదాయము రూ.2 లక్షల లోపు ఉండాలి), పాస్ ఫొటో, బ్యాంకు పాస్‌బుక్ కాపీ, స్టడీ సర్టిఫికెట్లు ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత హార్డ్ కాపీలు, ధ్రువీకరణ పత్రాలను హైదరాబాద్ కలెక్టరేట్ లోని బీసీ సంక్షేమశాఖ ఆఫీస్‌లో లేదా ఏదైనా బీసీ హాస్టల్ వార్డెన్‌కు అందించాలని అన్నారు.

నెక్ట్స్ టార్గెట్.. గ్రేటర్

(5వ పేజీ తరువాయి)

బ్లాక్‌ల వారీగా కమిటీలు వేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. డీసీసీ అధ్యక్షులుగా ఎంపీ, ఎమ్మెల్యేలను నియమించాలని పార్టీ భావి స్తోంది. డీసీసీ సికింద్రాబాద్ అధ్యక్షుడిగా ఉన్న ఎంపీ అనిల్‌కుమార్‌యా దవ్‌ను యథావిధిగా కొనసాగించే అవకాశాలున్నాయి. ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా ఎవరిని నియమిస్తారనే ఆసక్తి నెలకొంది. కాగా, గతంలో గ్రేటర్‌లో కాంగ్రెస్‌కు బలమైన నాయకత్వం ఉండగా.. దాన్ని కొనసాగించడానికి కసరత్తు చేస్తోంది. ఇతర పార్టీల్లో ఉండే ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించాలని అగ్రనేతలు భావిస్తు న్నారు. దాంతో పాటు ఎన్నో ఏళ్లుగా పార్టీని అంటి పెట్టుకొని ఉన్న గ్రేటర్ లోని ముఖ్య నేతలకు నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించడానికి చర్యలు చేపడుతున్నారు.

హైడ్రా అంటే అభయం

(5వ పేజీ తరువాయి)

ఈ ఏడాది జూలైలో మార్కింగ్ చేశారని, నిద్రలేని రాత్రులు గడుపు తున్నామని స్థానికులు హైడ్రా కమిషనర్‌కు వివరించారు.

అధికారులపై చర్యకు సిఫారసు

స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సుద్ధ కుంటను పరిశీలించి ఇళ్లపై వేసిన మార్కింగ్ చూశారు. అక్రమంగా ఇళ్లపై మార్కింగ్ వేసి భయభ్రాంతులకు గురి చేసిన హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులపై చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. చెరువు వద్ద ఉంటున్న వారు భయపడవలసిన అవసరం లేదన్నారు. ఎఫ్‌టీఎల్ పరి ధిలోకి వస్తాయంటూ సుమారు 48 ఇళ్లపై స్థానిక అధికారులు మార్కింగ్ చేయడాన్ని తప్పు బట్టారు. 30 ఏళ్ల నుంచి ఉంటున్న వారి జోలికి వెళ్లడం ఏంటని ప్రశ్నించారు. ఇళ్లపై మార్కింగ్‌లను వెంటనే తొల గించాలని ఆదేశించారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రకారమే ముందుకు వెళతా మని హైడ్రా కమిషనర్ స్పష్టం చేశారు. గత ఏడాది జూలై 19న హైడ్రాను ప్రభుత్వం తీసుకొచ్చిందని, ఈ తేదీకి ముందు నిర్మించి నివసి స్తున్న ఇళ్ల జోలికి వెళ్లబోమని ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానం కూడా అదే అన్నారు. హైడ్రా పేరిట బెదిరస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

జైళ్ల శాఖ స్థలం.. అక్రమ లీజ్‌పై హోం శాఖ సీరియస్

(5వ పేజీ తరువాయి)

ఆశ్రయించారు. ఈ కేసు కోర్టులో పెండింగ్‌లో ఉంది. నేటికీ ఆ స్థలం జైళ్ల శాఖ పర్యవేక్షణలో ఉంది. చంచల్‌గూడ ప్రెస్ నుంచి ఓవైసీ జంక్షన్ వరకు చేపడుతున్న స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ సంస్థ మెసర్స్ వెంకటరావు ఇన్‌ఫ్రా ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్‌కు తాత్కాలిక లీజ్ ప్రాతిపదికన కేటాయించా లని జీహెచ్ఎంసీ 24జూలై 2020న జైళ్ల శాఖను అభ్యర్థించింది. ఈ సమస్య పెండింగ్‌లో ఉండగానే.. ఏజెన్సీ ప్రైవేటు వ్యక్తులతో లీజు ఒప్పందం కుదుర్చుకుంది. వారు నెలనెలా అద్దె తీసుకుంటున్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపడితే ఉన్నతాధికారుల పాత్ర తేలే అవకాశం ఉంటుందని జైలు సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

ట్రాఫిక్ రద్దీకి పరిష్కారం లింక్ రోడ్లే

(5వ పేజీ తరువాయి)

గండిపేట పైపులైన్ రోడ్డు మీదుగా కోకాపేట విలేజ్ నుంచి మై హోం అవతార్ జంక్షన్ వరకు 100 అడుగుల విస్తీర్ణంతో లింకు రోడ్డును నిర్మిం చేందుకు అనుకూలంగా ఉందని పోలీసులు చెబుతున్నారు. హెచ్ఎండీ ఏ, నార్సింగ్ మునిసిపాలిటీ అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి లింక్ రోడ్డును అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.



ఎంఓయూ పత్రాలను మార్చుకుంటున్న పీఆర్ఎస్ఐ, భవిష్య స్కూల్స్ ప్రతినిధులు

పాఠశాలలకు చేరువగా ప్రజా సంబంధాలు

● భవిష్య ఇంటర్నేషల్ స్కూల్‌తో పీఆర్ఎస్ఐ ఎంఓయూ

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'కార్పొరేట్స్ నుంచి పాఠశాలలకు ప్రజా సంబంధాలు' చేరువ తమ ఉద్దేశమని పీఆర్ఎస్ఐ ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్ఎస్ఐ) హస్తినాపురంలోని శ్రీభవిష్య ఇంటర్నేషనల్ స్కూల్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. శనివారం పీఆర్ఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ ఛైర్మన్ డాక్టర్ గిరిగౌడ్, భవిష్య పాఠశాల ప్రిన్సిపాల్ మమత ఒప్పంద పత్రాల(ఎంఓయూ)పై సంతకాలు చేశారు. వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధికి కమ్యూనికేషన్, నాయకత్వం, ప్రజా సంబంధాల నైపుణ్యాల ప్రాముఖ్యతను విద్యార్థులకు పరిచయం చేయడమే ఒప్పందం లక్ష్యమని పీఆర్ఎస్ఐ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్ఎస్ఐ మాజీ ఛైర్మన్లు కృష్ణబాజీ, గోవింద్ రాజ్, బాబ్జీ, రాష్ట్ర కార్యదర్శి కళ్యాణ రాజేశ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాధవరావు, అవుసుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చేయి చేయి కలుపుతాం.. అవినీతిని అరికడతాం..

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో జీరో టాలెరన్స్ విధానానికి అనుగుణంగా విధులు నిర్వహించాలనే లక్ష్యంతో హౌసింగ్ కార్పొరేషన్ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అవినీతి లేకుండా పారదర్శకంగా గృహనిర్మాణ పథకాలను లబ్ధిదారులకు అందించేలా 'చేయి చేయి కలుపుతాం.. అవినీతిని అరికడతాం' అంటూ శనివారం ఎండీ వీపీ గౌతం నేతృత్వంలో ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హౌసింగ్ కార్పొరేషన్ ఉద్యోగులతో కలిసి అవినీతికి వ్యతిరేకంగా లబర్టీ సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవినీతికి వ్యతిరేకంగా చేపడుతున్న కాల్ సెంటర్, హెల్ప్‌డెస్క్ వివరాలతో కూడి పోస్టర్లను ఆవిష్కరించారు. లంచం వద్దు, సేవే లక్ష్యం, నిజాయితీ మా విలువ, అవినీతి మా శత్రువు, అవినీతికి నో, బాధ్యతకు ఎస్ వంటి నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అవినీతికి పాల్పడితే కఠినచర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు పెడుతున్నారు.

పెట్రోల్ పోసి చంపుతాం

● అధికారులను బెదిరించిన నలుగురిపై కేసు

● రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఘటన

ఆదిభట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులను అసభ్యకరంగా తిడుతూ, పెట్రోల్ పోసి చంపుతానని బెదిరించిన నలుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన శనివారం రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిపేట మండల మణికొండకు చెందిన కస్తూరి శ్రీనివాస్, మద్దినేని రమేష్‌బాబు, యడ్లపాటి భానుఉదయ్, జాస్తీ రవీంద్రనాథ్ ఠాగూర్ రంగారెడ్డి జిల్లా కొంగర కలాన్‌లోని కలెక్టరేట్‌లోని జిల్లా సహకార అధికారి సుధాకర్ (డీసీవో)ను కలవడానికి కార్యాలయానికి వచ్చారు. డీసీవోను కలిసి మణికొండ పరిధిలోని సొసైటీ ఓటర్ల జాబితా గురించి సందేహాలు అడిగారు. దాంతో డీసీవో ఓటర్ల జాబితాను పరిశీలిస్తామని, తనకు వ్యవసాయశాఖ మంత్రితో వీడియో కాన్ఫరెన్స్ ఉంది. సూపరింటెం డెంట్‌ను కలవాలని సూచించారు. దీంతో వారందరు సూపరింటెం డెంట్‌ను చుట్టిముట్టి అసభ్యకరంగా తిడుతూ.. డీసీవో లంచాలు తీసకుం టున్నాడని, చెప్పుల దండ వేస్తామని, పెట్రోల్ పోసి చంపుతామని బెదిరించినట్లు తెలిపారు. డీసీవో ఆదిభట్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈవీఎంల ట్యాంపరింగ్ వల్లే బిహార్‌లో ఎన్డీఏ గెలుపు



డాక్టర్ భీమ్‌రావ్ యశ్వంత్ అంబేడ్కర్‌ను సత్కరిస్తున్న ఆధార్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శేషగిరి రావు గౌడ్ తదితరులు

బర్కత్‌పుర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయడం వల్లనే బిహార్ ఎన్నికల్లో ఎన్డీఏ విజయం సాధించిందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (భీమ్‌రావ్ అంబేడ్కర్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ భీమ్ రావు యశ్వంత్ అంబేడ్కర్ ఆరోపించారు. ఈవీఎంలను రద్దు చేసి బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆధార్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తుంగలో తొక్కుతుందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని ప్రజా స్వామ్య విలువలను పరిరక్షించడానికి ఈవీఎంలను రద్దు చేయాలనే డిమాండ్‌తో దేశ వ్యాప్తంగా ఉద్యమం చేపడుతున్నామని ఆయన తెలిపారు. దీనిలో భాగంగా డిసెంబర్‌లో ఢిల్లీలోని రాంలీలా మైదానంలో భారీ బహిరంగ సభ, జనవరి 3న హైదరాబాద్‌లో, నవంబర్ 21న చెన్నైలో సభలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఆధార్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శేషగిరి రావు గౌడ్ మాట్లాడుతూ... తెలంగాణలో సామాజిక న్యాయం సాధించడానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ బీసీలు ఏకమై బహుజన రాజ్యాన్ని స్థాపిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, ఆధార్‌పార్టీ నేతలు బుడ్డయ్య, వెంకటేశ్వర్‌లు, సావగాని మణి, నవీన్ కుమార్, ఎంఎం గౌడ్, గోపీనాథ్, వేముల రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా



బస్తీ బాటలో విద్యుత్ అధికారులు

పహాడీషరీఫ్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని టీజీఎస్‌పీడీసీ ఎల్ డైరెక్టర్ కమర్షియల్ సి. చక్రపాణి తెలిపారు. బస్తీ బాటలో భాగంగా, రాజేంద్రనగర్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీరామ్ మోహన్, కందుకూరు డీఈ గోపాలకృష్ణ, మామిడిపల్లి ఏడీఈ శంకర్, పహాడీషరీఫ్ ఏఈ సత్యనారాయణ విద్యుత్ సిబ్బందితో కలిసి కాలనీల్లో ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర సమస్యలను, వేలాడే తీగను, పాడైన స్తంభాల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ స్తంభాలకు వైర్లు లేవని, కొత్త విద్యుత్ స్తంభాల అవసరం ఉందని, స్ట్రీట్ లైట్స్ ఇతర సమస్యలు ఉన్నాయని చెప్పారు. సమ స్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో, లైన్మెన్లు, తదితరులు పాల్గొన్నారు.

'జాడు చలావ్' పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

రాజేంద్రనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆమ్ ఆద్మీ పార్టీ మైలార్‌దేవుపల్లి కో ఆర్డినేటర్ డాక్టర్ బేగ్ ఆధ్వర్యంలో శనివారం మైలార్‌దేవుపల్లి, శాస్త్రీపురం డివిజన్ ప్రాంతాల్లో జాడు చలావ్ అనే పేరుతో పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎంఏ బేగ్ మాట్లాడుతూ, ప్రతి గల్లీలో ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బుర్ర రాము గౌడ్, దిడ్డి సుధాకర్, హేమ సుదర్శన్ జిల్లోజు, జావీద్ షరీఫ్, లియాకత్ ఖాన్, దర్శనం రమేష్, వివేక్, రమ్యగౌడ్ పాల్గొన్నారు.

త్వరలో రాజేంద్రనగర్ డివిజన్‌లో..

ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి, అవినీతి ని పారద్రోలడానికి ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో జాడు చలావ్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని రాజేంద్రనగర్ డివిజన్ కో ఆర్డినేటర్ హేమ సుదర్శన్ జిల్లోజు తెలిపారు. త్వరలోనే రాజేంద్రనగర్ డివిజన్‌లో పాదయాత్ర ప్రారంభిస్తామన్నారు.

ప్రవాస విద్యార్థులకు 'ఆటా' దిశానిర్దేశం



కార్యక్రమంలో పాల్గొన్న టెక్ ఎంటర్‌ప్రెన్యూర్లు రవి రెడ్డి, కిరణ్ పాశం

రవీంద్రభారతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో భారతీయ విద్యార్థులు ఎదుర్కొంటున్న భద్రత, ఇమ్మిగ్రేషన్, కెరీర్ అవకాశాలు వంటి సవాళ్లపై అవగాహన కల్పిస్తూ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్-మిల్వాకీలో స్టూడెంట్ ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ భారతీయ విద్యార్థి సంఘాల సహకారంతో జరిగిన ఈకార్యక్రమంలో పోలీసు అధికారులు, ఇమ్మిగ్రేషన్ న్యాయవాదులు, కెరీర్ కౌన్సెలర్లు, బీమా నిపుణులు విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించారు. యూడబ్ల్యూ-మిల్వాకీ పోలీసుచీఫ్ బ్రయన్ స్విటాలా, లెఫ్టినెంట్ అలెగ్జాండర్ ఈవెండ్ భద్రతా అంశాలపై సూచనలిచ్చారు. ఎకనామిక్స్ ఎమెరిటస్ ప్రొఫెసర్ డాక్టర్ స్వర్ణజిత్ అరోరా గ్లోబల్ కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రాముఖ్యతను వివరించారు.

డాక్టర్ ప్రేంరాజ్ యాదవ్‌కు పరామర్శ

రాజేంద్రనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శంషాబాద్‌కు చెందిన డాక్టర్ ప్రేంరాజ్ యాదవ్‌ను నగర బీజేపీ అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు శనివారం పరామర్శించారు. ప్రేంరాజ్‌ను పరామర్శించిన వారిలో బీజేపీ నాయకులు వై.శ్రీధర్, పి.మల్లేశ్ యాదవ్, వేణు గోపాల్ తదితరులు ఉన్నారు.

డాక్టర్ విజయభారతి రచనలను ప్రత్యేక గ్రంథంగా తీసుకురావాలి

● ప్రొఫెసర్ ఘంట చక్రపాణి



డాక్టర్ బి.విజయభారతి రెండు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ ఘంట చక్రపాణి, డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, మెర్సీ మార్గరేట్ తదితరులు

బర్కత్‌పుర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయితి, తెలుగు అకాడమి మాజీ డైరెక్టర్ డాక్టర్ బి.విజయభారతి రచించిన సమగ్ర రచనలను ప్రత్యేక గ్రంథంగా ప్రచురించాలని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఘంట చక్రపాణి కోరారు. సనాతన ధర్మంలోని లోపాలను డా.విజయభారతి తన రచనల ద్వారా బట్టబయలు చేసిందన్నారు. అసమానతలు, వివక్ష, అంతరాలు ఉన్నంత వరకు ఆత్మగౌరవ ఉద్యమాలు వస్తూనే ఉంటాయన్నారు. డా.విజయభారతి తన రచనల ద్వారా తనలోని వేదనలను ప్రస్ఫూటింపజేశారని అన్నారు. శనివారం రాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో డాక్టర్ బి.విజయభారతి 84వ జయంతి సందర్భంగా ఆమె రచించిన రెండు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. బొజ్జా తారకం ట్రస్ట్, డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రజలకు అర్థమయ్యేరీతిలో రచనలు చేసిందన్నారు. 25 ఏళ్లపాటు రచనలు చేసి అనేక విషయాలను సమాజానికి తెలియజేసిందన్నారు. ఆమె 19 రచనలు సమాజాన్ని చైతన్య పరిచాయని, దళితులపై జరుగుతున్న దాడులను తన రచనల ద్వారా తెలియజేసిందన్నారు. ఆమె రచనలు నేటితరానికి మార్గదర్శకమని కొనియాడారు. డాక్టర్ బి.విజయభారతి రచించిన ఆత్మగౌరవ పోరాటాలు ఒక పరిశీలన పుస్తకాన్ని ప్రముఖ చరిత్రకారులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ ఆవిష్కరించి మాట్లాడారు. అసమానతలకు వ్యతిరేకంగా అనేక రచనలు చేశారని, డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ జీవిత చరిత్రను తెలుగులో తీసుకొచ్చి అనేక మందిని చైతన్యం చేసిందన్నారు. ఆమె తెలుగులో రాసిన జ్యోతిరావు పూలే పుస్తకం కూడా అనేక విషయాలను తెలియజేసిందన్నారు. ఆత్మగౌరవ పోరాటాల గురించి అనేక రచనలు చేశారని అన్నారు. మరో పుస్తకం విజయ కవితా సంపుటిని ప్రముఖ కవయిత్రి మెర్సీ మార్గరేట్ ఆవిష్కరించి మాట్లాడారు. పగిలిన అద్దం పెంకులు దర్గా గుడి కవిత చాలా బాగా రాశారని అన్నారు. ప్రకృతి నుంచి సంస్కృతి పుడుతుందని ఆమె ఘంటాపథంగా చెప్పారని అన్నారు. విజయభారతి కవితలు చదువుతుంటే విజయభారతి నిజంగా మాట్లాడినట్లే ఉన్నాయని అన్నారు. ఈ ఆవిష్కరణ సభకు డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ లింగయ్య అధ్యక్షత వహించగా ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.సత్యనారాయణ, సిటీ కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ కోయి కోటేశ్వరరావు, దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రతినిధి గీతా రామస్వామి, బొజ్జ తారకం ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గనుమనుల జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రాంతిగురు లహుజీ సాల్వే జయంతి

రవీంద్రభారతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక సంస్కర్త 'క్రాంతిగురు' లహుజీ రఘోజీ సాల్వే 231వ జయంతి వేడుకలు రవీంద్రభారతిలో భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ సహకారంతో తెలంగాణ మాంగ్ సమాజ్ ఆధ్వర్యంలో 'రాష్ట్రీయ స్వతంత్ర సంకల్ప దివస్' పేరిట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.కాశీం, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డా. ఎ.నరసింహా రెడ్డి, సాహిత్య అకాడమీ సెక్రటరీ డా. ఎన్. బాలచారి, జర్నలిస్ట్ జంగిటి వెంకటేష్ తదితరులు పాల్గొని లహుజీ సాల్వే సాయుధ స్వాతంత్ర్య పోరాట సేవలను స్మరించారు. గాయక్వాడ్ తులసిదాస్ మాంగ్ తెలుగులో అనువదించిన 'క్రాంతిపిత గురువర్య లహుజీ సాల్వే' పుస్తకాన్ని, జంగిటి వెంకటేష్ రచించిన పాటను అతిథులు ఆవిష్కరించారు. లహుజీ సాల్వే జీవితం, సేవలను పాఠ్యాంశాల్లో చేర్చాలని వక్తలు కోరారు. జయంతిని ప్రభుత్వమే 'రాష్ట్రీయ స్వతంత్ర సంకల్ప దివస్'గా ప్రకటించాలని మాంగ్ సమాజ్ డిమాండ్ చేసింది. కార్యక్రమంలో మాంగ్ సమాజ్ రాష్ట్ర, జిల్లా నాయకులు, అధికారులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి పరిరక్షణ మన బాధ్యత

● జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

రవీంద్రభారతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): "భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించడం మన బాధ్యత" అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి అన్నారు. శనివారం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో రాష్ట్ర భాషా సంస్కృతిక శాఖ, తెలంగాణ సంగిత నాటక అకాడమీ ఆధ్వర్యంలో నవ్య నాటక సమితి నిర్వహిస్తున్న 50వ అఖిల భారత సంగీత, నృత్య పోటీలు ప్రారంభమయ్యాయి. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ అలిశెట్టి మాట్లాడుతూ, సంగీతం, నృత్యం, లలిత కళలు భారతీయ సంస్కృతిలో అంతర్భాగాలని, చిన్ననాటి నుంచే పిల్లల్లో కళల పట్ల అభిరుచిని పెంపొందించడం అత్యంత అవసరమని సూచించారు. సభాధ్యక్షులుగా పాల్గొన్న రాష్ట్ర పూర్వ సలహాదారు డా. కేవీ రమణాచారి మాట్లాడుతూ, 1961లో ప్రారంభమైన నవ్య నాటక సమితి 67 ఏళ్లుగా జాతీయ స్థాయిలో శాస్త్రీయ సంగీత, నృత్య పోటీలను నిర్వహిస్తూ వేలాది యువ కళాకారులను ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. సమితి వ్యవస్థాపకులు స్వర్గీయ వేమరాజు నరసింహారావు క్రమశిక్షణ, సమయపాలన, నిస్వార్థ సేవలతో సాంస్కృతిక రంగంలో చిరస్థాయిగా నిలిచారని చెప్పారు. రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉప సంచాలకురాలు జి.వసుంధర గౌరవ అతిథిగా పాల్గొని నవ్య నాటక సమితి కార్యక్రమాలు నూతనోత్సాహంతో సాగుతున్నాయన్నారు. సమితి ఉపాధ్యక్షురాలు సింగరాజు లక్ష్మి సమితి ఆశయాలు, వ్యవస్థాపకుడి సేవలను వివరించారు. సమితి అధ్యక్షు లు వేమరాజు విజయకుమార్ సభకు స్వాగ తం పలికారు. కూచిపూడి నృత్యం - జూనియర్ విభాగం పోటీలు జరిగాయి.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



లోక్ అదాలత్‌లో తీర్పు పత్రం అందజేస్తున్న న్యాయ మూర్తులు

చార్మినార్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకొని సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని సిటీ సివిల్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ఎస్.శశిధర్ రెడ్డి సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులోని జరిగిన లోక్ అదాలత్‌లో 67 కేసులు పరిష్కరించబడ్డాయి. పరిహారం మొత్తం రూ 2.67 కోట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సిటీ సివిల్ కోర్టు కార్యనిర్వాహక చైర్మన్ శ్యామ్ కోషి, మెంబర్ సెక్రటరీ పంచాక్షరి, న్యాయ మూర్తులు షౌకత్ జహాన్ సిద్ధిఖీ, సురేష్ కుమార్, ఇతర న్యాయ అధికారులు, న్యాయ వాదులు కక్షిదారులు, తదితరులు పాల్గొన్నారు.

లక్కీషా బంజారాకు భారత రత్న ప్రకటించాలి



మాట్లాడుతున్న తెలంగాణ గోర్ సేనా అధ్యక్షుడు దారావత్ రాందాస్ నాయక్

బర్కత్‌పుర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బంజారాల సమాజం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన లక్కీషా బంజారాకు భారతరత్న ప్రకటించాలని తెలంగాణ గోర్ సేనా అధ్యక్షుడు దారావత్ రాందాస్ నాయక్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంట్ భవనం ఎదుట ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... లక్కీషా జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని, గోర్ బోలీ భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈనెల 24, 25వ తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా లక్కీషా బంజార పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. సమావేశంలో గోర్‌సేనా నేతలు హరిరాం నాయక్, రాజూనాయర్, తిరుపతి నాయక్, సంజూరాథోడ్, పురందాస్ రాథోడ్, రమేష్ రాథోడ్, శ్రీనివాస్ నాయక్, సునీల్ నాయక్, రాజు చవాన్, సూర్యప్రకాష్ నాయక్ పాల్గొన్నారు.

అడ్వకేట్స్ న్యాయవాద వృత్తికి వన్నె తేవాలి



మాట్లాడుతున్న సునీల్ కుమార్ గౌడ్

బర్కత్‌పుర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అడ్వకేట్స్ న్యాయవాద వృత్తికే వన్నె తెచ్చేలా అకిత భావంతో పనిచేయాలని బార్ కౌన్సిల్ తెలంగాణ వైస్ చైర్మన్ సునీల్ కుమార్ గౌడ్ కోరారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తరంగా ఫౌండేషన్ చైర్మన్ సిల్వేర్ వెంకటకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ అడ్వకేట్స్ మొదటి మీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 25లక్షల మంది న్యాయవాదులు ఉన్నారని, తెలంగాణలో 60వేల మంది ఉన్నారన్నారు. దేశంలోని వివిధ కోర్టులలో 4 కోట్ల 50లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నేటి సమాజానికి న్యాయం చాలా అవసరమని, న్యాయవాద వృత్తికి మంచి పేరు తేవాలని ఆయన సూచించారు. 35 ఏళ్లలోపు న్యాయవాదులు వెల్ఫేర్ ఫండ్‌లో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. బార్‌కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు న్యాయవాదులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది టి.జయంత్ జయసూర్య, హ్యూమన్‌రైట్స్ న్యాయవాది సత్య, క్రిమినల్ న్యాయవాది ఎస్.వెంకట్ కుమార్ గౌడ్, శ్రీనివాసాచారి, జయంతి తదితరులు పాల్గొన్నారు.

'యువత మానసిక సవాళ్లను ఎదుర్కోవాలి'

రాజేంద్రనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తమ భవిష్యత్తుపై దుష్ప్రభవాన్ని కలిగించే ఆలోచనలతో అప్రమత్తంగా ఉండాలని, జీవితంలో ఎదురయ్యే మానసిక సవాళ్లను ఎదుర్కొంటే ఆత్మవిశ్వాసమే ఆయుధంగా నిలుస్తుందని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎంఏ కరీం అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ తెలంగాణ ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్‌లోని కో ఆపరేటివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో జాతీయ గిరిజన యువజన మార్పిడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఎంఏ కరీం మానసిక వ్యక్తిత్వంతో పాటు సమాజాభివృద్ధి అనే అంశంపై ప్రసంగించారు. మనోవికాసాన్ని పెంపొందించుకుని మానసిక ఒత్తిడిని అధిగమిస్తే జీవితంలో యువత ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు.



● జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించడంతో బర్కత్‌పురలో కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దిడ్డి రాంబాబు ఆధ్వర్యంలో ఈ సంబరాలు జరిగాయి. ఈసందర్భంగా టపాకాయలు కాల్చి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్, వెంకటేష్, బంటి, కిషోర్‌యాదవ్, రోహన్, దీపక్, భారతమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.
- బర్కత్‌పుర, నవబంరు 15(ఆంధ్రజ్యోతి)

నైపుణ్యాభివృద్ధికి సెట్విన్ ఉచిత శిక్షణ

● ఎంపికైన వారికి ప్రతి నెలా రూ. 2 వేలు స్టైఫండ్

చార్మినార్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి కోసం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్ గార్ యోజన (పీఎంవికాస్) కార్యక్రమం ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్ ఆధ్వర్యంలో మూడు కోర్సుల్లో శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాలరావు తెలిపారు. కాస్మోటాలజిస్ట్, వేర్ హౌసింగ్ సూపర్ వైజర్, ఎమెర్జెన్సీ కేర్ అసిస్టెంట్ కోర్సులలో శిక్షణ అందించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్, జైన్, పార్సి, సిఖ్, బుద్దిస్ట్‌కు సంబంధించిన నిరుద్యోగ యువతీ యువకులకు పదో తరగతి పైన చదువుకున్న వారి ఈ కార్యక్రమంలో ఉచితంగా శిక్షణ పొందవచ్చని తెలిపారు. శిక్షణ కాలంలో ప్రతి నెలా రూ. 2వేలు స్టయిఫండ్ అభ్యర్థి ఖాతాలో జమ చేయడం జరుగుతోందన్నారు. జంటనగరాల్లో మోతిగల్లి, సీతాఫల్ మండి, రియాసత్ నగర్, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోని సెట్విన్ శిక్షణ కేంద్రాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, అర్హులైన ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఆయా కేంద్రాలను సంప్రదించడం లేదా 9985122244 ద్వారా ఇతర వివరాలు పొందవచ్చని కోరారు. కేంద్రం ప్రభుత్వం ఎంతో గొప్ప ఆశయంతో ప్రవేశపెట్టిన ఈ శిక్షణ కార్యక్రమంలో యువతీ యువకులు పాల్గొని జీవితంలో స్థిరపడేందుకు ఉద్దేశించిన శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుటుంబం.. సమాజానికి మూల స్తంభం



కార్పొరేటర్ అర్చనను సన్మానిస్తున్న శ్రీ సరస్వతి శిశు మందిరం ప్రతినిధులు

రాజేంద్రనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కుటుంబం సమాజానికి మూల స్థంభమని విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు ఆర్.అనురాధ, ఆర్ఎస్ఎస్ సేవికా సమితి సభ్యులు కె. విజయలక్ష్మి అన్నారు. శివరాంపల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో శనివారం సప్త శక్తి సంఘం కార్యక్రమాన్ని మహిళలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ కార్పొరేటర్ పి.అర్చన జయప్రకాశ్‌తో పాటు పొదుపు సంఘం మహిళా అధ్యక్షురాలు మంజులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు కె శ్రీనివాస్, కమిటీ సభ్యులు సదాల చంద్రారెడ్డి, జి.అనిల్, కందాడ జంగారెడ్డి, గుమ్మడి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై గడపగడపకూ అవగాహన



గడపగడప తిరిగి అవగాహన కల్పిస్తున్న డీసీపీ స్నేహ మెహ్రా

చాంద్రాయణగుట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఇంట్లో ఒక సైబర్ సింబా ఉంటే సమాజం సురక్షితంగా ఉంటుందని దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా అన్నారు. హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్రప్రసాద్ వర్మ ఆధ్వర్యంలో శంషీర్‌గంజ్‌లోని శారదా విద్యాలయంలో అవగహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని ప్రదర్శన నిర్వహించి. సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలను వివారించారు. అనంతరం ఎన్నికల ప్రచారం మాదిరిగా బ్యాండ్ మేళాలతో గడపగడప తిరిగి కరపత్రాలు పంచుతూ లాల్‌దర్వాజా, ఛత్రినాక, రాజాన్న బావి, కాల్వగడ్డ, గాయత్రి కాలనీలో పెద్ద ఎత్తున అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ వాడకంలో లేనప్పుడు డేటా(ఇంటర్నెట్), లోకేషన్, బ్లూ టూత్ ఆఫ్ చేసి పెట్టాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో నష్టపోతే తక్షణమే 1930లో ఫిర్యాదు చేయాలన్నారు. వాట్సప్‌లో వచ్చే లింక్లు ఓపెన్ చేయొద్దన్నారు. సైబర్ నేరాల్లో విద్యావంతులే అధికంగా మోసపోతుండడం బాధాకరమన్నారు. ఏ పోలీస్ అధికారి నేరుగా వాట్సప్ వీడియోకాల్స్ చేయరని, డిజిటల్ అరెస్టులు అని ఎవరైనా కాల్స్‌వస్తే పోలీస్ స్టేషన్లో వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. మారుతున్న టెక్నాలజీతో మోసగాళ్లు చెలరేగిపోతున్నారన్నారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మొహమ్మద్ మాజీద్, ఏసీపీలు సీహెచ్ చంద్రశేఖర్, ఎంఏ జావీద్,పి. చంద్రశేఖర్, శ్యామ్ సుందర్, ఛత్రినక అడిషనల్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ రావు, నాయకులు, ఆలయాల కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

చాంద్రాయణగుట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సంస్కార్ సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గౌలిపురా హనుమాన్‌నగర్‌లో ఎస్‌కేవీ బ్యాంక్వెట్ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు చైర్మన్ ఆకుల శ్రీరాములు తెలిపారు. శనివారం ఉచిత వైద్య శిబిరం కరపత్రాని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంస్కార్ సేవా ఫౌండేషన్, బేగంపేట కిమ్స్ సన్‌షైన్ ఆసుపత్రితో కలిసి నిర్వహిస్తున్న మెగా వైద్య శిబిరాని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కె.చంద్రకుమార్, డీఆర్ ప్రభాకర్, తిరుపతి శివకుమార్, కె.శ్రీధర్,పోసు కృష్ణ,భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జోటిక్ పంటలతో ఆదాయం మెరుగు



ఎగ్జోటిక్ పండ్ల తోటలు అనే అంశంపై రూపొందించిన పాలసీ పేపర్‌ను విడుదల చేస్తున్న శాస్త్రవేత్తలు

రాజేంద్రనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పత్తి, వరితోనే 80 శాతం వ్యవసాయం సాగుతున్న నేపథ్యంలో మారుతున్న పర్యావరణ మార్పులను తట్టుకునేందుకు ఉద్యాన పంటల వైపు మారాలని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. సుస్థిర వైవిధ్యానికి అధిక విలువ కలిగిన పండ్లు, పూల పంటలు అనే అంశంపై శనివారం రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సాగులో అధిక విస్తీర్ణంలో వ్యవసాయ పంటలు ఉన్నాయని, వాటి దిగుబడి తగ్గడంతో పాటు ఏక పంటల సాగు, పర్యావరణ మార్పుల నేపథ్యంలో రైతులకు తగినంత లాభసాటిగా ఉండేందుకు ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపాలన్నారు. రాష్ట్రంలో, దేశంలో గానీ ఎగ్జోటిక్ పండ్లు, పూల సాగు చేయాలంటే ముందుగా వాటి సాగు పద్ధతులను స్థిరీకరించాలని ప్రముఖ ఉద్యాన నిపుణులు డాక్టర్ ఎస్‌డీ శిఖామణి తెలిపారు. నీటి వినియోగం పెంచేందుకు, పోషక విలువలను వినియోగదారులకు అందజేస్తూనే తరచుగా బయ్యర్, సెల్లర్ మీటింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా సుస్థిర వైవిధ్యానికి ఎగ్జోటిక్ పండ్ల తోటలు అనే అంశంపై రచించిన పాలసీ పేపర్‌ను రిలీజ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యాన వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, డీన్ డాక్టర్ చీనా, విస్తరణ సంచాలకులు డాక్టర్ లక్ష్మీనారాయణ, రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రశాంత్, డాక్టర్ డి.అనిత కుమారి, డాక్టర్ పిడిగెం సైదయ్య, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలు తప్పనిసరి చేయాలి



మట్టి పరీక్ష విధానంపై అధికారులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

రాజేంద్రనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మట్టి పరీక్ష కిట్స్ వాడే విధానాలపై శనివారం రాజేంద్రనగర్ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ కేంద్రంలోని ప్రాంతీయ మట్టి పరీక్ష కేంద్రంలో రాష్ట్రంలోని మట్టి పరీక్ష కేంద్రాల అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని జాతీయ వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తల సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మట్టి పరీక్షా కిట్స్ వాడకంపై సీనియర్ శాస్త్రవేత్త బ్రజేంద్ర అధికారులకు వివరించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ ఉప సంచాలకులు డాక్టర్ కె.నిర్మల, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కల్పన, అగ్రికల్చర్ ఆఫీసర్ డాక్టర్ శిరీష, డాక్టర్ మానస పాల్గొన్నారు. మట్టి పరీక్షలు చేసే విధానాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. నేల స్వభావాన్ని తెలుసుకున్నప్పుడే సరైన మోతాదులో ఎరువులు వేసి పంటల అధిక దిగుబడికి మార్గం చూపవచ్చన్నారు.

2.0 రన్ కాదు సాంకేతిక భాష, కమ్యూనికేషన్‌కు సాధనం : మంత్రి లక్ష్మణ్‌కుమార్



రన్‌లో పాల్గొన్న మంత్రి, రన్నర్స్

గచ్చిబౌలి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): 2.0 రన్ మాత్రమే కాదు సాంకేతిక భాష, కమ్యూనికేషన్ సాధనంగా మార్చే కార్యక్రమం అని మైనార్టీ శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్, ఆకృతి మేనేజింగ్ డైరెక్టర్ బాబు అన్నారు. గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో ఆశ్రయ, ఆకృతి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శనివారం 2.0 రన్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై జెండా ఊపి ప్రారంభించారు. వినికిడి లోపం ఉన్న వారితో సమానంగా కమ్యూనికేట్ చేయాలనే ఉద్దేశంతో అవగాహన కల్పించేందుకు కార్యక్రమం నిర్వహించారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈయరింగ్ ఎయిర్స్ పంపిణీ, లైవ్‌సైన్స్ లాంగ్వేజ్ శిక్షణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు సుమారు 1500మంది పాల్గొన్నారు.

21న నటుడు రాజేంద్రప్రసాద్‌కు కాంతారావు పురస్కారం

హైదరాబాద్: ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్.. టి.ఎల్.కాంతారావు స్మారక జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు ఎంపిక కమిటీ చైర్మన్ కేవీ రమణాచారి, కన్వీనర్ నాగబాల సురేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న నిర్మాతల మండలి హాలులో జరిగే కార్యక్రమానికి తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు సహా పలువురు ప్రముఖులు హాజరవుతారని వారు పేర్కొన్నారు. కాంతారావు కుటుంబ సభ్యులు కూడా కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.

ఏఎంఐ హైదరాబాద్ చాప్టర్‌కు అంతర్జాతీయ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న ఓయూ మైక్రోబయాలజీ హెడ్ భీమా

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఓయూ మైక్రోబయాలజీ విభాగం, ఏఎంఐ (అసోసియేషన్ ఆఫ్ మైక్రోబయాలజిస్ట్స్ ఆఫ్ ఇండియా) హైదరాబాద్ చాప్టర్.. 'బెస్ట్ యూనిట్ అవార్డు' పొందింది. 2025-26 సంవత్సరానికి గాను ఈ పురస్కారాన్ని ఏఎంఐ సెంట్రల్ కౌన్సిల్, అకాడమీ ఆఫ్ మైక్రోబయాలజికల్ సైన్సెస్ (ఏఎంఎస్‌సీ) ప్రకటించగా ఈనెల 14న దేవ్‌భూమి ఉత్తరాఖండ్ యూనివర్సిటీ, డెహ్రాడూన్ వేదికగా జరిగిన 66వ ఏఎంఐ వార్షిక అంతర్జాతీయ మహాసభలో వర్సిటీ మైక్రోబయాలజీ శాఖాధిపతి, ఏఎంఐ హైదరాబాద్ యూనిట్ సెక్రటరీ ప్రొఫెసర్ బి.భీమా అందుకున్నారు. దక్షిణ భారతదేశంలో ఎంఎస్‌సీ మైక్రోబయాలజీ కోర్సును మొదటిసారి ప్రారంభించిన విశ్వవిద్యాలయంగా ఓయూ మైక్రోబయాలజీ విభాగం చరిత్ర సృష్టించడం విదితమే.

సీఎస్‌ఈతో అవకాశాలు మెండు

● జీనిట్స్ ప్లేస్‌మెంట్స్ డీన్ డాక్టర్ రవిప్రకాశ్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీటెక్ సీఎస్‌ఈతో అపారమైన ఉద్యోగావకాశాలున్నాయని జి.నారాయణమ్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (జీనిట్స్) ప్లేస్‌మెంట్స్ డీన్ డాక్టర్ ఐ. రవిప్రకాశ్‌రెడ్డి అన్నారు. నాలుగేళ్ల కోర్సులో ప్రణాళికాబద్ధంగా చదవాలని, టెక్నికల్, సాఫ్ట్ స్కిల్స్‌ను సమానంగా అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కంపెనీల్లో ఉద్యోగాలు సాధించేందుకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం ఆయన పలు సూచనలు చేశారు.

ఇంజినీరింగ్ విద్యలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్‌ఈ) బ్రాంచ్‌కు చాలా అవకాశాలు ఉన్నాయని, వీటిని సమర్థంగా వినియోగించుకోవాలంటే నాలుగేళ్ల కోర్సులో ప్రతీ సంవత్సరం పటిష్ఠంగా అభ్యసిస్తేనే కంపెనీల్లోకి ఆత్మవిశ్వాసంతో అడుగుపెడుతారని చెప్పారు. మొదటి సంవత్సరం అనేది బలమైన పునాది వేసుకునే దశగా ఉంటుందని, ఇందులో విద్యార్థులు కనీసం ఒక ప్రోగ్రామింగ్ భాష (సీ లేదా పైథాన్)లో పూర్తి ప్రావీణ్యం సాధించాలన్నారు. డేటా స్ట్రక్చర్, అల్గోరిథమ్స్ అంశాలను లోతుగా అధ్యయనం చేయడం అత్యంత అవసరమని, ఎందుకంటే ఇది ప్రతి టెక్నికల్ ఇంటర్వ్యూలో కీలకమైన భాగంగా ఉంటుందని పేర్కొన్నారు.

వారాంతపు పర్యాటకం.. అవకాశాలు అపారం

తెలంగాణ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్

హైదరాబాద్ సిటీ, గచ్చిబౌలి నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వారాంతపు పర్యాటకం (వీకెండ్ టూరిజం) తెలంగాణ లో అత్యంత వేగంగా పెరుగుతున్న విభాగమని తెలంగాణ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ)కు చెందిన టూరిజం కమిటీ, తెలంగాణ ప్రభుత్వ పర్యాటక శాఖకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్)తో కలిసి బిల్డింగ్ ద వీకెండ్ టూరిజం ఎకానమీ శీర్షికన గచ్చిబౌలిలోని నిథమ్ క్యాంపస్‌లో ఓ సదస్సు నిర్వహించింది.

హైదరాబాద్‌లో ఐటీ, లైఫ్ సైన్సెస్ రంగంలో 25 లక్షల మంది ఉద్యోగులు తరచుగా వారాంతాలలో దర్శనీయ స్థలాలను చూడాలనుకుంటున్నారని జయేష్ అన్నారు. ఇదే పెద్ద అవకాశాలనూ తీసుకు వస్తోందన్నారు. ఈ రోజుల్లో పర్యాటకం హాబీ కాదని, అదొక జీవనశైలిగా మారిందన్నారు. తెలంగాణటూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరి కాంతి మాట్లాడుతూ హైదరాబాద్‌లోనే 10 లక్షల మంది ఐటీ ఉద్యోగులు వీకెండ్ విరామాల కోసం ఎదురు చూస్తుంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం 150 వీకెంట్ గేట్‌వేలను గుర్తించి ప్రచారం



మాట్లాడుతున్న జయేష్ రంజన్

చేయాలని సూచించారు. టూరిజం పాలసీ ప్రకటించిన తరువాత 15 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు 31 ప్రాజెక్ట్‌లోకి వచ్చాయని వెల్లడించారు. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ భారతదేశపు వీకెండ్ టూరిజం రాజధానిగా హైదరాబాద్‌ను నిలపాల్సిన ఆవశ్యకతను తెలిపారు. కార్యక్రమంలో పలు అంశాలపై చర్చించారు.

ఎఫ్‌డీఐ ఆకర్షణలో తెలంగాణది అగ్రస్థానం

హైదరాబాద్ సిటీ, అమీర్‌పేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ ఎకానమీ విభాగంలో ఎఫ్‌డీఐ ఆకర్షణలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. భారతదేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ)లు అనే అంశంపై సామాజిక అధ్యయనాల సంస్థ (సెస్), తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్ (టీఈఏ)తో కలిసి సెస్ ఆడిటోరియంలో శనివారం సింపోజియాన్ని నిర్వహించారు. ఐటీ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వృద్ధిలో చెన్నై, బెంగుళూరు కన్నా హైదరాబాద్ అగ్రస్థానంలో ఉందని నొక్కి చెప్పారు. అందుకు ప్రధాన కారణం ప్రభుత్వ విధానాలతో పాటు ఇతర నగరాలతో పోలిస్తే 20 శాతం తక్కువ వేతనానికి ఎక్కువ శ్రమ చేయగల నిపుణులు ఇక్కడ అందుబాటులో ఉండడమే అని వివరించారు. దేశంలోని 12 రాష్ట్రాలతో పోలిస్తే విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలుస్తోందని తెలిపారు. చైనాకు చెందిన బీవైడీ ఎలక్ట్రికల్ వాహనాల తయారీ సంస్థ తెలంగాణలో పరిశ్రమ పెట్టడానికి సుముఖంగా ఉందని, కాకపోతే దౌత్యపరమైన అంశాల కారణంగా ఆ కంపెనీకి కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది అని చెప్పారు. హైదరాబాద్ లో కేంద్రం నెలకొల్పడానికి వచ్చిన ఓ అంతర్జాతీయ ఎయిరో స్పేస్ సంస్థ గుజరాత్ కు తరలి వెళ్లేలా కేంద్ర ప్రభుత్వం ఆ సంస్థ మీద ఒత్తిడి తెచ్చిందని పేర్కొన్నారు. ఇలా పలు సందర్భాలలో తెలంగాణకు వస్తున్న పరిశ్రమలను గుజరాత్, మహారాష్ట్ర వైపు మరల్చడంలో కేంద్రం ప్రయత్నిస్తుండడం విచారకరం అన్నారు. తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్స్ సంరక్షణ కోసం ప్రత్యేక ఆర్డినెన్స్ ను మరో 15 రోజుల్లో తీసుకురానుందని రంజన్ తెలిపారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను మరింత ఆకర్షించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకార పూర్వక విధానాలు అవసరం అని సూచించారు. హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డీన్ దెబాశిష్ ఆచార్య, సెస్ డైరెక్టర్ ప్రొ. రేవతి ప్రసంగించారు.

టాటా మోటార్స్ వద్ద నిరసన



నిరసన ప్రదర్శన చేస్తున్న సంఘాల నేతలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ.. టాటా మోటార్స్ ఔట్‌లెట్ వద్ద బాయ్‌కాట్ డైవెస్ట్‌మెంట్ శాంక్షన్స్ (బీడీఎస్), ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీనా (ఐపీఎస్‌పీ).. తదితర పౌర ఉద్యమ సంఘాలు శనివారం నిరసన ప్రదర్శన చేపట్టాయి. దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు నిరసనకారులు తెలిపారు. పోస్టర్లు, ప్లకార్డులను చేతబూనారు. లాఖీడ్ మార్టిన్ కంపెనీతో కలిసి టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్).. ఎఫ్-16 ఫైట్ జెట్‌వింగ్స్‌ను హైదరాబాద్‌లో తయారు చేస్తున్నదని ఐపీఎస్‌పీ, బీడీఎస్ ఇండియా సమన్వయకర్తలు భార్గవి, ఆనంద్‌సింగ్ అన్నారు. గాజాపై బాంబులు వేసేందుకు ఈ జెట్లనే ప్రధానంగా వాడుతున్నారని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ మిలటరీకి కొత్త టెక్నాలజీ కోసం (టెల్ అవీవ్ యూనివర్సిటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ ఫండ్) టాటా ఇండస్ట్రీస్ రూ.45 కోట్లు పెట్టుబడి పెట్టిందన్నారు.

కుక్కను తప్పించబోయి..

● డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

బంజారాహిల్స్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కుక్కను తప్పించబోయి డివైడర్‌ను ఢీ కారు బోల్తా పడింది. ఈ సంఘటన ఫిలింనగర్ అపోలో వద్ద జరిగింది. ఫిలింనగర్ పోలీసులు కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12 ఎమ్మెల్యే కాలనీలో వైద్యురాలు ముస్కాన్ సేత్ నివాసముంటున్నది. ఫిలింనగర్‌లో ఆమె ఒక క్లినిక్ నిర్వహిస్తోంది. ఒక వివాహ మహోత్సవానికి హాజరయ్యేందుకు బహ్రెయిన్‌కు బయలుదేరిన తన తల్లిదండ్రులను ఈనెల 14న ఎయిర్‌పోర్టులో వదిలింది. అనంతరం ఫిలింనగర్ అపోలో వద్ద ఉంటున్న స్నేహితురాలిని కలిసేందుకు వచ్చింది. అక్కడ కొద్దిసేపు గడిపిన అనంతరం కారులో ఇంటికి బయలుదేరింది. కొద్ది దూరం వచ్చేసరికి వాహనానికి కుక్క అడ్డొచ్చింది. తప్పించే క్రమంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టి కారు బోల్తా పడింది. ఎయిర్ బెలూన్‌లు తెరుచుకోవడం ఆమె సురక్షితంగా బయటపడింది. సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు ఆమెకు శ్వాస పరీక్ష చేయగా మద్యం తాగలేదని నిర్ధారణైంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్లకార్డులతో ప్రగతినగర్ కోతుల బొమ్మల చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న జేఏసీ సభ్యులు

కార్పొరేషన్ కమిషనర్‌ను బదిలీ చేయండి

● ఐఏఎస్ లేదా గ్రూప్-1 అధికారిని నియమించండి

● నిజాంపేట్ జేఏసీ డిమాండ్

నిజాంపేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఐఏఎస్ లేదా గ్రూప్1 అధికారిని నియమించాలని నిజాంపేట్ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ఇప్పుడున్న కమిషనర్‌ను వెంటనే బదిలీ చేయాలన్నారు. శనివారం ప్రగతినగర్‌లోని కోతుల బొమ్మల చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. అర్హత లేని అసమర్థ నిజాంపేట కమిషనర్‌ను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు నిజాంపేట మున్సిపల్ గ్రేడ్-3 స్థాయి కమిషనర్.. మౌలిక వసతుల కల్పనలో విఫలమయ్యారన్నారు. అవినీతి అక్రమాలు, బంధు వర్గ ప్రీతి, పారిశుధ్యం, డంపింగ్ యార్డు, సివిల్ వర్క్స్, టౌన్‌ప్లానింగ్, ఆర్థిక నిధుల దుర్వినియోగం, ఫిర్యాదులపై ఉదాసీనంగా వ్యవహరిస్తూ పూర్తిగా విస్మరించారని ఆరోపించారు.

పార్కులు, రోడ్ల ఆక్రమణలు వంటి అంశాల్లో విఫలమైన కమిషనర్ సాబేర్ అలీని వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఐఏఎస్ అధికారి, ఆ తర్వాత ముగ్గురు గ్రూప్- 1 అధికారులు, ఇద్దరు గ్రూప్-2 అధికారులు కమిషనర్‌గా పని చేశారన్నారు. 2022 తర్వాత గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రామకృష్ణ అనే వెటర్నరీ డాక్టర్‌కు అర్హత లేకున్నా కమిషనర్‌గా నియమించి కార్పొరేషన్‌ను భ్రష్టుపట్టించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మూడు కోతుల బొమ్మలకు వినతి పత్రం సమర్పించారు. ఇప్పటికైనా ఈ విషయమై స్పందించకుంటే కలెక్టర్, సీడీఎంఏ కార్యాలయాల ఎదుట ప్రజలతో కలిసి తాము భారీ ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

బతుకమ్మకుంట ఇప్పుడు విహారకేంద్రం

● హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో వాకర్లు



వాకర్స్‌తో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్ సిటీ, రాంనగర్ నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మకుంట ఇప్పుడు విహార కేంద్రమైందని, పరిసరాల రూపురేఖలు మారిపోయాయని నిత్యం వాకింగ్ చేసుకుంటూ ఆరోగ్యాలను కాపాడుకుంటున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పలువురు వాకర్లు అన్నారు. "బతుకమ్మకుంట బాగుందా? ఇక్కడ చేసిన అభివృద్ధి ఎలా ఉంది? రోజూ ఎంత మంది వాకి ంగ్‌కు వస్తున్నారు.. ఇది ఎలా ఉపయోగపడుతోంది? అని వారితో ఆయన అడిగారు. శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో ఈ కుంటను ఆకస్మికంగా సందర్శించారు. వాకర్లతో కలిసి కుంట చుట్టూ నడిచారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై వారి అభిప్రాయాలను, ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. నిత్యం వాకింగ్ చేసుకుంటూ ఆరోగ్యాలను కాపాడుకుంటున్నామని చెప్పారు. పిల్లలకు మంచి క్రీడా స్థలంగా మారిందన్నారు. చెరువును శుభ్రంగా కాపాడుకునేందుకు హైడ్రాతో కలిసి పని చేయాలని వాకర్లకు సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు కొందరు చిన్నారులు కృతజ్ఞతలు తెలిపారు.

సోషల్ మీడియా.. సో బెస్ట్ !

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో దీని పాత్ర పెద్దదే



లైవ్ కవరేజీకు కూడా చర్యలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ముగిసింది. నెలరోజులపాటు ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గంలోని గల్లీలు, బస్తీల్లో జోరుగా పర్యటించారు. ఉదయం నుంచి రాత్రి వరకు పార్కులు, దుకాణాలు, ఇళ్ల వద్దకు వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. తమ పార్టీ అభ్యర్థిని ఆదరిస్తే సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని హామీలిచ్చారు. ఇదే సమయంలో తాము చేస్తున్న ప్రచారాన్ని సోషల్ మీడియా ద్వారా పెద్ద ఎత్తున ప్రజలకు తెలియజేసేలా చర్యలు తీసుకున్నారు. కొంతమంది హోటళ్లలో దోశలు వేసినట్లుగా, మరి కొందరు సెలూన్ దుకాణాల్లో కటింగ్ చేస్తున్నట్లుగా, ఇంకొందరు రోడ్డు పక్కన కొబ్బరి బొండాలు అమ్మినట్లుగా, పంక్చర్ షాపులో టైర్లలో గాలికొట్టినట్లుగా.. ఇలా తీరొక్క కార్యక్రమాలు చేపట్టారు. అయితే వీటన్నింటినీ తమ అనుచరులతో సెల్‌ఫోన్లలో రికార్డు చేయించి సోషల్ మీడియాలో పోస్టు చేయిం చారు.

వాటిపైనే ఆధారం

గతంలో జరిగిన ఎన్నికల్లో అభ్యర్థులు పోస్టర్లు, ఫ్లెక్సీలతో ప్రచారం నిర్వహించేవారు. వీటికి బాగానే ఖర్చుచేసేవారు. గడిచిన పదేళ్ల నుంచి సోషల్ మీడియా ప్రభావం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో అభ్యర్థులు, పార్టీల అధిష్ఠానం వాటిపైనే ఎక్కువగా ఆధారపడింది. ఇటు అధికార కాంగ్రెస్, అటు ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌లు సోషల్ మీడియా ద్వారా పోటాపోటీగా ప్రచారం చేసుకున్నాయి. అగ్రనాయకుల రోడ్‌షోలు, కార్నర్ మీటింగుల వరకు అన్నింటినీ ఎప్పటికప్పుడు లైవ్ కవరేజ్ ద్వారా ప్రజలకు తెలియజేసేలా చర్యలు తీసుకున్నారు.

గెలుపోటములను శాసించిన...

ఎన్నికలో సోషల్ మీడియా ప్రభావం గెలుపోటములను శాసించే పరిస్థితికి వెళ్లిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఓటర్ల మనసులో ఏముందనే విషయాన్ని తెలుసుకుని వారిని తమ వైపు తిప్పుకునేందుకు ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాను ఎంచుకున్నారని చెప్పవచ్చు.

● పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవేపై కారు బోల్తా



ఓ కారు బోల్తా పడిన సంఘటన మెహిదీపట్నం పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవేపై శనివారం జరిగింది. నాంపల్లి నుంచి అత్తాపూర్ వైపునకు కారు వెళ్తోంది. ఈ సమయంలో ముగ్గురు మహిళలు ఉండగా సందీప్ కారు నడుపుతున్నాడు. పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవే పిల్లర్ నంబర్ 25 వద్దకు రాగానే కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు.. క్షతగాత్రులను స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించారు. బాధితులు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వకపోవడంతో కేసు నమోదు చేయలేదని గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ బైరి రాజు తెలిపారు.

- కార్వాన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి)



● జంతు ప్రేమికుల నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న జంతు ప్రేమికులు

వీధి కుక్కల బహిష్కరణను నిరసిస్తూ శనివారం పీపుల్ ఫర్ యానిమల్స్ (పీఎఫ్ఏ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జంతు ప్రేమికులు నిరసన వ్యక్తం చేశారు. లోయర్ ట్యాంక్ బండ్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వీధి కుక్కలను బహిష్కరించొద్దని కరపత్రాలను పంపిణీ చేశారు. - కవాడిగూడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి)

● ఆకర్షణ సతీష్‌కు యంగ్ అచీవర్ పురస్కారం



అవార్డు అందుకున్న ఆకర్షణ సతీష్

ఆకర్షణ సతీష్.. రోటరీ ఇంటర్నేషనల్ నుంచి ప్రతిష్ఠాత్మకమైన యంగ్ అచీవర్ అవార్డును అందుకుంది. న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో హ్యూమానిటేరియన్ సేవల విభాగంలో ఈ అవార్డును రోటరీ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రొటేరియన్ ఫ్రాన్సెస్కో అరెజ్జో నుంచి ఆమె అందుకుంది. ఈ అవార్డును అందుకున్న అతి పిన్న వయస్కురాలు (14 సంవత్సరాలు)గా నిలిచింది. యంగ్ అచీవర్ అవార్డుతో పాటుగా లక్ష రూపాయల నగదు బహుమతిని కూడా అందజేశారు. ఈ మొత్తాన్ని పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంలో భాగంగా మరో 76 లైబ్రరీల ఏర్పాటుకు విరాళం అందించాలని ఆమె నిర్ణయించారు. దీంతో దేశ వ్యాప్తంగా 100 లైబ్రరీలను ఏర్పాటు చేయాలనే లక్ష్యం చేరుకోనున్నట్లు ఆకర్షణ తెలిపింది.

- హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి)

● పారామిలటరీ దళానికి తృతీయ స్థానం




విస్ఫోట్ కవాచ్‌లో తృతీయ స్థానంలో నిలిచిన సీఐఎస్ఎఫ్ బృందం

విస్ఫోట్ కవాచ్-9 (బాంబు విస్ఫోటాలను కనిపెట్టేందుకు నిర్వహించిన డాగ్స్ పోటీలు) పోటీల్లో శంషాబాద్ ఎయిర్‌పోర్టు పారామిలటరీ దళానికి తృతీయ స్థానం దక్కింది. బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఎస్ఎస్‌బీ, సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం రాజస్థాన్ మానేసర్‌లో ఈ పోటీలు నిర్వహించారు. 16 రాష్ట్రాల నుంచి 23 టీంలు, మూడు టెరిటోరిస్ (ఢిల్లీ, చండీఘర్, జమ్మూకశ్మీర్)లు పాల్గొన్నారు. ఈ పోటీల్లో కర్ణాటక పోలీసులకు మొదటి స్థానం, ఆంధ్రప్రదేశ్ ఆక్టోపస్‌కు ద్వితీయ స్థానం దక్కింది. సందీప్ మన్హాస్ డీసీ నుంచి బహుమతులు అందుకున్నారు.

- శంషాబాద్ రూరల్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి)





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ట్రైన్ డ్రీమ్స్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 21
అమెజాన్ ప్రైమ్		
ది ఫ్యామిలీ మ్యాన్3	హిందీ సిరీస్	నవంబర్ 21
జియో హాట్‌స్టార్		
ల్యాండ్ మాన్	వెబ్‌సిరీస్	నవంబర్ 17
ది రోజెస్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 20
జిద్దీ ఇష్క్	హిందీసిరీస్	నవంబర్ 21

చలికాలంలో చామంతి మొక్కలు ఇలా

చల్లని వాతావరణంలో చామంతి మొక్కలు సులువుగా నాటుకుని గుబురుగా పెరుగుతాయి. వీటికి ఎక్కువగా ఎరువుల అవసరం ఉండదు. చలి కాలంలో చామంతి మొక్కలకు ఎలాంటి సంరక్షణ అందించాలో తెలుసుకుందాం...

- చామంతి మొక్కలను నేలమీద, కుండీల్లో కూడా పెంచవచ్చు. మట్టి.. మరీ పొడిగా లేదా మరీ తడిగా ఉండకూడదు. నీటిని నిల్వ ఉంచే మెత్తటి మట్టి కాకుండా కొద్దిగా ఇసుక మాదిరి ఉండేదాన్ని తీసుకుంటే మొక్క బాగా పెరుగుతుంది. కుండీని సగానికి పైగా మట్టితో నింపి అందులో సేంద్రియ ఎరువులు వేసి బాగా కలపాలి. తరువాత ఒకటి లేదా రెండు చామంతి మొక్కలను కలిపి నాటాలి. అదే నేలమీద అయితే మొక్కల మధ్య కనీసం ఆరు అంగుళాల దూరం ఉండేలా చూసుకోవాలి.
- చామంతి మొక్కలకు రోజూ మూడు లేదా నాలుగు గంటలపాటు ఎండ తగిలేలా చూసుకోవాలి. ఎండ తీవ్రత మరీ ఎక్కువగా ఉంటే మొక్కలపై నీడ పడేలా ఏర్పాటు చేయాలి. నిరంతరం గాలి వీస్తూ ఉంటే ఎక్కువగా పూలు పూస్తాయి.
- చామంతి మొక్కలకు ఎక్కువగా నీరు పోయకూడదు. కుండీల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. మట్టిలో నీరు నిలిస్తే మొక్క వేళ్లు కుళ్లిపోయే ప్రమాదం ఏర్పడుతుంది.



- మొగ్గలు వచ్చే సమయంలో కొద్దిగా పొటాషియం, బోన్ మీల్‌లను నీటిలో కలిపి మొక్కలకు అందిస్తే పూలు పెద్దగా పూస్తాయి.
- పదిహేను రోజులకోసారి నీళ్లలో కొద్దిగా వేపనూనె కలిపి మొక్కలపై పిచికారీ చేస్తే క్రిమి కీటకాలు చేరకుండా ఉంటాయి.
- వికసించిన పూలను ఎప్పటికప్పుడు కోస్తూ ఉండాలి. దీనివల్ల పూల ఉత్పత్తి పెరుగుతుంది.
- చలి తీవ్రత పెరిగినప్పుడు, విపరీతంగా మంచు కురుస్తున్నప్పుడు చామంతి మొక్కలకు తగు రక్షణ కల్పించాలి. బాల్కనీలో ఉండే కుండీలను సురక్షిత ప్రాంతానికి తరలించాలి.

అతిథి





మన దేశంలోని ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్లలో **అంజూ మోడీ** ఒకరు. 'సైరా నరసింహారెడ్డి, రామ్‌లీల, బాజీరావు మస్తానీ' వంటి హిట్ చిత్రాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేసిన ఆమె... ఫ్యాషన్ ప్రపంచంలో వస్తున్న మార్పుల గురించి తన అభిప్రాయాలను 'నవ్య'తో పంచుకున్నారు.

ఆ దుస్తులకే ప్రాధాన్యం ఎక్కువ

ప్రస్తుతం మన దేశ ఫ్యాషన్ రంగంలో ఎలాంటి మార్పులు వస్తున్నాయి?

ఫ్యాషన్ రంగం చాలా వేగంగా మారిపోతోంది. కొత్త తరం... ఇండో-వెస్ట్రన్ లుక్‌లకు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తోంది. దీనికి కూడా ఒక కారణం ఉంది. ప్రస్తుత తరం అమ్మాయిలలో చాలామందికి చీరలు ఎలా కట్టుకోవాలో తెలియదు. దాంతో వారు రెడీమేడ్ చీరల వైపు మొగ్గు చూపుతున్నారు. అలాగే... సంప్రదాయానికి ఆధునికతను మేళవించి కొత్త కొత్త డిజైన్లు అందుబాటులోకి వస్తున్నాయి. ఇక నా విషయానికి వస్తే, నేను జైపోర్ బ్రాండ్‌తో కలిసి డిజైన్ చేస్తున్నా. వారు మార్కెటింగ్, ప్రొడక్షన్ చూసుకుంటారు. నేను పరిశోధనలు, డిజైనింగ్ విభాగాలు చూసుకుంటున్నాను. దీనివల్ల ఒక పెద్ద ప్రయోజనం ఉంది. నేను డిజైన్ చేసిన బట్టలు సమాజంలో అన్ని వర్గాలవారికీ చేరతాయి. ఫలితంగా వస్త్రశ్రేణులకు డిమాండ్ పెరుగుతుంది. డిమాండ్ పెరిగితే నేత పనివారికి మరింత ఉపాధి దొరుకుతుంది. నేసే ప్రతి వస్త్రానికీ ఒక ఆత్మ ఉంటుంది. అది డిజైనింగ్ రూపంలో అందరికీ కనిపిస్తూ ఉంటుంది. అందువల్ల మనం ధరించే బట్టలు మన ఆత్మను ప్రతిబింబిస్తాయి.

> "సైరా నరసింహారెడ్డి'లో చిరంజీవి చాలా క్లిష్టమైన పాత్రను అద్భుతంగా పోషించారు. ఆయన చాలా ఆలోచనాపరుడు. ఒక విషయాన్ని అనేక కోణాల నుంచి ఆలోచిస్తారు. గొప్ప వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి. దేశంలోనే అగ్రనటుల్లో ఒకరైనా... కించిత్తు గర్వం కూడా ఉండదు. ఆయనకు దుస్తులు డిజైన్ చేయటం ఒక మరపురాని అనుభవం."

రోజూ ఆఫీసులకు వెళ్లే అమ్మాయిలకు ఎలాంటి దుస్తులు నప్పుతాయి?

గతంతో పోలిస్తే ఇప్పుడు ఆఫీసుల్లో పని చేసే అమ్మాయిల సంఖ్య గణనీయంగా పెరిగింది. వారు వేసుకొనే బట్టలు అందంగా ఉండాలి. అదే సమయంలో సౌకర్యవంతంగా కూడా ఉండాలి. వారి కదిలికలకు అడ్డుపడకూడదు. ఉదాహరణకు చాలామంది మధ్యతరగతి మహిళలు ఆఫీసులకు బస్సు, బైక్‌ల మీద వెళుతుంటారు. అలాంటివారు చురుకుగా కదలాలి. వారు వేసుకొనే దుస్తులు ఆ కదలికలకు తగినట్లుగా ఉండాలి. దాంతోపాటుగా ఆధునికత కూడా ప్రతిబింబించాలి. అందుకే ఈమధ్య ఎక్కువమంది షార్ట్ కుర్తీలు, ట్రౌజర్లు, స్కార్ఫ్‌ల వంటివి ధరిస్తున్నారు. ఇక పండగలు వస్తే సంప్రదాయబద్ధమైన లెహంగాలు, చీరలు కట్టుకుంటున్నారు.

మీరు టాలీవుడ్, బాలీవుడ్‌లలో చాలా సినిమాలకు డిజైనర్‌గా పని చేశారు. మీకు బాగా నచ్చిన నటి ఎవరు?

సినిమాలో... పాత్రలు, సన్నివేశాల ఆధారంగా దుస్తులను డిజైన్ చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు 'రామ్‌లీల' తీసుకుందాం. అందులో దీపిక ఒక అందమైన చలాకీ అమ్మాయిగా నటించింది. ఆమెలో అణువణువూ ఉత్సాహం ఉంటుంది. ఆమెకు డిజైన్ చేసే సమయంలో... ఆ పాత్ర ఎలాంటి దుస్తులు ధరిస్తుందనే ఆలోచనే ఉంటుంది. 'బాజీరావ్ మస్తానీ' చిత్రంలో దీపిక మస్తానీగా నటించింది. ఈ సినిమాలో ఆమె పర్షియాకు చెందిన ఒక ముస్లిం మహిళ. అందువల్ల ఆమెకు డిజైన్ చేసే దుస్తులు కూడా ఆమె పుట్టి పెరిగిన సంస్కృతిని ప్రతిబింబించేలా ఉండాలి. అవి కథలో సహజంగా అమరిపోవాలి.

'సైరా నరసింహారెడ్డి' చిత్రానికి డిజైన్ చేసినప్పుడు మీ అనుభవాలు చెప్పండి..?

బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన ఒక రాజు కథ ఇది. ఆ చిత్రంలో నేను... అమితాబ్, చిరంజీవి, నయనతార, తమన్నాలకు డిజైనింగ్ చేశాను. దీనిలో అమితాబ్ గురు వెంకన్న పాత్ర చేశారు. 18వ శతాబ్దంలో రాజ గురువులు ఎలాంటి దుస్తులు ధరించేవారనే విషయంపై పరిశోధన చేసి శాలువాలు మొదలైన వాటితో దుస్తులు డిజైన్ చేశాను. ఇక నయనతారకు నేను డిజైన్ చేసిన డ్రస్సు అత్యంత క్లిష్టమైనది. నా పరిశోధనలలో ఆ సమయంలో కొందరు అమ్మాయిలు చీరను మామూలుగా కట్టుకోకుండా భిన్నంగా కట్టుకొనేవారిని తేలింది. అది మరాఠీవారు కట్టుకొనే పద్ధతికి భిన్నమైనది. మరాఠీ పద్ధతిలో చీర కట్టి, ఎడమ చేతి మీదకు కొంగు వచ్చేలా చేస్తారు. షూటింగ్ సమయంలో ఆ చీర కట్టడానికి నాలుగు గంటలు పట్టేది. కానీ ఆ చీరకట్టు చాలా అందంగా వచ్చింది.

> "అబ్బాయిలకు అమ్మాయిలకు ఉన్నన్ని రకాల డిజైన్లు ఉండవు. ఈ విషయంలో వారు దురదృష్టవంతులనే చెప్పాలి. ఇంట్లో కూడా అమ్మాయిల బట్టలు పెట్టుకోవటానికి పది అల్మారాలు ఉంటే.. అబ్బాయిలకు ఒక అల్మారా ఉంటుంది. మామూలు రోజుల్లో ట్రౌజర్స్, షర్ట్ వేసుకుంటే... ప్రత్యేక సందర్భాల్లో సూట్స్ తప్ప వారికి ప్రత్యామ్నాయాలు ఏమీ ఉండవు. నాలుగు షర్టులు, నాలుగు ట్రౌజర్స్ ఉంటే చాలనే ఆలోచనా ధోరణే ఉంటుంది. పండగల్లో కుర్తాలు, బంద్‌గాలాల లాంటివి మాత్రమే ఉంటాయి. ఈ మధ్య అబ్బాయిలు కూడా పింక్ లాంటి రంగుల షర్టులు ధరిస్తున్నారు. ఇది ఒక మార్పు అనే చెప్పాలి."

మీరు డిజైన్ చేసేటప్పుడు దక్షిణ భారతం... ఉత్తర భారత దేశానికి చెందిన వ్యక్తులనే విషయం స్ఫురణకు వస్తుందా?

లేదు. నాకు కేవలం పాత్రలు మాత్రమే గుర్తుంటాయి. నేను కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు తిరిగాను. అనేకమంది చేనేత కార్మికులను కలిశాను. 24 రకాల చేనేత నైపుణ్యాలను గమనించాను. ఇవన్నీ మనకు ఉన్న వారసత్వ సంపద. దీనిలో ఉత్తర భారతదేశం... దక్షిణ భారత దేశం అనే తేడానే లేదు. ఉదాహరణకు నేను నా దుస్తుల డిజైనింగ్‌లో వెంకటగిరి, గద్వాల్, నారాయణపేట... ఇలా పలు రకాల చేనేతలు ఉపయోగిస్తూ ఉంటాను.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

అవకాశమిస్తే ఆటపాటల్లోనే కాదు రాజకీయాల్లో కూడా యువతులు సత్తాచూపగలరని నిరూపించింది ఓ యువతి. ఆమె ఎవరో కాదు.. బిహార్‌కు చెందిన గాయని, యూట్యూబర్ మైథిలీ ఠాకూర్. ఇటీవల జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అలీనగర్ నియోజక వర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలవడమే కాదు... ఈసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్న అతి పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించారు ఆమె. జానపద గాయనిగా ప్రస్థానం మొదలుపెట్టి పిన్న వయసులోనే ఎమ్మెల్యేగా ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకున్న మైథిలి ప్రస్థానం ఇది.

జానపదం నుంచి జనపథంలోకి



మైథిలి.. బిహార్‌లోని మధుబని జిల్లా బెనిపెట్టిలో 2000 జూలై 25న జన్మించారు. తండ్రి రమేష్ ఠాకూర్ శాస్త్రీయ సంగీతంలో నిష్ణాతుడు, ఉపాధ్యాయుడు. తల్లి పూజ ఠాకూర్ గృహిణి. మైథిలి తాత కూడా సంగీతకారుడే. ఉపాధి కోసం ఢిల్లీకి మకాం మార్చింది మైథిలి కుటుంబం. ఆమె చదువంతా అక్కడే కొనసాగింది. బాల్ భవన్ ఇంటర్నేషనల్ స్కూల్లో పన్నెండో తరగతి వరకు చదువుకున్నారు. ఢిల్లీ యూనివర్సిటీలో బీఏ పూర్తి చేశారు. మైథిలికి రిషబ్ ఠాకూర్, అయాచి ఠాకూర్ అనే ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. ఈ అక్కా తమ్ముళ్లకు సంగీతమంటే చాలా ఇష్టం. వీళ్లకి తాత, తండ్రి మొదటి గురువులు. మైథిలి.. భారతీయ శాస్త్రీయ, భక్తి సంగీతంలో శిక్షణ పొందారు. జానపదాలు పాడడం కూడా నేర్చుకున్నారు. రిషబ్ తబలా వాయిస్తాడు. అయాచికి తాళ వాయిద్యాల్లో ప్రవేశం ఉంది. బాగా పాడతాడు కూడా. పిల్లల సంగీత సాధన కారణంగా పదిహేడుసార్లు ఇల్లు మారాల్సివచ్చిందని, అయిదేళ్ల క్రితమే సొంత ఇల్లు కొనుక్కున్నామని మైథిలి తల్లి చెబుతున్నారు.

అంచెలంచెలుగా ఎదిగి...

భోజ్‌పురి, హిందీ బాషల్లో భక్తి పాటలు, జానపదాలు పాడుతూ తన కంఠం ప్రత్యేక గుర్తింపు పొందారు మైథిలి. ఉర్దూ, బెంగాలీ, మరాఠీ, పంజాబీ, తమిళం, ఇంగ్లీష్ బాషల్లో కూడా ఎన్నో పాటలు ఆలపించారు. టీవీలో ప్రసారమయ్యే పలు సింగింగ్ రియాలిటీ షోలలో పాల్గొన్నారు. పదకొండేళ్ల వయసులోనే జీటీవీ సరిగమప లిటిల్ చాంప్స్‌లో ప్రతిభ కనబరచారు. సోనీ టీవీ ఇండియన్ ఐడల్ జూనియర్ పోటీలో సత్తా చాటారు. తరువాత సొంత ఆల్బం 'యా రబ్బా'ను విడుదల చేశారు. 2017లో రైజింగ్ స్టార్ కార్యక్రమంలో రన్నరప్‌గా నిలిచారు. విదేశాల్లో సైతం పాటల ప్రోగ్రామ్‌లు, లిటరేచర్ ఫెస్ట్‌లు నిర్వహించారు. ఆమె బిహార్ సాంస్కృతిక అంబాసిడర్‌గా కూడా పని చేశారు. గతంలో ఎన్నికల కమిషన్.. మైథిలితోపాటు ఆమె తమ్ముళ్లను మధుబని బ్రాండ్ అంబాసిడర్లుగా నియమించింది. ఆమె 2021లో లోక్‌మత్ సుర్ జ్యోత్స్నా జాతీయ సంగీత పురస్కారాన్ని, ఆపైన భారత ప్రభుత్వం నుంచి అటల్ మిథిలా సమ్మాన్ పురస్కారాన్ని అందుకున్నారు. అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవంలో మైథిలి పాడిన 'మా శబరి' పాటకు పలువురి ప్రశంసలు లభించాయి. శ్రీరామునికి శబరి పండ్లు తినిపించే ఘట్టాన్ని కళ్లముందు నిలిపావంటూ ప్రధాని మోది ప్రత్యేకంగా అభినందించారు కూడా.



సామాజిక మాధ్యమాల్లో...

మైథిలి సొంతంగా యుట్యూబ్ ఛానెల్‌ను నిర్వహిస్తున్నారు. అందులో తన తమ్ముళ్లతో కలిసి తులసీదాస్ విరచిత రామచరిత మానస్‌ను ఆలపిస్తున్నారు. మానస్పథ్ అనే ఈ ప్రోగ్రామ్ ఆ అక్కా తమ్ముళ్లకు మంచి పేరు తెస్తోంది. ఇన్‌స్టా, యూట్యూబ్‌లలో కలిపి ఆమెకు కోటికి పైగా ఫాలోయర్లు ఉన్నారు. ఫేస్‌బుక్‌లో అయితే 1.40 కోట్ల మంది ఆమెను ఫాలో అవుతున్నారు. ప్రస్తుతం మైథిలి అంతర్జాతీయ వేదికల మీద కూడా ప్రదర్శనలు ఇస్తున్నారు. బాలీవుడ్ చిత్రాలకు కూడా పాటలు పాడారు. గత ఏడాది 'ఔరోమ్ మే కహా దమ్ థా' చిత్రంలో ఎంఎం కీరవాణి స్వరపరిచిన 'కిసీ రోజ్' పాట పాడారు.

కేంద్రం మొదటిసారి జాతీయ స్థాయి క్రియేటర్లకు అవార్డులు ప్రకటించినప్పుడు మైథిలి 'కల్చరల్ అంబాసిడర్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపికయ్యారు.

రాజకీయ ప్రస్థానం...

బీజేపీ తరఫున బరిలోకి దిగిన మైథిలి.. అలీనగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఈ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకూ అక్కడ బీజేపీ గెలవకపోవడం గమనార్హం. ఇటీవలే రాజకీయాల్లోకి వచ్చిన మైథిలి సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్ పర్సన్‌గా నిలిచారు. సాంస్కృతిక పునరుజ్జీవనం, బాలికలు-మహిళల విద్య, ఉపాధి కల్పనలే ప్రధాన అజెండాగా ఆమె ప్రచారం కొనసాగించారు. పాఠశాలల్లో పెయింటింగ్‌ను అదనపు పాఠ్యాంశంగా చేర్చడంతోపాటు అలీనగర్ పేరును సీతానగర్‌గా మార్చాలనే ప్రతిపాదనలను ఆమె ఎన్నికల హామీల్లో వినిపించారు. పోటీ చేసిన మొదటిసారే ఎమ్మెల్యేగా గెలవడంతో ఆమె ఆనందానికి అవధులు లేవు. 51 ఏళ్ల బిహార్ అసెంబ్లీ ప్రస్థానంలో 25 ఏళ్ల యువతి అడుగుపెట్టడంతో రాజకీయాల్లో నూతన శకానికి నాంది పలికినట్లేనని అక్కడి ప్రజలు చెప్పుకోవడం విశేషం.

అభి'రుచి'

ఒక చిన్న టీ కొట్టు యజమాని తన వంటలతో దేశంలో ప్రముఖులందరినీ ఆకట్టుకోవటం చాలా అరుదైన విషయం. అలాంటి వ్యక్తే... నాగరాజు వెంకటరామరాజు. 'పులస రాజుగారు' అని ఎంతోమంది ఆప్యాయంగా పిలుచుకొనే ఈ రాజుగారు... 'రాజుగారి కోడి పులావ్' తొలిసారి వండింది తానేనంటారు. గతంతో పోలిస్తే ఇప్పటి వంటల్లో వచ్చిన మార్పులు, బిర్యానీ... పులావ్‌ల మధ్య తేడాలు తదితర ఎన్నో ఆసక్తికర విషయాలను ఆయన 'నవ్య'తో పంచుకున్నారు.



ఈ 'రాజుగారి కోడి పులావ్'అదుర్స్

"ఒకప్పుడు చదువు రానివారు, చదువుకోనివారు మాత్రమే వంటవాళ్లుగా స్థిరపడేవారు. చదువుకున్నవారు ఉద్యోగాలకు వెళ్లేవారు. ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయి. చదువుకున్నవారు కూడా వంట చేయటాన్ని వృత్తిగా ఎంచుకుంటున్నారు. రెస్టారెంట్స్ పెడుతున్నారు. వంటలు వండే విధానంలో, తినే విధానంలో కూడా అనేక మార్పులు వచ్చేశాయి. కొత్త కొత్త మిషన్లు అందుబాటులోకి వచ్చాయి. దీనివల్ల పని సులభమయింది. కానీ నా ఉద్దేశంలో వంటల్లో 'ప్రేమ పాళ్లు' తగ్గాయి. గతంలో వంట చేయటానికి... డబ్బులకు లంకె ఉండేది కాదు. వంటను మెచ్చుకుంటే సంతోషపడేవాళ్లం. ఇప్పుడు డబ్బులకే ప్రాధాన్యం. గతంలో వంటల్లో మసాలాలు, నూనెలు ఎక్కువగా వాడేవారు కాదు. అందువల్ల కూర రుచి తెలిసేది. ఉదాహరణకు చికెన్ వండారని అనుకుందాం. చికెన్ రుచి ప్రధానంగా... మిగిలిన రుచులు అదనంగా ఉండేవి. తిన్నవారికి ఆ విషయం తెలిసేది. కానీ ఇప్పుడు కూరల్లో గ్రేవీ ప్రధానమైపోయింది. ఈ గ్రేవీలలో రంగులు కూడా వేస్తున్నారు. రెడ్ గ్రేవీ, ఎల్లో గ్రేవీ, వైట్ గ్రేవీ అని తయారు చేస్తున్నారు. చికెన్, మటన్, ఫిష్... ఇలా ఏదైనా ఈ గ్రేవీలనే వాడేస్తున్నారు. రకరకాల నూనెలు వాడుతున్నారు. వెజిటేరియన్ అయినా, నాన్‌వెజిటేరియన్ అయినా ఇదే సమస్య.

> ఒకప్పుడు పిత్తపరుగులతో కూర వండేవారు. ఇప్పుడు ఎవరూ వండటంలేదు. అలాగే సీరమీను గురించి కూడా ఎవరికీ తెలియదు. దీనికి సంబంధించిన ఒక కథ చెబుతాను. ఒకసారి సూపర్‌స్టార్ కృష్ణ గారు నన్ను పిలిచి... "రాజుగారు.. మీకు సీరమీను కూర చేయటం తెలుసా?" అని అడిగారు. తెలుసని చెప్పాను. వాస్తవానికి అప్పుడు నాకు సీరమీను గురించి తెలియదు. కానీ అంత పెద్ద వ్యక్తికి తెలియదని ఎలా చెబుతా! ఆ తర్వాత దాని గురించి వాకబు చేస్తే దీపావళికి నాలుగు రోజుల ముందు దొరుకుతుందని, ఆ తర్వాత దొరకదని చెప్పారు. దానిని వండటం కూడా ఒక కళ. ఆ ఏడాది భీమవరం, తూర్పుగోదావరి జిల్లాలో కొన్ని ఊళ్లు వెళ్లి ఆ వంటకం నేర్చుకొన్నా. వచ్చి కృష్ణగారికి వండి పెట్టా! ఆ తర్వాత ఆయన చనిపోయేదాకా ప్రతి ఏడాది దీపావళికి సీరమీను కూర చేసి పట్టుకువెళ్లి ఇచ్చేవాడిని.

చేపల పులుసు అంటే...

చేపల పులుసు వండేటప్పుడు చాలామంది చేసే తప్పు... దానిలో గ్రేవీ వేయటం. ఒకప్పుడు చేపల పులుసులో గ్రేవీ ఉపయోగించేవారు కాదు. ఉల్లిపాయలు కూడా ఎక్కువగా వాడేవారు కాదు. కానీ ఇప్పుడు ఈ రెండూ విరివిగా వాడేస్తున్నారు. ఒకప్పుడు కేజీ చేపలకు పావు కిలో ఉల్లిపాయల ముద్ద వేసేవాళ్లం. పప్పునూనె వాడేవాళ్లం. తగినంత కారమే వేసేవాళ్లం. కానీ ఇప్పుడు కేజీ చేపలకు కేజీ ఉల్లిపాయల ముద్ద వేసేస్తున్నారు. దీని వల్ల ఎంత కారం కలిపినా చాలదు. అంతే కాకుండా రుచిగా కూడా ఉండదు. చేపల గురించి మాట్లాడుకుంటున్నాం కాబట్టి కొన్ని విషయాలు తప్పనిసరిగా చెప్పాలి. తెలుగు రాష్ట్రాల్లో రకరకాల భౌగోళిక పరిస్థితులు ఉన్నాయి. వాటికి తగ్గట్టుగా వాతావరణం ఉంటుంది. ఈ వాతావరణం ఆధారంగానే అక్కడ పండే పంటలు, పెరిగే చేపలు, ఇతర జంతువులు ఉంటాయి. నా అనుభవంలో గోదావరి నీటికి కొన్ని ప్రత్యేకమైన లక్షణాలు ఉన్నాయి. గోదావరి నీళ్లతో పులుసు చేస్తే కొద్దిగా పులుపు అబ్బుతుంది. దీనివల్ల మంచి రుచి వస్తుంది. తెలంగాణ ప్రాంతంలో నీళ్లతో చేస్తే ఈ పులుపు రాదు. అంతే కాకుండా చేప ముల్లు లేకుండా పులుసు చేస్తే దానికి రుచి ఉండదు. ఇప్పుడు అందరూ బోన్‌లెస్ వండుకుంటున్నారు. ఇక్కడ మీకు ఒక విషయం చెబుతాను. వానాకాలంలో పులస చేపలు అందుబాటులోకి వస్తాయి. చాలా మంది పులసను మామూలుగానే వండేస్తారు. అలా కాకుండా ముందు... ఈ చేపను మూడు గంటల పాటు ఉడకపెట్టాలి. ఆ తర్వాత ఒక రోజంతా వదిలేయాలి.

> ఈ మధ్యకాలంలో బతికివున్న చేపల్ని ఆక్సిజన్ సిలిండర్లు పెట్టి చాలామంది అమ్ముతున్నారు. దీని వెనక ఒక మతలబు ఉంది. చేపలను పట్టిన తర్వాత, వాటిని నీటిలో వేసి ఒక కెమికల్ కలిపితే... అవి ఎంతకాలమైనా బతికి ఉంటాయి. కానీ వాటి రుచి మాత్రం మారిపోతుంది. ఆక్సిజన్ పెట్టి అమ్మే చేపల్లో రుచి ఉండదు. ఇక చేపల పులుసుకు బొచ్చు చేపలు బాగుంటాయి. తెలంగాణ ప్రాంతాల్లో కొర్రమీనులను ఎక్కువగా తింటారు. దీనిలో బోన్ తక్కువగా ఉంటుంది. ఇక్కడ మంచి బొమ్మిడాయలు దొరకవు. ఎక్కువగా దొరికేవన్నీ బురద బొమ్మిడాయిలే.

అప్పుడు దానిలో ఉండే ముల్లు మృదువుగా మారుతుంది. చేపల పులుసు చేసి చివరలో వెన్నపూస వేయాలి. ఇలా చేసిన పులుసు వారం రోజులైనా చెడిపోదు. ఏటా ఇలా చేసిన పులస చేపల పులుసును దుబాయ్, అమెరికా సహా అనేక దేశాలకు పంపుతూ ఉంటాను. ఇప్పటిదాకా ఒక్క రిమార్క్ కూడా రాలేదు.

పులావు... బిర్యానీ...

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జిల్లాల్లో పులావు ఎక్కువగా ఉంటుంది. హైదరాబాద్‌లో బిర్యానీ ఎక్కువగా దొరుకుతుంది. ఈ రెండింటి మధ్య ఉన్న తేడా చాలా మందికి తెలియదు. పులావ్‌లో బియ్యం, మసాలా, నూనె, ఇతర దినుసులు ఒకేసారి వేసి వండేస్తారు. బిర్యానీలో మాత్రం ముందు ఒక పొర కూరగాయలు, ఆపైన చికెన్, ఆ పైన బియ్యం... ఇలా పొరలుపొరలుగా వేసి ఉడికిస్తారు. అంటే వండే పద్ధతిలోనే మౌలికంగా మార్పు ఉంటుంది. నేను మూడున్నర దశాబ్దాల క్రితం హైదరాబాద్ వచ్చినప్పుడు... ఇక్కడవాళ్లకు పులావు గురించి ఎక్కువగా తెలియదు. ఆ సమయంలో నేను నా పేరు మీద 'రాజుగారి కోడి పలావ్'ను వండటం మొదలుపెట్టా!

దీనికి విపరీతమైన ఆదరణ లభించింది. ఒక ఏడాది లోపులోనే హైదరాబాద్ దమ్ బిర్యానీకి సరిసమానమైన పేరును సంపాదించింది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. దుబాయ్, సింగపూర్, అమెరికా... ఇలా ఎక్కడికి వెళ్లినా ఈ పేరు మీద రెస్టారెంట్స్ కనిపిస్తాయి. ఈ పేరు మీద నాకు ట్రేడ్ మార్క్ కూడా ఉంది. అయితే ఆహారం అనేది అందరిదీ. దానిపై ఎటువంటి ఆంక్షలూ ఉండకూడదనేది నా ఉద్దేశం.


MEGA STAR AS COWBOY
Grand Re-Release
ON 21ST NOVEMBER
4K
5.1 Digital
SANDHYA 70 MM ఆర్టీసీ క్రాస్ రోడ్స్
Booking Opens Today


DR. NAGESHWAR RAO PUJARI PRESENTS
A WIN ORIGINAL PRODUCTION
WIN
రాజు weds రాంబాయి
NOVEMBER 21st RELEASE IN THEATERS
WRITTEN & DIRECTED BY SAAILU KAAMPATI
PRODUCED BY VENU UDUGULA, RAHUL MOPIDEVI


MYTHRI MOVIE MAKERS
GULSHAN KUMAR, BHUSHAN KUMAR & T-SERIES FILMS PRESENTS
TRAILER LAUNCH EVENT
ON 18TH NOV, 5PM ONWARDS
@KURNOOL OUT DOOR STADIUM
DRONE SHOW
FIRST TIME EVER IN TELUGU CINEMA & KURNOOL
ANDHRA KING
తాలూకా
MAHESH BABU .P
NAVEEN YERNENI Y RAVI SHANKAR
BIOPIC OF A FAN
IN THEATRES 28TH NOV WORLDWIDE
NETFLIX


SRI LAKSHMI JYOTHI CREATIONS
WORLDWIDE IN THEATRES
NOV 21
ACTION KING ARJUN
AISHWARYA RAJESH
మఫ్టీ పోలీస్
WRITTEN & DIRECTED BY DINESH LAKSHMANAN
PRODUCED BY G ARULKUMAR
TAMIL • TELUGU • KANNADA • MALAYALAM


ప్రేమంటే
Thrill-u Praptirasthu!
A LEON JAMES MUSICAL
IN CINEMAS 21ST NOV, 2025 WORLDWIDE


సిస్టర్ రాణి మరియ గారి యదార్థ గాథ:
ద ఫేస్ ఆఫ్ ద ఫేస్‌లెస్ (క్షమాపణ గాథ) తెలుగు లో...
2024 ఆస్కార్ అవార్డు కోసం నామినేట్ చేయబడిన చిత్రం
THE FACE OF THE FACELESS
ద ఫేస్ ఆఫ్ ద ఫేస్‌లెస్
123 అంతర్జాతీయ అవార్డులు
SHAISON P. OUSEPH
SANDRA D'SOUZA RANA
RANJAN ABRAHAM
TRI LIGHT CREATIONS
నవంబర్ 21 విడుదల


ANYUKTH RAM PICTURES
WORLD WIDE RELEASE
DECEMBER 12 2025
CH. RAMA RAO'S
ఘంటసాల
THE GREAT
PRODUCER Mrs CH. PHANI
DIRECTOR CH. RAMA RAO
KARRI BALAJI VASU RAO SALURI VENU MURALIDHAR .V DR. SHYAM KUMAR .P


RETRO BLOCKBUSTER
SPIRIT MEDIA AND WAYFARER FILMS PRESENT
DULQUER SALMAAN IN
కాంత
WRITTEN & DIRECTED BY SELVAMANI SELVARAJ
IN CINEMAS NOW



క్వార్టర్స్‌కు అర్జున్

● టైబ్రేక్‌కు హరి
● చెస్ వరల్డ్‌కప్

పనాజీ: తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి ఫిడే వరల్డ్‌కప్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. ఐదో రౌండ్లో అర్జున్ 1.5-0.5తో రెండు సార్లు విజేత లెవాన్ అరోనియన్ (అమెరికా)ను చిత్తుచేశాడు. శుక్రవారం తొలిగేమ్‌ను డ్రాగా ముగించిన అర్జున్.. శనివారం రెండో గేమ్‌లో అరోనియన్‌ను ఓడించాడు. అయితే, మరో తెలుగు ఆటగాడు పెంటేల హరికృష్ణ భవితవ్యం టైబ్రేక్‌కు మళ్లింది. ఐదో రౌండ్లో మెక్సీకోకు చెందిన జోస్ మార్టినెజ్‌తో తొలిగేమ్ డ్రా చేసుకున్న హరి.. రెండో గేమ్‌లోనూ ఫలితం రాబట్టలేకపోయాడు. దీంతో స్కోరు 1-1తో సమమవడంతో వీళ్లిద్దరూ ఆదివారం టైబ్రేక్‌లో తలపడనున్నారు.

స్పిన్నర్ల తడాఖా

భారత్ తొలి ఇన్నింగ్స్ 189

- హార్మర్‌కు నాలుగు వికెట్లు
- దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 93/7
- తిప్పేసిన జడేజా, కుల్దీప్



జడేజా (4/29)

కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్ పిచ్ బ్యాటర్లను వణికిస్తోంది. తొలిరోజు పేసర్లకు అనూహ్య బౌన్స్ లభించగా.. రెండోరోజైన శనివారం స్పిన్నర్లకు స్వర్గధామంగా మారింది. దీంతో ఒక్కరోజే ఇరుజట్ల నుంచి ఏకంగా 15 వికెట్లు నేలకూలాయి. అటు మ్యాచ్ ఫలితం కూడా మూడోరోజే తేలడం ఖాయమైపోయింది. భారత బ్యాటింగ్ ఆర్డర్ విఫలమైనా.. వెటరన్ స్పిన్నర్ రవీంద్ర జడేజా (4/29) సుడులు తిరిగే బంతులతో సఫారీ బ్యాటర్ల వెన్ను విరిచాడు. దీంతో ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 35 ఓవర్లలో 7 వికెట్లకు 93 పరుగులు చేసింది. క్రీజులో కెప్టెన్ బవుమా (29), బాష్ (1) ఉన్నారు. స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్‌కు 2, అక్షర్ పటేల్‌కు ఓ వికెట్ దక్కింది. ప్రస్తుతం పర్యాటక జట్టు 63 పరుగుల ఆధిక్యంలోనే ఉంది. వీలైనంత వేగంగా మిగిలిన 3 వికెట్లను భారత్ పడగొట్టాలి. లేదంటే ఈ పిచ్‌పై 150 పరుగుల లక్ష్యం కూడా కష్టంగానే మారనుంది. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్ 189 రన్స్ వద్ద ముగియడంతో.. 30 పరుగుల ఆధిక్యం దక్కింది. రాహుల్ (39), సుందర్ (29), పంత్ (27), జడేజా (27) పర్వాలేదనిపించారు. స్పిన్నర్ సిమోన్ హార్మర్‌కు 4, పేసర్ యాన్సెన్‌కు 3 వికెట్లు దక్కాయి.


హార్మర్ (4/30)

హార్మర్ ధాటికి కుదేల్: ఓవర్‌నైట్ స్కోరు 37/1తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్‌ను సఫారీ స్పిన్నర్లు కుదురుకోనీయలేదు. మిడిలార్డర్‌ను హార్మర్ దెబ్బతీశాడు. అయితే తొలిగంట ఆటలో యాన్సెన్ పేస్, కేశవ్ స్పిన్‌ను రాహుల్, సుందర్ దీటుగానే ఎదుర్కొన్నారు. కానీ డ్రింక్స్ బ్రేక్ తర్వాత హార్మర్ వికెట్ల పతనాన్ని ఆరంభించాడు. ముందుగా సుందర్‌ను హార్మర్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ వెంటనే గిల్ మెడ నొప్పితో మైదానం వీడాడు. అటు ఓపిగ్గా క్రీజులో నిలిచిన రాహుల్‌ను కేశవ్ పెవిలియన్ చేర్చాడు. ఇక పంత్ తనదైన శైలిలో రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో స్కోరులో కదలిక తెచ్చాడు. కానీ లంచ్‌కు కాస్త ముందే పేసర్ బాష్ బౌన్సర్‌కు పంత్ క్యాచ్ అవుటయ్యాడు. 138/4 స్కోరుతో భారత్ రెండో సెషన్‌ను పటిష్టమైన స్థితిలోనే ఆరంభించింది. కానీ హార్మర్ ధాటికి 51 పరుగుల వ్యవధిలోనే చివరి ఐదు వికెట్లను కోల్పోయింది. అయితే 30 పరుగుల తొలి ఇన్నింగ్స్ మాత్రం దక్కింది. కెప్టెన్ గిల్ తిరిగి బ్యాటింగ్‌కు దిగలేదు.

జడ్డూ మాయ: రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికాకు ఏడో ఓవర్‌లోనే ఝలక్ తగిలింది. ఓపెనర్ రికెల్టన్ (11)ను కుల్దీప్ అవుట్ చేయడంతో ఆటగాళ్లు టీ బ్రేక్‌కు వెళ్లారు. ఇక ఆఖరి సెషన్‌లో పిచ్ బ్యాటింగ్‌కు మరింత కష్టంగా మారింది. వికెట్‌పై పగుళ్లు కూడా కనిపించడంతో జడేజా మాయాజాలానికి సఫారీలు విలవిల్లాడారు. ఆరంభంలోనే స్వీప్‌షాట్‌కు వెళ్లి ఓపెనర్ మార్‌క్రమ్ (4).. జడేజాకు దొరికిపోయాడు. దీనికితోడు 17వ ఓవర్‌లో ముల్డర్ (11), జోర్జి (2)లను కూడా అవుట్ చేసిన జడ్డూ.. కాసేపటికే స్టబ్స్ (5)ను బౌల్డ్ చేశాడు. దీంతో ఆ జట్టు 60/5 స్కోరుతో కష్టాల్లో పడింది. ఓవైపు కెప్టెన్ బవుమా మాత్రం ఓపిగ్గా క్రీజులో నిలిచాడు. మరో ఎండ్‌లో వెరీన్ (9)ను అక్షర్, యాన్సెన్ (13)ను కుల్దీప్ అవుట్ చేయడంతో బవుమాకు సహకారం అందలేదు. రెండో రోజు ఆట కూడా వెలుతురు లేమితో కాస్త ముందుగానే ముగించారు.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 159

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) యాన్సెన్ 12, రాహుల్ (సి) మార్‌క్రమ్ (బి) కేశవ్ 39, సుందర్ (సి) మార్‌క్రమ్ (బి) హార్మర్ 29, గిల్ (రిటైర్డ్ హర్ట్) 4, పంత్ (సి) వెరీన్ (బి) బాష్ 27, జడేజా (ఎల్బీ) హార్మర్ 27, జురెల్ (సి అండ్ బి) హార్మర్ 14, అక్షర్ (సి) యాన్సెన్ (బి) హార్మర్ 16, కుల్దీప్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 1, సిరాజ్ (బి) యాన్సెన్ 1, బుమ్రా (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 62.2 ఓవర్లలో 189 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-18, 2-75, 3-109, 4-132, 5-153, 6-171, 7-172, 8-187, 9-189. **బౌలింగ్:** యాన్సెన్ 15-4-35-3, ముల్డర్ 5-1-15-0, కేశవ్ 16-1-66-1, బాష్ 11-4-32-1, హార్మర్ 15.2-4-30-4.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: రికెల్టన్ (ఎల్బీ) కుల్దీప్ 11, మార్‌క్రమ్ (సి) జురెల్ (బి) జడేజా 4, ముల్డర్ (సి) పంత్ (బి) జడేజా 11, బవుమా (బ్యాటింగ్) 29, జోర్జి (సి) జురెల్ (బి) జడేజా 2, స్టబ్స్ (బి) జడేజా 5, వెరీన్ (బి) అక్షర్ 9, యాన్సెన్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 13, బాష్ (బ్యాటింగ్) 1; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 35 ఓవర్లలో 93/7. వికెట్ల పతనం:** 1-18, 2-25, 3-38, 4-40, 5-60, 6-75, 7-91.. **బౌలింగ్:** బుమ్రా 6-1-14-0, అక్షర్ 11-0-30-1, కుల్దీప్ 5-1-12-2, జడేజా 13-3-29-4.

1 భారత్ తరఫున టెస్టుల్లో ఎక్కువ సిక్సర్లు (92) బాదిన బ్యాటర్‌గా పంత్. సెహ్వాగ్ (90)ను అధిగమించాడు.

వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) సైకిల్‌లో 150 వికెట్లు, 2500 పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గా జడేజా.

2 టెస్టుల్లో వేగంగా (88 టెస్టులు) 4 వేల రన్స్+300 వికెట్లు తీసిన రెండో ప్లేయర్‌గా జడేజా. ఇయాన్ బోథమ్ (72) ముందున్నాడు. ఓవరాల్‌గా ఈ ఫీట్ సాధించిన నాలుగో ఆల్‌రౌండర్. ఇందులో స్వదేశంలో 2000+ రన్స్, 250+ వికెట్లు ఉండడం విశేషం.



ఆస్పత్రిలో గిల్

భారత కెప్టెన్ గిల్ తొలి టెస్టు మిగిలిన ఆటలో బరిలోకి దిగేది సందేహంగా మారింది. రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌లో 3 బంతులనే ఎదుర్కొన్న గిల్ మెడనొప్పితో మైదానం వీడాడు. హార్మర్ ఓవర్‌లో గిల్ స్లాగ్ స్వీప్ షాట్‌తో బౌండరీ సాధించాడు. కానీ వెంటనే మెడ పట్టేయడంతో తల తిప్పలేకపోయాడు. ఫిజియో వచ్చి పరిశీలించినా నొప్పి తగ్గకపోవడంతో గిల్ క్రీజు వీడాడు. కొన్ని గంటల తర్వాత మెడకు పట్టీతో కనిపించిన గిల్‌ను స్ట్రెచర్‌పై పడుకోబెట్టి అంబులెన్స్‌లో తీసుకెళ్లారు.

లక్ష్యసేన్‌కు నిరాశ

కుమమొటో: జపాన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ లక్ష్యసేన్ పోరాటానికి సెమీఫైనల్లో తెరపడింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో ఏడో సీడ్ లక్ష్య 19-21, 21-14, 12-21తో స్థానిక షట్లర్ కెంటా నిషిమొటో చేతిలో ఓటమి పాలయ్యాడు.

సెమీస్‌కు మనమ్మాయిలు

అంధుల టీ20 ప్రపంచకప్

ముంబై: ఆరంభ మహిళల అంధుల టీ20 ప్రపంచకప్‌లో ఆతిథ్య భారత్ 10 వికెట్ల తేడాతో యూఎస్‌ఏపై గెలిచి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. మొదట యూఎస్‌ఏ 20 ఓవర్లలో 60/8 స్కోరుకే పరిమితమైంది. ఛేదనలో భారత్ 3.3 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 61 రన్స్ చేసి గెలిచింది.

ఏటీపీ ఫైనల్స్ టైటిల్‌ఫైట్‌కు సిన్నర్

ట్యూరిన్: సీజన్ ముగింపు టోర్నీ, ప్రతిష్టాత్మక ఏటీపీ ఫైనల్స్ టెన్నిస్ టోర్నీలో టాప్ ఆటగాడు జానిక్ సిన్నర్ టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచాడు. సెమీఫైనల్లో సిన్నర్ 7-5, 6-2తో అలెక్స్ డి మినార్‌ను ఓడించాడు. మరో స్టార్ ఆటగాడు కార్లోస్ అల్కారజ్, ఫెలిక్స్ అగర్ మధ్య జరిగే మరో సెమీస్ విజేతతో సిన్నర్ ఫైనల్లో తలపడతాడు.

రాజస్థాన్‌కు జడేజా.. చెన్నైకి శాంసన్

రస్సెల్‌ను వదులుకున్న కోల్‌కతా

- లఖ్‌నవూకు షమిని అమ్మిన సన్‌రైజర్స్
- మినీ వేలానికి 77 మంది క్రికెటర్లు



ముంబై: ఐపీఎల్‌లో ఊహించని సంచలనాలు చోటుచేసుకొన్నాయి. మినీ వేలానికి ముందు ఫ్రాంచైజీలు అనూహ్య నిర్ణయాలతో అభిమానులను ఆశ్చర్యపరిచాయి. రాబోయే సీజన్ కోసం టాప్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాను చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ట్రేడింగ్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు అమ్మేయడం.. బదులుగా ఆ జట్టు కెప్టెన్ సంజూ శాంసన్‌ను తీసుకోవడం చర్చనీయాంశమైంది. దీనికి తోడు కోల్‌కతా నైట్‌రైడర్స్ తమ ప్రధాన ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్‌ను వదిలేయడం గమనార్హం. ఇలా.. 10 ఫ్రాంచైజీలు మొత్తంగా 77 మంది ఆటగాళ్లను విడుదల చేసినట్టు ఐపీఎల్ శనివారం ప్రకటించింది. వీళ్లంతా వచ్చేనెల 16న అబుదాబిలో జరిగే మినీ వేలానికి అందుబాటులో ఉంటారు. గతేడాది జరిగిన మెగా వేలంలో ఆయా ఫ్రాంచైజీలు ఆటగాళ్లను భారీ ధరకే రిటైన్, కొనుగోలు చేశాయి. అయితే, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని స్థిరమైన జట్టును తయారు చేసే ఆలోచనతోనే మినీ వేలంలో ఆ లోటుపాట్లను పూడ్చుకోవాలని ఫ్రాంచైజీలు చూస్తున్నాయి. కాగా, ట్రేడింగ్‌లో భాగంగా జడేజాకు చెన్నై చెల్లిస్తున్న రూ. 18 కోట్ల ఫీజు కంటే తక్కువగా... అంటే రూ. 14 కోట్లకు అతడిని రాజస్థాన్ దక్కించుకొంది. లీగ్ ఆరంభంలో రెండు సీజన్లు రాజస్థాన్‌కు ప్రాతినిథ్యం వహించిన జడ్డూ కెరీర్ చివర్లో మరోసారి అక్కడికే చేరాడు. 12 ఏళ్లపాటు అతడు చెన్నై తరఫున ఆడాడు. ఇక.. శాంసన్‌కు ప్రస్తుతమున్న రూ. 18 కోట్లనే చెన్నై చెల్లించనుంది. సంజూను కెప్టెన్ ధోనీకి వారసుడిగా తీసుకొస్తున్నారనే ఊహాగానాలున్నాయి. పేసర్ మహ్మద్ షమిని సన్‌రైజర్స్ రూ. 10 కోట్లకు లఖ్‌నవూకు ట్రేడ్ చేసింది. సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్‌ను ముంబై ప్రస్తుత ఫీజు రూ. 30 లక్షలకు లఖ్‌నవూకు అమ్మేసింది.


ప్రక్షాళన దిశగా కోల్‌కతా: జట్టును పునర్‌నిర్మించాలనుకొంటున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ వెంకటేష్ అయ్యర్ (రూ. 23.75 కోట్లు), రస్సెల్ (రూ. 12 కోట్లు)తోపాటు డికాక్, మొయిన్ అలీ, నోకియా, గుర్బాజ్‌ను విడుదల చేయగా.. పేసర్ మయాంక్ మార్కండేను ముంబైకి ట్రేడ్ చేసింది. దీంతో రూ. 64.3 కోట్ల భారీ మొత్తంతో కోల్‌కతా వేలానికి సిద్ధమైంది. అయితే, రహానె, నరైన్, వరుణ్, రింకూ.. ఇలా కోర్ టీమ్‌ను రిటైన్ చేసుకొన్న నైట్‌రైడర్స్‌లో 13 ఖాళీలు ఏర్పడ్డాయి. మరోవైపు బౌలింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేయాలనుకొంటున్న చెన్నై.. ట్రేడింగ్‌లో శాంసన్‌ను తీసుకొన్నా కూడా రూ. 43.4 కోట్లతో వేలానికి వెళ్లనుంది. పేసర్ పతిరన, కాన్వే, రచిన్ రవీంద్ర, రాహుల్ త్రిపాఠి, విజయ్ శంకర్, దీపక్ హుడా, తెలుగు క్రికెటర్ రషీద్‌లను వదిలేసింది. జడేజాతోపాటు సామ్ కర్రాన్‌ను రూ. 2.4 కోట్లకు రాజస్థాన్‌కు అమ్మేసింది.

ఢిల్లీకి రాణా: ఆల్‌రౌండర్ నితీశ్ రాణాను ఢిల్లీ రూ. 4.2 కోట్లకు రాజస్థాన్ నుంచి ట్రేడింగ్‌లో దక్కించుకొంది. డుప్లెసి, ఫ్రేజర్ సహా ఆరుగురిని ఢిల్లీ విడుదల చేసింది. కీపర్ డోనోవాన్ ఫెరీరాను రూ. కోటికి రాజస్థాన్ రాయల్స్‌కు అమ్మేసింది. కరీమ్, కేజ్రోలియా, కొట్జీ, షనక్, మహిపాల్‌ను గుజరాత్ టైటాన్స్ రిలీజ్ చేయగా.. రూథర్‌ఫోర్డ్‌ను ముంబైకి అమ్మేసింది. షమి, జంపా, రాహుల్ చాహర్‌తో పాటు 8 మందిని సన్‌రైజర్స్ హైదరాబాద్.. స్టార్ ఆల్‌రౌండర్ మ్యాక్స్‌వెల్, ఇన్‌గ్లిస్ సహా ఐదుగురిని పంజాబ్ కింగ్స్.. హసరంగ, తీక్షణ, ఫరూఖీ సహా 8 మందిని రాజస్థాన్.. టోప్లే, కర్ణ్‌శర్మ, ఆంధ్ర పేసర్ పీఎస్ఎన్ రాజు సహా 9 మందిని ముంబై.. ఆకాశ్‌దీప్, బిష్ణోయ్, మిల్లర్‌లను లఖ్‌నవూ.. లివింగ్‌స్టోన్, ఎన్‌గిడి, మయాంక్ అగర్వాల్‌లను బెంగళూరు విడుదలజేశాయి.

ఫ్రాంచైజీల వద్ద మిగిలిన మొత్తం	
● కోల్‌కతా	రూ. 64.30 కోట్లు
● చెన్నై	రూ. 43.40 కోట్లు
● సన్‌రైజర్స్	రూ. 25.50 కోట్లు
● లఖ్‌నవూ	రూ. 22.95 కోట్లు
● ఢిల్లీ	రూ. 21.80 కోట్లు
● బెంగళూరు	రూ. 16.40 కోట్లు
● రాజస్థాన్	రూ. 16.05 కోట్లు
● గుజరాత్	రూ. 12.90 కోట్లు
● పంజాబ్	రూ. 11.50 కోట్లు
● ముంబై	రూ. 2.75 కోట్లు

బిజినెస్ ప్లస్

వెండిపైనా రుణాలు



- 2026 ఏప్రిల్ 1 నుంచి అందుబాటులోకి
- నోటిఫికేషన్ జారీ చేసిన ఆర్‌బీఐ

ఇంట్లో బోలెడన్ని వెండి నగలు, నాణేలు ఉన్నాయి. బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) వద్ద వీటిని కుదువ పెట్టి రుణాలు తీసుకోవచ్చా? ప్రస్తుతానికైతే లేదు. అయితే వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇందుకు అవకాశం ఏర్పడనుంది. ఇందు కోసం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (గోల్డ్ అండ్ సిల్వర్ లోన్స్) డైరెక్షన్స్, 2025 పేరుతో నోటిఫికేషన్ విడుదల చేసింది. పసిడి, వెండి రుణాల మంజూరులో పారదర్శకత, నియంత్రణ కోసం ఆర్‌బీఐ ఈ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్‌తో వెండి నగలు, నాణేలు కుదువ పెట్టేటప్పుడు వాటికి సరైన విలువ కూడ లభిస్తుందని భావిస్తున్నారు.

రుణ పరిమితులు

- రూ.2.5 లక్షల వరకు వెండి నగలు, నాణేల విలువలో 85% వరకు
- రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల లోపు రుణాలైతే విలువలో 80% వరకు
- తీసుకునే రుణం రూ.5 లక్షలకు మించి ఉంటే విలువలో 75% వరకు

విలువ లెక్కింపు విధానం

గత నెల రోజుల్లో వెండి సగటు ధర లేదా క్రితం రోజు ముగింపు ధర.. వీటిలో ఏది తక్కువైతే దాని ఆధారంగా వెండి నగలు, నాణేల విలువ లెక్కకడతారు. ఈ ధరలను ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) నుంచి లేదా ఏదైనా గుర్తింపు పొందిన కమోడిటీస్ ఎక్స్ఛేంజీ నుంచి తీసుకుంటారు. నగలైతే అందులోని విలువైన రత్నాలు, రాళ్ల విలువను పరిగణనలోకి తీసుకోరు.

రుణం తీర్చిన 7 రోజుల్లో వెనక్కు..

బంగారం లేదా వెండి ఆభరణాలు, నాణేలు హామీగా పెట్టి తీసుకున్న రుణాలను తీర్చివేసిన ఏడు పని దినాల్లో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, గృహ రుణ కంపెనీలు వాటిని కుదువ పెట్టిన వారికి తిరిగి ఇవ్వాలి. ఈ విషయంలో ఏ మాత్రం ఆలస్యం చేసినా రోజుకు రూ.5,000 చొప్పున వాటి యజమానులకు నష్ట పరిహారంగా చెల్లించాలి.

రెండేళ్లలో క్లెయిమ్ చేయకపోతే వేలానికి

తీసుకున్న రుణాన్ని ఖాతాదారుడు నిర్ణీత కాలంలోగా చెల్లించక పోతే బ్యాంకులు కుదువపెట్టిన బంగారం, వెండి ఆభరణాలు, నాణేలను వేలం వేసి తమ సొమ్ము రాబట్టుకోవచ్చు. కాకపోతే ఈ వేలం వేసి రాబట్టిన ధర మార్కెట్ ధరలో 90 శాతం కంటే తక్కువ ఉండకూడదు. కుదువ పెట్టి రెండేళ్లయినా క్లెయిమ్ చేయని బంగారం, వెండి నగలు, నాణేలను అన్‌క్లెయిమ్డ్‌గా వర్గీకరించి, వాటి యాజమానుల ఉనికిని కనుగొనేందుకు బ్యాంకులు ప్రత్యేక ప్రయత్నాలు చేయాలి.

ఈ రుణాలు ఎవరిస్తారంటే..

వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ బ్యాంకులు, పట్టణ, గ్రామీణ సహకార బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు.. బంగారం, వెండి ఆభరణాలు, నాణేల తాకట్టు రుణాలు ఇవ్వవచ్చు. అయితే శుద్ధమైన బంగారం, వెండి కడ్డీలు గోల్డ్ లేదా సిల్వర్ ఈటీఎఫ్‌లు, మ్యూచువల్ ఫండ్స్‌పై మాత్రం ఈ తరహా రుణాలు లభించవు.

వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. దీంతో వెండి ఆభరణాలు, నాణేలు స్థానిక వ్యాపారుల వద్ద కుదువ పెట్టి అధిక వడ్డీలకు రుణం తీసుకునే బాధ తగ్గనుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,25,080 ▼	1,14,650 ▼	1,75,100 ▼
విజయవాడ	1,27,500 ▼	1,19,000 ▼	1,59,000 ▼
విశాఖపట్నం	1,27,800 ▼	1,17,150 ▼	1,75,000 ▼
రాజమండ్రి	1,25,070 ▼	1,14,650 ▼	1,56,000 ▼
ప్రొద్దుటూరు	1,24,400 ▼	1,14,450 ▼	1,59,300 ▼
ముంబై	1,24,794 ▼	1,14,311 ▼	1,59,367 ▼



టాటా మోటార్స్ నుంచి సరికొత్త సియెర్రా

22 ఏళ్ల తర్వాత మళ్లీ మార్కెట్లోకి

ముంబై: టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ).. సరికొత్త ఎస్‌యూవీ సియెర్రాను ఆవిష్కరించింది. ఈ నెల 25న కంపెనీ అధికారికంగా సియెర్రాను మార్కెట్లోకి విడుదల చేయనుంది. సరికొత్త లుక్, డిజైన్‌తో రూపొందించిన ఈ ఎస్‌యూవీ.. హ్యుండయ్ క్రెటా, మారుతి గ్రాండ్ విటారా, హోండా ఎలివేట్‌కు గట్టి పోటీనిస్తుందని అంచనా వేస్తున్నారు. 1991లో తొలిసారిగా టాటా మోటార్స్ సియెర్రాను మార్కెట్లోకి తీసుకురాగా 2003లో ఈ కారు ఉత్పత్తిని నిలిపివేసింది. భారతీయుల మనసును చూరగొన్న ఈ ఎస్‌యూవీని 22 ఏళ్ల తర్వాత మళ్లీ వినియోగదారుల అభిరుచులు, కలలకు అనుగుణంగా మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు టాటా మోటార్స్ వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ డిజైన్ హెడ్ మార్టిన్ ఉలారిక్ తెలిపారు. ఈ ఎస్‌యూవీ ధర రూ.17 లక్షల నుంచి రూ.22 లక్షల మధ్యన ఉండొచ్చని అంచనా.

ఈ నెలాఖరులోపు చేయాల్సిన పనులేమిటంటే..



రాంబాబు గొండాల

జీఎస్‌టీ కింద నమోదైన వ్యాపారస్తులకు నవంబరు నెల చాలా ముఖ్యమైనది. గత ఆర్థిక సంవత్సరాని (2024-25)కి సంబంధించి ఏవైనా సర్దుబాట్లు చేయాలన్నా, గత ఆర్థిక సంవత్సరంలో దాఖలు చేసిన రిటర్నుల్లో జరిగిన పొరపాట్లు సరిదిద్దాలన్నా ఈ నెలాఖరులోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. వీటికి సంబంధించిన ముఖ్య విషయాలు మీకోసం.

ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్..

జీఎస్‌టీలో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) అనేది ఒక నిర్దిష్ట గడువులోపు తీసుకోవాలనే నిబంధన ఒకటి ఉంది. ఐటీసీ నియమ నిబంధనల ప్రకారం ఇన్వాయిస్ లేదా డెబిట్ నోట్ ఏ ఆర్థిక సంవత్సరంలో తీసుకుంటారో.. సంబంధిత ఐటీసీని తదుపరి సంవత్సరం నవంబరు 30 లోపు తీసుకోవాలి. అంటే 2024-25 ఆర్థిక సంవత్సరంలో పొందిన ఇన్వాయిస్‌లు లేదా డెబిట్ నోట్స్‌కు సంబంధించి ఏదైనా ఐటీసీ తీసుకోకుండా మిగిలి ఉంటే ఆ మొత్తాన్ని ఈ నవంబరు 30లోపు తీసుకోవాలి. కాబట్టి వ్యాపారస్తులు తాము గత ఆర్థిక సంవత్సరంలో పొందిన ఇన్వాయిస్‌లను జాగ్రత్తగా గమనించి అర్హత ఉండి తీసుకోని ఐటీసీ ఏమైనా మిగిలి ఉంటే ఆ మొత్తాన్ని ఈ నెలాఖరు లోపు తీసుకోవచ్చు. అయితే ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్ దాఖలు చేయకుండా ఐటీసీని తీసుకోలేరు. కాబట్టి నవంబరు 30వ తేదీని తుది గడువుగా దృష్టిలో పెట్టుకుని జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్ దాఖలు చేయటం ద్వారా మిగిలిపోయిన ఐటీసీని తీసుకోవచ్చు.

క్రెడిట్ నోట్..

అలాగే గత ఆర్థిక సంవత్సరంలో జరిపిన సరఫరాలకు సంబంధించి ఏదైనా క్రెడిట్ నోట్ జారీ చేసినట్లయితే సంబంధిత క్రెడిట్ నోట్ విలువను తదుపరి సరఫరాలలో తగ్గించుకోవటానికి తుది గడువు నవంబరు 30. కాబట్టి ఏదేనీ క్రెడిట్ నోట్‌కు సంబంధించిన విలువను తగ్గించకుంటే సంబంధిత రిటర్న్ దాఖలు చేయటం ద్వారా నవంబరు 30 లోపు క్రెడిట్ నోట్ విలువను సర్దుబాటు చేసుకోవటం ద్వారా ఇంతకు ముందు ఎక్కువ కట్టిన ట్యాక్స్‌ను తగ్గించుకోవచ్చు.

జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌లో పొరపాట్లు ఉన్నా..

ఒక నెలలో జరిపిన సరఫరాల వివరాలను జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌లో చూపాలన్న విషయం తెలిసిందే. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దాఖలు చేసిన జీఎస్‌టీఆర్-1 రిటర్నుల్లో చూపాల్సిన వివరాల్లో ఏవైనా పొరపాట్లు జరిగితే ఆ పొరపాట్లు సరిదిద్దుకోవటానికి కూడా గడువు తేదీ నవంబరు 30. ఇంకా జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్‌తో పాటుగా మరికొన్ని రిటర్నులకు సంబంధించిన పొరపాట్లకు సంబంధించిన సవరణలకు గడువు తేదీ కూడా ఈ నెల 30నే.

ఇక్కడ మరొక ముఖ్య విషయం ఏమిటంటే.. పైన చెప్పిన ప్రతి అంశానికి సంబంధిత నియమ నిబంధనలు వర్తిస్తాయి. అంతేకాకుండా, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రిటర్న్ ఒకవేళ నవంబరు 30 కంటే ముందే దాఖలు చేస్తే పైన చెప్పిన అన్ని సందర్భాలకు నవంబరు 30కి బదులుగా వార్షిక రిటర్న్ దాఖలు చేసిన తేదీనే గడువు తేదీగా తీసుకోవాల్సి ఉంటుంది.

ఎలక్ట్రానిక్ క్రెడిట్ రివర్సల్

ఈ నెలాఖరు లోపు చేయాల్సిన మరొక ముఖ్యమైన పని, ఇంతకు ముందు రివర్స్ చేసి తిరిగి క్లెయిమ్ చేయటానికి అర్హత ఉన్న ఐటీసీ బ్యాలెన్స్‌ను 'ఎలక్ట్రానిక్ క్రెడిట్ రివర్సల్ అండ్ రీ-క్లెయిమ్డ్ స్టేట్‌మెంట్' లో చూపటం. ఈ నెలాఖరు లోపు ఈ పని చేయని వారు బ్యాలెన్స్ క్రెడిట్‌ను కోల్పోతారు. కాబట్టి అందరు తమ ఖాతాలను జాగ్రత్తగా చూసుకోవాలి. వివరంగా చెప్పాలంటే.. జీఎస్‌టీకి సంబంధించి నవంబరు నెల చాలా ముఖ్యమైనది. కాబట్టి వ్యాపారస్తులు తమ ఆడిటర్లతో క్షుణ్ణంగా చర్చించి గత ఆర్థిక సంవత్సర లావాదేవీలకు సంబంధించి ఎలాంటి పెండిగ్‌లు లేకుండా చూసుకోవాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 16వ తేదీ			
హైదరాబాద్	610	విజయవాడ	625
వరంగల్	612	గోదావరి	620
చిత్తూరు	653	విశాఖపట్నం	605
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర	వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్		
హైదరాబాద్	117	విజయవాడ	111
వరంగల్	117	గుంటూరు	115
కరీంనగర్	117	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	120
కర్నూలు	117	నెల్లూరు	125
విశాఖపట్నం	110	అనంతపురం	125
గోదావరి	111		

ఐసీఎల్ ఫిన్‌కార్ప్ రూ.100 కోట్ల ఎన్‌సీడీ ఇష్యూ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ ఐసీఎల్ ఫిన్‌కార్ప్.. సెక్యూర్డ్ రిడీమబల్ నాన్ కన్వర్టబల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ ద్వారా రూ.100 కోట్లు సమీకరించనున్నట్లు ప్రకటించింది. ఈ ఎన్‌సీడీ ఇష్యూ ఈ నెల 17న ప్రారంభమై 28న ముగియనుందని సంస్థ సీఎండీ కేజీ అనిల్ కుమార్ వెల్లడించారు. క్రిసిల్ బీబీబీ మైనస్ రేటింగ్ కలిగిన ఈ ఎన్‌సీడీ ఇష్యూ 13,24,36,60,70 నెలల కాలపరిమితులతో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఒక్కో ఎన్‌సీడీని రూ.1,000 ముఖ విలువతో జారీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. 10.50 శాతం నుంచి 12.62 శాతం వడ్డీ రేటును ఈ ఎన్‌సీడీలకు ఐసీఎల్ ఆఫర్ చేస్తోంది. ఈ ఇష్యూ బేస్ పరిమాణం రూ.50 కోట్లుగా ఉండగా గ్రీన్ షూ ఆప్షన్ కింద మరో రూ.50 కోట్లు సమీకరించనుంది. సంస్థ సేవల విస్తరణతో పాటు వృద్ధికి ఎన్‌సీడీ ద్వారా సమీకరించిన మొత్తాలను వినియోగించనున్నట్లు ఐసీఎల్ ఫిన్‌కార్ప్ తెలిపింది.

భారత ఆర్మీ నుంచి ఐడియా ఫోర్జ్‌కు రూ.100 కోట్ల ఆర్డర్లు

ముంబై: భారత సైన్యం నుంచి రూ.100 కోట్లకు పైగా విలువైన ఆర్డర్లు దక్కించుకున్నట్లు డ్రోన్ల తయారీ సంస్థ ఐడియాఫోర్జ్ టెక్నాలజీ లిమిటెడ్ వెల్లడించింది. తమ కొత్త ఉత్పత్తులైన టాక్టికల్ యూఏవీ (అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికిల్) 'జోల్ట్'కు రూ.75 కోట్లు, ఆల్ టెర్రెయిన్ వీటోల్ డ్రోన్ 'స్విచ్ వీ2'కు రూ.30 కోట్ల ఆర్డర్లు దక్కాయని సంస్థ తెలిపింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బెంగళూరులో జరిగిన ఏరో ఇండియాలో కంపెనీ ఈ రెండు అత్యాధునిక డ్రోన్లను విడుదల చేసింది.

బజాజ్ ఫిన్‌సర్వ్ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ ఫండ్

బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ.. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ ఫండ్‌ను ప్రారంభించింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగంలో పెట్టుబడులు పెట్టే ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం ఇది. ఈ ఫండ్‌కు నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ టీఆర్‌ఐ బెంచ్ మార్క్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. ముగింపు తేదీ ఈ నెల 24.

బంధన్ హెల్త్‌కేర్ ఫండ్

బంధన్ మ్యూచువల్ ఫండ్.. హెల్త్‌కేర్ ఫండ్‌ను తీసుకువచ్చింది. హెల్త్‌కేర్, ఫార్మా, ఇతర రంగాల్లో పెట్టుబడులు పెట్టే ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. ముగింపు తేదీ ఈ నెల 24.

బీజేపీకి 90% స్ట్రైక్ రేట్ ఎలా సాధ్యం?

- దేశ చరిత్రలో ఎన్నడూ ఇలా జరగలేదు: కేసీ వేణుగోపాల్
- బిహార్ ఫలితాలు ఓట్ చోరీకి నిదర్శనం: జైరాం రమేశ్

న్యూఢిల్లీ, నవంబరు 15: 'బిహార్ ఫలితాలపై సమీక్షిస్తున్నాం. దేశ చరిత్రలో ఓ రాజకీయ పార్టీ (బీజేపీ)కి 90% స్ట్రైక్ రేట్ అనేది ఎప్పుడూ సాధ్యం కాలేదు. ఈసీ మొదట్నుంచీ పక్షపాతంతో వ్యవహరించింది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లేదు. డేటాను సేకరిస్తున్నాం. ఒకటి, రెండు వారాల్లో కచ్చితమైన ఆధారాలతో వస్తాం' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కోశాధికారి అజయ్ మాకెన్, బిహార్ ఇన్‌చార్జి కృష్ణ అల్లవారు తదితర సీనియర్ నేతలతో ఆ పార్టీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ శనివారం సమావేశమై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశం తర్వాత వేణుగోపాల్ మీడియాతో మాట్లాడారు. ఈసీపై ఆరోపణలు గుప్పించారు. బీజేపీని ఈసీ కాపాడుతోందన్నారు. మెషీన్ రీడబుల్ ఓటర్ల జాబితాలను అందించడానికి నిరాకరించడం, పోలింగ్ ప్రక్రియల నుంచి సీసీటీవీ ఫుటేజీని తొలగించడం ద్వారా సిగ్గు లేకుండా ఈసీ అన్ని పరిధులు దాటిందని దుయ్యబట్టారు. 'ఏ సందేహం లేదు. బిహార్ ఎన్నికల ఫలితాలు ప్రధాని, కేంద్ర హోంమంత్రి, ఎన్నికల సంఘం అమలు చేసిన భారీ స్థాయి ఓట్ చోరీనే ప్రతిబింబిస్తున్నాయి' అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. ఎన్ని పరాజయాలు ఎదురైనా కాంగ్రెస్ ఎన్నడూ కనుమరుగు కాలేదని మహారాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రమేశ్ చెన్నితాల చెప్పారు. కాంగ్రెస్ అంతం అవుతుంది లేదా ముక్కలవుతుందన్న వాదనకు అసలు అర్థమే లేదని వ్యాఖ్యానించారు.

కుల విషాన్ని తిరస్కరించిన బిహార్ ఓటర్లు: మోదీ

సూరత్, నవంబరు 15: ప్రతిపక్షాలు చిమ్మిన 'కులతత్వ విషాన్ని' బిహార్ ప్రజలు తిరస్కరించారని ప్రధాని మోదీ అన్నారు. ఇది దేశానికి శుభ సూచకమని చెప్పారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ ఘన విజయం సాధించడాన్ని పురస్కరించుకొని గుజరాత్‌లోని సూరత్‌లో అక్కడ నివసిస్తున్న బిహారీలు శనివారం నిర్వహించిన సన్మాన సభలో ఆయన ప్రసంగించారు. కులాల పేరు చెప్పి విజయం సాధించాలనుకున్న నాయకుల ప్రయత్నాలను బిహార్ ప్రజలు వమ్ముచేశారని చెప్పారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై మోదీ విమర్శల బాణాలు సంధించారు. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలతో కలిసి పనిచేసిన కాంగ్రెస్‌లోని జాతీయవాద నాయకులు 'నామ్‌ధార్' (రాహుల్ గాంధీ) చర్యలను చూసి విచారంలో మునిగిపోయారని వ్యాఖ్యానించారు. దశాబ్ద కాలంగా కాంగ్రెస్ ఎదుర్కొంటున్న వరుస పరాజయాలను చూసి ఆ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సి ఉందని చెప్పారు. దళితులు ఆధిక్యం ఉన్న 38 నియోజకవర్గాలకుగానూ 34 ఎన్‌డీఏకు దక్కాయని గుర్తు చేశారు. దళితులు ప్రతిపక్షాలను తిరస్కరించారనడానికి ఇదే రుజువని చెప్పారు.

రాజ్యసభలో ఎన్‌డీఏకు పెరగనున్న సీట్లు

న్యూఢిల్లీ, నవంబరు 15: బిహార్ ఎన్నికల్లో ఎన్‌డీఏ ఘనవిజయంతో, రాబోయే రాజ్యసభ ఎన్నికల్లో కూటమి బలం పెరగనుంది. ఈ గెలుపుతో మోదీ ప్రభుత్వ పదవీ కాలం ముగిసే వరకు.. బిహార్ నుంచి ఖాళీ అయ్యే అన్ని రాజ్యసభ స్థానాలనూ కూటమి కైవసం చేసుకునే అవకాశం కనిపిస్తోంది. భవిష్యత్తులో ఆర్జేడీకి రాజ్యసభలో ప్రాతినిధ్యం దక్కకపోవచ్చు. బిహార్‌లో 16 రాజ్యసభ స్థానాలుండగా, ప్రస్తుతం ఆర్జేడీ ఐదు సీట్లకు ప్రాతినిధ్యం వహిస్తోంది. అయితే, ఇద్దరు ఆర్జేడీ ఎంపీలతో సహా ఐదుగురు రాజ్యసభ సభ్యుల పదవీ కాలం వచ్చే ఏడాదితో ముగియనుంది. రాజ్యసభలో ఒక్క స్థానాన్ని గెలుచుకోవాలంటే 42మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. మహాగఠ్ బంధన్ వద్ద 35 ఎమ్మెల్యే సీట్లు మాత్రమే ఉన్నాయి. దీంతో 5ఎంపీ స్థానాలు ఎన్డీయే ఖాతాలో చేరే అవకాశం ఉంది.

25 మంది మంత్రులు పోటీ చేస్తే ఒక్కరికే ఓటమి

పట్నా, నవంబరు 15: బిహార్‌లో పోటీ చేసిన 25 మంది రాష్ట్ర మంత్రుల్లో ఒక్కరు తప్ప మిగిలిన వారంతా విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఉప ముఖ్యమంత్రులు సామ్రాట్ చౌధరి, విజయ్ కుమార్ సిన్హాలు తారాపూర్, లఖిసరాయ్ నియోజకవర్గాల నుంచి గెలిచారు. వీరిద్దరూ బీజేపీకి చెందిన వారే. మొత్తంగా బీజేపీ నుంచి పోటీ చేసిన 15 మంది మంత్రులు ఎన్నికల్లో విజయం సాధించారు. జేడీయూ నుంచి 9 మంది గెలిచారు. కాగా, మంత్రి సుమిత్‌కుమార్ జేడీయూ తరఫున చకాయ్ నియోజకవర్గం నుంచి పోటీ చేయగా ఓటమి పాలయ్యారు. ఆర్‌జేడీ అభ్యర్థి సావిత్రీ దేవీ చేతిలో దాదాపు 13వేల ఓట్ల తేడాతో ఈయన ఓడిపోయారు. ఐదేళ్ల క్రితం ఎన్నికల్లో ఈమెపై సింగ్ విజయం సాధించారు.

కర్ణాటకలో క్యాబినెట్ విస్తరణకు రాహుల్ ఓకే

బెంగళూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో మంత్రివర్గ విస్తరణకు సీఎం సిద్దరామయ్యకు అధిష్ఠానం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఢిల్లీకి వెళ్లిన సిద్దరామయ్య.. శనివారం సాయంత్రం రాహుల్ గాంధీతో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. బిహార్ ఎన్నికల ప్రస్తావన తర్వాత రాష్ట్ర క్యాబినెట్ విస్తరణపై చర్చించారు. దీంతో మంత్రివర్గ విస్తరణ జరుపుకోవాలని రాహుల్‌గాంధీ సూచించారు. ఈ విషయం గురించి పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో చర్చించాలని రాహుల్ సూచించారు.

అయ్యప్ప భక్తులూ.. జర జాగ్రత్త



- నదీ స్నానం చేసే సమయంలో ముక్కులోకి నీళ్లు పోకుండా చూసుకోండి
- బ్రెయిన్ ఫీవర్ కేసులతో కేరళ అప్రమత్తం
- ప్రత్యేక అడ్వైజరీ జారీ చేసిన ఆరోగ్యశాఖ

పథనంతిట్ట(కేరళ), నవంబరు 15: శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్లే భక్తులకు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ శనివారం ప్రత్యేక అడ్వైజరీ జారీ చేసింది. రాష్ట్రంలో అమీబిక్ మెనింజోఎన్‌సైఫలిటిస్ (బ్రెయిన్ ఫీవర్) కేసులు నమోదవుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నదీ స్నానాలు చేసే సమయంలో ముక్కులోకి నీరు పోకుండా చూసుకోవాలని పేర్కొంది. ఇప్పటికే చికిత్స పొందుతున్నవారు తమ ఆరోగ్యానికి సంబంధించిన రికార్డులు, మందులు వెంట తీసుకెళ్లాలని, యాత్రకు వచ్చేవారు రోజువారీగా వాడే మందులు నిలిపివేయకూడదని కోరింది. నిదానంగా నడవాలని, దారిలో అక్కడక్కడా విశ్రాంతి తీసుకోవాలని, అలసట, ఛాతీ నొప్పి, ఊపిరి ఆడకపోవడం, నీరసం వంటి సమస్యలు ఎదురైనప్పుడు సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో తక్షణ వైద్య సహాయం తీసుకోవాలని స్పష్టం చేసింది. అత్యవసర పరిస్థితుల్లో 04735 203232 నంబరులో సంప్రదించాలని సూచించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 17 నుంచి శబరిమలలోని అయ్యప్ప స్వామి ఆలయం తలుపులు తెరుచుకోనున్నాయి.

భక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవీ...

- వేడి చేసిన నీటినే తాగాలి. ఆహారం తీసుకొనే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. పండ్లను బాగా కడిగిన తర్వాత తినాలి. మూత పెట్టని, నిల్వ ఉన్న ఆహారం తీసుకోవద్దు.
- బహిరంగ మలవిసర్జన నిషేధం. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించాలి. వ్యర్థాలను చెత్త డబ్బాల్లో మాత్రమే పడేయాలి.
- యాత్రకు రావడానికి కొద్ది రోజుల ముందునుంచి భక్తులు నడక వంటి తేలికపాటి వ్యాయామాలు చేయాలి.
- పంపా నుంచి సన్నిధానం వరకూ అత్యవసర వైద్య కేంద్రాలతో పాటు భక్తుల కోసం ప్రత్యేక అంబులెన్స్ సేవలు. పంపాలో 24 గంటలు పని చేసే కంట్రోల్ సెంటర్ ఏర్పాటు.
- పథనంతిట్ట జనరల్ ఆస్పత్రిలో అత్యవసర కార్డియాలజీ సేవలు, క్యాథ్ ల్యాబ్ ప్రారంభం.
- యాత్రికులకు అవగాహన కల్పించేందుకు మలయాళంతో పాటు తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో బ్యానర్లు, బోర్డులు సిద్ధం.

శాంపిల్ తీస్తుండగా పేలుడు

నౌగావ్ పోలీస్‌స్టేషన్ పేలుడులో 9 మంది మృతి.. మృతుల్లో పోలీసులు, ఒక నాయబ్ తహసీల్దార్

ఫరీదాబాద్‌లో స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు ఇక్కడ నిల్వ



పేలుడులో చనిపోయినవారికి నివాళి అర్పిస్తున్న మనోజ్ సిన్హా

మృతులు వీరే...

పేరు	హోదా
ముజాఫిర్ అహ్మద్	నాయబ్ తహసీల్దార్
ఇస్రార్ అహ్మద్	పోలీస్ ఇన్‌స్పెక్టర్,స్పెషల్ బ్రాంచ్
జావేద్ రాథర్	సెలక్షన్ గ్రేడ్ కానిస్టేబుల్
అర్షిద్ అహ్మద్ షా	సెలక్షన్ గ్రేడ్ కానిస్టేబుల్
ఐజాజ్ అఫ్జల్ మిర్	సెలక్షన్ గ్రేడ్ కానిస్టేబుల్
అష్ఫాద్ ఆమిన్ మిర్	కానిస్టేబుల్
షౌకత్ అహ్మద్ భట్	కానిస్టేబుల్
సుహైల్ రాథర్	చౌకీదార్
మొహమ్మద్ షఫ్రే	టైలర్

శ్రీనగర్, నవంబరు 15: జమ్ముకశ్మీర్‌లోని నౌగావ్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న పేలుడులో మృతుల సంఖ్య 9కి పెరిగింది. ఇటీవల బయటపడిన ఫరీదాబాద్ ఉగ్రవాద మాడ్యూల్‌పై దర్యాప్తు జరుపుతున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఇస్రార్ అహ్మద్‌షా, ఒక నాయబ్ తహసీల్దార్ (మేజిస్ట్రేట్)తో కలిపి మొత్తం 9 మంది మరణించారని, 32 మంది గాయపడ్డారని జమ్ముకశ్మీర్ డీజీపీ నళినిప్రభాత్ శనివారం తెలిపారు. బాధితుల్లో అధికంగా పోలీస్, ఫోరెన్సిక్ అధికారులే ఉన్నట్లు చెప్పారు. ఈ ఘటన వెనుక ఉగ్రవాద కోణం లేదని కేంద్రం ప్రకటించింది. ఘటనపై జమ్ముకశ్మీర్ ఎల్జీ దర్యాప్తునకు ఆదేశించారు.

ఏం జరిగింది?

ఇటీవల హరియాణాలోని ఫరీదాబాద్‌లో జైషే మహ్మద్ ఉగ్రవాద మాడ్యూల్‌ను ఛేదించిన జమ్ముకశ్మీర్ పోలీసులు.. అక్కడి అల్ ఫలాహ్ యూనివర్సిటీలో ముగ్గురు వైద్యులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అందులో ఒకడైన ముజమ్మిల్ గది నుంచి స్వాధీనం చేసుకున్న 360 కిలోల పేలుడు పదార్థాలను నౌగావ్ పోలీస్ స్టేషన్‌లో భద్రపర్చారు. దర్యాప్తులో భాగంగా గురువారం నుంచి ఆ పేలుడు పదార్థాల నుంచి వివిధ రకాల శాంపిల్స్ సేకరిస్తున్నారు. నాయబ్ తహసీల్దార్ ముజాఫిర్ అహ్మద్ ఖాన్ సమక్షంలో రాష్ట్ర దర్యాప్తు ఏజెన్సీ ఇన్‌స్పెక్టర్ ఇస్రార్ అహ్మద్ షా నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి 11.20 గంటల సమయంలో శాంపిల్ సేకరిస్తుండగా అది ఒక్కసారిగా పేలిపోయిందని డీజీపీ నళిని ప్రభాత్ తెలిపారు. 'నిబంధనల ప్రకారం ఫోరెన్సిక్, కెమికల్ ఎగ్జామినేషన్ కోసం రెండు రోజులుగా శాంపిల్స్ సేకరిస్తున్నారు. శుక్రవారం రాత్రి కూడా ఫోరెన్సిక్ లేబోరేటరీ సిబ్బంది ఆ పనిలో ఉండగా దురదృష్టవశాత్తూ పేలుడు సంభవించింది. ఈ ఘటన విషయంలో ఇతర ఏ రకమైన ప్రచారాలను నమ్మొద్దు' అని సూచించారు. మొదటి పేలుడు సంభవించిన వెంటనే పోలీసులు, ఇతర సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. అయితే, ఆ వెంటనే పోలీస్ స్టేషన్‌లో నిల్వ ఉంచిన మరికొన్ని పేలుడు పదార్థాలు కూడా పేలిపోవటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడిందని అధికారులు తెలిపారు. పోలీసులకు సహాయం చేయటానికి వచ్చిన ఒక టైలర్ కూడా ఈ పేలుడులో ప్రాణాలు కోల్పోయాడు.

దర్యాప్తునకు ఆదేశం: ఎల్జీ

నౌగావ్ పోలీస్‌స్టేషన్ పేలుడుపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా శనివారం ప్రకటించారు. పేలుడులో పోలీస్, ఇతర అధికారులను కోల్పోవటం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ ఘటన వెనుక కుట్రకోణం ఏమీ లేదని కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ ప్రశాంత్ లోఖండే తెలిపారు. ఈ పేలుడు ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. భద్రతా సిబ్బంది ఎంత ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్నారనేది ఈ ఘటన గుర్తుచేస్తోందని శనివారం ఎక్స్‌లో పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ పేలుడు కేంద్ర ప్రభుత్వానికి మేల్కొలుపు లాంటిదని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. నౌగావ్ పేలుడుపై జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విచారం వ్యక్తంచేశారు.

డేటా భద్రతచట్టాన్ని నోటిఫై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, నవంబరు 15: దేశంలో తొలిసారి వ్యక్తిగత సమగ్ర వివరాల(డేటా) చట్టాన్ని నోటిఫై చేస్తూ కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు ఈ నెల 13న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. పార్లమెంటులో ఈ చట్టాన్ని ఆమోదించిన రెండేళ్ల తర్వాత, వ్యక్తుల గోప్యతను ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు గుర్తించిన 8సంవత్సరాల తర్వాత దీనిని నోటిఫై చేయడం గమనార్హం. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్(డీపీడీపీ)గా పేర్కొనే ఈ చట్టానికి సంబంధించిన నియమాలు, నిబంధనలు కేంద్రం విడుదల చేసింది. దీని ప్రకారం వ్యక్తిగత డేటాను నిర్వహించే కంపెనీలకు కొన్ని బాధ్యతలతోపాటు నియమాలను కూడా పేర్కొంది. అదేవిధంగా వినియోగదారుల హక్కులను పేర్కొనాలని తెలిపింది. దీనికిగాను ఆయా కంపెనీలకు 18 మాసాల గడువు విధించింది. డేటా నిర్వహణ, నిలుపుదల, సమ్మతి, పిల్లలకు సంబంధించిన వివరాల భద్రత, ఆడిట్ వంటి వివరాల విషయంలో ఆయా కంపెనీలు గోప్యతను పాటించాల్సి ఉంటుంది. రెండు వేర్వేరు నోటిఫికేషన్లను విడుదల చేసిన కేంద్రం.. దీనిలో భాగంగా రూల్ 17(1) ప్రకారం నలుగురు సభ్యులతో కూడిన డేటా ప్రొటెక్షన్ బోర్డు(డీపీబీ)ను ఏర్పాటు చేసింది. దీని కేంద్ర కార్యాలయం దేశ రాజధాని ప్రాంతంలో ఉంటుంది. ఏదైనా వ్యక్తిగత వివరాలు బయటకు వెల్లడించినా, నియమాలు ఉల్లంఘించినా 72 గంటల్లో డీపీబీకి సమాచారం ఇచ్చే వెసులుబాటు ఉంటుంది. కాగా, ఈ చట్టంలోని నిబంధన23(2)పై పలువురు న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి కారణాలు చెప్పకుండానే పౌరుల వ్యక్తిగత వివరాలు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని వ్యాఖ్యానించారు. అంతేకాదు, పుట్టుస్వామి కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును విస్మరించారని ఢిల్లీకి చెందిన శ్వేతా వెంకటేశన్ తెలిపారు.

స్మార్ట్‌గా 'ఉగ్ర' కుట్ర!

నిఘా సంస్థలు వాడే టెక్నాలజీతో పరస్పరం మెయిల్ సంభాషణ





న్యూఢిల్లీ, నవంబరు 15: ఢిల్లీ బాంబు పేలుడులో ఆత్మాహుతి బాంబరు ఉమర్ నబీ నడిపిన 'డాక్టర్ మాడ్యుల్'లోని సభ్యులు తమ డిజిటల్ ఆధారాలు దొరక్కుండా జాగ్రత్తపడినట్టు నిఘా వర్గాలు తెలిపాయి. దీని కోసం...ఒక ఈమెయిల్‌ను సృష్టించి, పాస్‌వర్డ్‌ను అందరి దగ్గర ఉంచుకున్నారు. మెయిల్ రాసి, దానిని ఎవరికైనా పంపితే ట్రాక్ చేయడం తేలిక. కానీ, ఆ మెయిల్‌ను ఎవరికీ పంపకపోతే డ్రాఫ్ట్‌లోకి అది చేరుతుంది. ఈ మాడ్యుల్‌లోని సభ్యులు తమ వద్ద ఉన్న పాస్‌వర్డుతో మెయిల్ ఓపెన్ చేసి డ్రాఫ్ట్‌లో తమకోసం ఉంచిన సందేశాన్ని చదువుకుంటారు. సాధారణంగా నిఘా సంస్థలు ఈ టెక్నాలజీని వాడతాయి. కాగా, ఢిల్లీ పేలుడు నేపథ్యంలో పోలీసులతో పాటు దర్యాప్తు సంస్థలు హరియాణాలోని అల్ ఫలాహ్ యూనివర్సిటీపై దృష్టి సారించాయి. ఇప్పటికే ఐదుగురిని అనుమానం మీద అదుపులోకి తీసుకోగా, శుక్రవారం రాత్రి మరో ముగ్గురిని హరియాణాలోని నుహ్, ధౌజ్‌ల్లో అదుపులోకి తీసుకున్నారు. వీరిలో అల్ ఫలాహ్ వర్సిటీకి చెందిన మొహమ్మద్, ముస్తాకిమ్ అనే ఇద్దరు వైద్యులు, లైసెన్స్ లేకుండా ఎరువుల వ్యాపారం చేస్తున్న దినేశ్ అనే వ్యక్తి ఉన్నారు. ఈ వైద్యులు ఆత్మాహుతి బాంబరు ఉమర్ నబీ, ఉగ్ర కుట్ర సూత్రధారి ముజమ్మిల్‌లకు సన్నిహితులని గుర్తించారు. వీరిలో ఒకరు పేలుడు జరిపిన రోజున ఢిల్లీలోనే ఉన్నాడని, ఎయిమ్స్‌లో ఇంటర్వ్యూ కోసం వచ్చినట్లు తెలిసింది. దినేశ్ బాంబుల తయారీ కోసం ఎరువులు అమ్మాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఉగ్ర సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలో జనీసూర్ ఆలం అనే ఎంబీబీఎస్ విద్యార్థిని ఎన్ఐఏ అరెస్టు చేసింది. ఇతను అల్ ఫలాహ్ వర్సిటీలో చదువుతున్నట్టు గుర్తించారు. పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో ఒక వైద్యుడిని దర్యాప్తు సంస్థలు అదుపులోకి తీసుకున్నాయి. ఇతడు గతంలో అల్ ఫలాహ్‌లో పనిచేశారు.

షహీన్ నేతృత్వంలోనే 'మాడ్యుల్'

ఉగ్ర కుట్రలో అరెస్టయిన మహిళా వైద్యురాలు షహీన్ షాహిద్.. అల్ ఫలాహ్ యూనివర్సిటీ కేంద్రంగా నడిచిన తీవ్రవాద మాడ్యూల్‌కు నాయకత్వం వహించారని, ఈ గ్రూపులోని వైద్యుల మధ్య అంతర్గత విభేదాలను పరిష్కరించేందుకు ఆమె తరచుగా జోక్యం చేసుకొనే వారని దర్యాప్తు అధికారులు చెబుతున్నాయి.

ఉగ్ర కుట్ర బయటపడిపోవడంతో తప్పించుకునే ప్రయత్నం చేసిన ఆత్మాహుతి బాంబరు ఉమర్ నబీ ఈ క్రమంలో పలు మొబైళ్లను వాడాడు. కారు బాంబు పేలుడుకు ముందురోజు అతడు ఫరీదాబాద్‌లోనే ఉన్నట్టు తెలిపే సీసీ కెమెరా ఫుటేజీ తాజాగా పోలీసుల చేతికి అందింది.

ఫరీదాబాద్‌లో సీసీ కెమెరాకు చిక్కిన ఉమర్

ఫరీదాబాద్‌లోని ఓ షాపులో ఉమర్ నబీ ఫోన్ చార్జింగ్ పెట్టడం దానిలో కనిపించింది. ఆ సమయంలో అతడు ఒత్తిడిలో ఉన్నట్టు అనిపించాడు. ఢిల్లీలోకి ప్రవేశించడానికి ముందే తన ఫోన్లను అతడు మాయంచేయడంగానీ లేక నిర్వీర్యం చేయడంగానీ చేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కాగా, పుల్వామాలోని ఉమర్ ఇంటిని అధికారులు కూల్చివేశారు.

నన్ను తిట్టి... కొట్టి.. ఇంటి నుంచి గెంటేశారు

- సోదరుడు తేజస్వీపై లాలూ కుమార్తె రోహిణి ఆరోపణ
- రాజకీయాలతో పాటు కుటుంబంతో సంబంధాలు కూడా తెంచుకుంటున్నట్లు వెల్లడి



రోహిణి

పట్నా, నవంబరు 15: బిహార్ ఎన్నికల ఫలితాలు ఆర్జేడీ అధినేత లాలూ కుటుంబంలో చిచ్చు రేపాయి. లాలూ కుమార్తె రోహిణీ ఆచార్య రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. అంతేకాదు కుటుంబంతో సంబంధాలు కూడా తెంచుకుంటున్నట్లు ఆమె ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. సంజయ్ యాదవ్, రమీజ్ ఆదేశాల మేరకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. విమర్శలన్నింటికీ తాను బాధ్యత తీసుకుంటున్నట్లు తెలిపారు. హర్యానాకు చెందిన ఆర్జేడీ రాజ్యసభ ఎంపీ సంజయ్ యాదవ్.. తేజస్వీ యాదవ్‌కు అత్యంత సన్నిహితుడు ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయానికి బాధ్యత ఎవరిదని ప్రశ్నించినందుకు తేజస్వీ, సంజయ్ యాదవ్, రమీజ్ తనను తిట్టి, కొట్టడమే కాకుండా ఇంటి నుంచి గెంటేశారని రోహిణి ఆరోపించారు. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికలకు ముందు తన సోదరుడైన తేజ్‌ప్రతాప్ యాదవ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడాన్ని రోహిణి తప్పుబట్టారు. అయితే ఇటీవలి ఎన్నికల సమయంలో మాత్రం ఆమె తన మరో సోదరుడైన తేజస్వీ తరఫున ప్రచారం చేశారు. వృత్తిరీత్యా డాక్టర్ అయిన రోహిణి ఆచార్య లాలూ స్నేహితుడైన విజయ్‌సింగ్ కుమారుడు సమరేశ్‌సింగ్‌ను పెళ్లి చేసుకుని అమెరికాలో స్థిరపడ్డారు. లాలూకు కిడ్నీ ఇవ్వడం ద్వారా రోహిణి గతంలో వార్తల్లో నిలిచారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సరన్ నుంచి ఆర్జేడీ తరఫున పోటీ చేసి ఓటమిపాలయ్యారు.

కేంద్ర మాజీ మంత్రి ఆర్‌కే సింగ్‌పై బీజేపీ వేటు

పట్నా, నవంబరు 15: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత తిరుగుబాటు నేతలపై బీజేపీ దృష్టి సారించింది. ఎన్డీయే ప్రభుత్వంపై తరచూ విమర్శలు చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి రాజ్‌కుమార్(ఆర్‌కే) సింగ్‌ను పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఆయనకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం శనివారం సస్పెన్షన్ ఉత్తర్వులతో పాటు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆర్‌కే సింగ్‌తో పాటు ఎమ్మెల్సీ అశోక్‌కుమార్ అగర్వాల్, ఆయన భార్య కతిహార్ మేయర్ ఉషా అగర్వాల్‌ను కూడా బీజేపీ సస్పెండ్ చేసింది. వీరు తమ కుమారుడు సౌరభ్ అగర్వాల్‌ను వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) తరఫున కతిహార్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ నేత, మాజీ డిప్యూటీ సీఎం తార్‌కిషోర్ సింగ్‌పై పోటీకి నిలిపారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా పనిచేసిన ఆర్‌కే సింగ్ 2014లో బీజేపీలో చేరి ఆరా లోక్‌సభ స్థానం నుంచి వరుసగా రెండు సార్లు ఎన్నికయ్యారు. గత సంవత్సరం జరిగిన ఎన్నికల్లో ఓడిపోయారు. బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరిపై ఇటీవల వచ్చిన నేరారోపణలతో పాటు భగల్పూర్‌లో అదానీ గ్రూపుతో ప్రభుత్వం కుదుర్చుకున్న పవర్ ప్లాంట్ ఒప్పందంపై కూడా ఆర్‌కే సింగ్ బహిరంగ విమర్శలు చేసి పార్టీ అధిష్ఠానానికి ఆగ్రహం కలిగించారు.

'సర్' మార్చిన తలరాత?

174 నియోజకవర్గాల్లో తొలగించిన ఓట్ల కంటే గెలిచిన అభ్యర్థుల మెజారిటీ తక్కువే!

- 91 సీట్లలో ఓడిన సిట్టింగులు.. అందులో 75 మంది మహాగఠ్‌బంధన్ అభ్యర్థులే..
- 'సర్'పై విశ్లేషణతో 'ది క్వింట్' కథనం



న్యూఢిల్లీ, నవంబరు 15: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే అంచనాలకు మించి 202 సీట్లు సాధించింది. మహాగఠ్‌బంధన్ కూటమి దారుణంగా చతికిలపడింది. ఇటీవల బిహార్‌లో చేపట్టిన 'ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)' కూడా ఈ ఫలితాలకు కారణమని విశ్లేషిస్తూ 'ది క్వింట్' కథనం ప్రచురించింది. 'సర్'తో చాలా వరకు ఎన్డీయేకే ప్రయోజనం చేకూరిందని పేర్కొంది. ఈ కథనం మేరకు.. 174 నియోజకవర్గాల్లో 'సర్'తో తొలగించిన ఓట్ల కంటే అభ్యర్థులకు తక్కువ మెజారిటీ వచ్చింది. ఇందులోని 91 స్థానాల్లో సిట్టింగ్‌లు ఓటమి పాలయ్యారు. వీటిలో గతంలో మహాగఠ్‌బంధన్ గెలుచుకున్నవి 75కాగా, ఎన్డీయే గెలుచుకున్నవి 14 మాత్రమే. ఇతర చిన్న పార్టీలు గెలిచినవి 2 స్థానాలు. అదే ఈసారి మహాగఠ్‌బంధన్‌కు 15 మాత్రమే వస్తే, ఎన్డీయే 75 సీట్లు గెలుచుకుంది. ఇతరులకు ఒక్కసీటే దక్కింది. అంటే 'సర్'తో ఓట్లు తొలగించిన నియోజకవర్గాల్లో చాలా వరకు ఎన్డీయేనే చేజిక్కించుకుందని విశ్లేషకులు పేర్కొన్నారు. మరోవైపు బిహార్ ఎన్నికల్లో మహాగఠ్‌బంధన్‌కు ఓట్ల శాతం పెద్దగా ఏమీ తగ్గలేదని ఎన్నికల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్లలో ఎన్డీయే కూటమికి 41.4 శాతం, మహాగఠ్‌బంధన్‌కు 38.8 శాతం, ఇతరులకు 19.8శాతం ఓట్లు వచ్చాయి. ఈసారి ఎన్డీయే కూటమికి 46.9 శాతం (5.5శాతం ఎక్కువ), మహాగఠ్‌బంధన్‌కు 37.9 శాతం (0.9శాతం తక్కువ), జనసురాజ్ పార్టీకి 3.3శాతం (కొత్తగా ఏర్పాటైనది), ఇతరులకు 12.0శాతం ఓట్లు (7.9శాతం తక్కువ) ఓట్లు వచ్చాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి మహాగఠ్‌బంధన్‌కు తగ్గిన ఓట్లు ఒకశాతం లోపే. గతంలో చిన్న పార్టీలకు పోలైన ఓట్లు ఎన్డీయేకు పడ్డాయి. కాగా, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణతో బిహార్‌లో నకిలీ, తప్పుడు ఓట్లు తొలగించడం వల్లే ఎన్డీయే ఘన విజయం సాధించిందని కేరళ బీజేపీ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఇన్నాళ్లూ ఆర్జేడీ, కాంగ్రెస్ ఆ తప్పుడు ఓట్లతోనే విజయం సాధిస్తూ వచ్చాయని ఆరోపించారు. అందుకే 'సర్' ప్రక్రియను కాంగ్రెస్, వామపక్షాలు, ఆర్జేడీ, ఇతర ప్రాంతీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని వ్యాఖ్యానించారు.

ప్రజాసేవలో గెలుపోటములు తప్పవు: ఆర్జేడీ

పట్నా, నవంబరు 15: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై ఆర్జేడీ శనివారం తొలిసారిగా స్పందించింది. ఓటమికి నిరాశ చెందడం లేదని పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ కార్యాలయం ఎక్స్‌లో హిందీ భాషలో పోస్టు పెట్టింది. "ప్రజాసేవ విరామంలేని ప్రక్రియ, ముగింపులేని ప్రయాణం. ఎగుడుదిగుడులు తప్పవు. ఓడినప్పుడు నిరాశ చెందడం, గెలిచినప్పుడు గర్వపడడం ఉండదు. రాష్ట్రీయ జనతాదళ్ పేదల పార్టీ. వారి గొంతును వినిపిస్తునే ఉంటుంది" అని పేర్కొంది.

ఎస్ఐఆర్ పూర్తైన తర్వాత కూడా 3లక్షల మంది ఓటర్లను చేర్చాం

అందుకే బిహార్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 7.42కోట్ల నుంచి 7.45కోట్లకు పెరిగింది: ఈసీ

న్యూఢిల్లీ, నవంబరు 15: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) ముగిసి, తుది జాబితాను ప్రకటించిన తర్వాత.. మళ్లీ 3లక్షల మంది ఓటర్లను అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితాల్లో చేర్చామని ఎన్నికల సంఘం(ఈసీ) అధికారులు వెల్లడించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హులైన ఓటర్లను నామినేషన్ల గడువు ముగిసే తేదీకి 10రోజుల ముందు వరకు ఓటరు జాబితాలో చేర్చవచ్చని తెలిపారు. "బిహార్‌లో ఎస్ఐఆర్ పూర్తై తుది జాబితా ప్రకటించినప్పుడు 7.42కోట్ల మంది ఉన్న ఓటర్లు.. పోలింగ్ ముగిసే సమయానికి 7.45కోట్లకు ఎలా పెరిగారు" అంటూ కాంగ్రెస్ చేసిన సోషల్ మీడియా పోస్టుపై ఈసీ అధికారులు ఈ మేరకు వివరణ ఇచ్చారు. బిహార్‌లో సెప్టెంబరు 30న ఓటర్ల తుది జాబితా ప్రకటించారు. దీని ప్రకారం బిహార్‌లో 7.42కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. అయితే, రెండు దశల పోలింగ్ పూర్తైన తర్వాత చేసిన ప్రకటనలో మొత్తం ఓటర్ల సంఖ్యను ఈసీ 7.45కోట్లుగా ప్రకటించింది. బిహార్‌లో రెండు దశల్లో ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. మొదటి దశ పోలింగ్‌కు నామినేషన్ల తుది గడువు అక్టోబరు 17, రెండో దశ తుది గడువు అక్టోబరు 20. అంటే.. తుది ఓటరు జాబితా ప్రకటించిన 10 రోజుల్లోనే ఎన్నికల సంఘం మళ్లీ 3లక్షల మంది ఓటర్లను చేర్చిందన్న మాట.

3 తప్పులు.. ఓటమి తిప్పలు

ఆర్జేడీ, కాంగ్రెస్ చేసిన వ్యూహాత్మక పొరపాట్లతో మహాగఠ్ బంధన్ కూటమికి దెబ్బ

పట్నా, నవంబరు 15: బిహార్‌లో ఆర్జేడీ, కాంగ్రెస్ చేసిన మూడు ప్రధాన వ్యూహాత్మక తప్పిదాలు మహాగఠ్‌బంధన్ కూటమి ఓటమికి దారితీశాయనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. సామాజిక సమీకరణాలను అంచనా వేయడంలో విఫలం కావడం, ప్రచార తీరు సరిగా లేకపోవడం, గ్రామీణ ప్రాంతాల ఓటర్లను పట్టించుకోకపోవడం గట్టిగానే ప్రభావం చూపాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈసారి గెలిచి సీఎం కావడం ఖాయమనుకున్న తేజస్వి యాదవ్ ఆశలు ఆవిరయ్యాయని అంటున్నారు. నిపుణుల విశ్లేషణల మేరకు.. మహాగఠ్ బంధన్ కూటమి అభ్యర్థుల ఎంపిక, సామాజిక సమీకరణాల అంచనాల్లో విఫలమైంది. యాదవ వర్గానికి చెందిన వారికి పెద్ద సంఖ్యలో సీట్లు ఇవ్వడం.. ఓబీసీలు, ఈబీసీలు, దళితుల్లో ఆందోళన కలిగించింది. ప్రత్యామ్నాయంగా ఆ ఓట్లన్నీ ఎన్డీయే వైపు మళ్లాయి. ఎన్నికలకు ముందే తేజస్వియాదవ్‌ను కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడం కూడా ప్రభావం చూపింది. ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమి ప్రచారం మొదట్లో ఓటు చోరీ చుట్టూనే తిరిగింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)పై ఇరు పార్టీల శ్రేణులు తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేశాయి. కానీ క్షేత్రస్థాయిలో దీని ప్రభావం లేదని పార్టీ శ్రేణులు చెప్పినా అధినేతలు వినిపించుకోలేదు. చివరికి పోలింగ్ దగ్గరపడ్డాక ఒక్కసారిగా ఓటుచోరీని వదిలేసి, స్థానిక అంశాలు, సంక్షేమ హామీలు ఇచ్చారు. బిహార్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో ఆర్జేడీకి మంచి పట్టు ఉండేది. కానీ ఈసారి పట్టణ ప్రాంతాల ఓటర్లు, చదువుకున్న యువతను ఆకట్టుకునే దిశగానే హామీలు ఇవ్వడం, గ్రామీణ ప్రాంతాలపై దృష్టిపెట్టకపోవడం ప్రభావం చూపింది. పంటలకు కనీస మద్దతు ధరల పెంపుపై ఆశలు పెట్టుకున్న రైతులకు మహాగఠ్ బంధన్ నుంచి ఆ దిశగా హామీ రాలేదు.

బిహార్ అసెంబ్లీలో సగం మందికిపైగా నేరచరితులే

న్యూఢిల్లీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బిహార్ అసెంబ్లీకి ఎన్నికైన 243 మంది కొత్త ఎమ్మెల్యేలలో 130 మంది (53%)కి నేర చరిత్ర ఉంది. వీరిలో 102 మందిపై తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి. కొత్త ఎమ్మెల్యేలలో కేవలం 29 మంది మహిళలే (12%) ఉన్నారు. గత అసెంబ్లీలో 26 మంది మహిళా ఎమ్మెల్యేలుండగా ఈసారి ముగ్గురు ఎమ్మెల్యేలు పెరిగారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికైన ఎమ్మెల్యేలు ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్లను పరిశీలించిన ఏడీఆర్ రూపొందించిన నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. శనివారం ఏడీఆర్ విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం.. 2020 అసెంబ్లీకి ఎన్నికైన వారిలో 163 మంది (68శాతం)పై క్రిమినల్ కేసులు ఉండగా.. ఈసారి 130 మందిపై క్రిమినల్ కేసులున్నాయని తెలిపింది. పార్టీల వారీగా చూస్తే అత్యధికంగా బీజేపీ ఎమ్మెల్యేలలో 54 మందిపై క్రిమినల్ కేసులు ఉండగా.. జేడీయూలో 31, ఆర్‌జేడీలో 18, ఎల్‌జేపీ రామ్‌విలాస్‌లో 11, కాంగ్రెస్‌లో 4, ఎంఐఎంలో ఐదుగురు ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులున్నాయి. ఎమ్మెల్యేలలో ఆరుగురిపై హత్య కేసులు, 19 మందిపై హత్యాయత్నం కేసులు, 9 మందిపై మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులున్నట్లు ఏడీఆర్ పేర్కొంది.

మళ్లీ చెబుతున్నాం... మీ వాదనలతో విభేదిస్తున్నాం

- అన్నారం బ్యారేజీలో లోపాలకు కారణం మేం కాదు
- సర్కారు డిజైన్ల మేరకే నిర్మించాం
- అయినప్పటికీ పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నాం
- వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయండి
- ప్రభుత్వానికి నిర్మాణ సంస్థ అఫ్కాన్స్ లేఖ

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'అన్నారం బ్యారేజీలో సమస్యలకు మేం కారణం కాదు. ప్రభుత్వం అందించిన డిజైన్ల ప్రకారమే నిర్మించాం. మళ్లీ మళ్లీ చెబుతున్నాం... జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ అధ్యయనంపై గత జూన్ 27న రాసిన లేఖలో మా అభిప్రాయం చెప్పాం.. అయినప్పటికీ మళ్లీ సమగ్రంగా లేఖ రాస్తాం' అని నిర్మాణ సంస్థ అఫ్కాన్స్ సర్కారుకు శనివారం స్పష్టంచేసింది. బ్యారేజీ నిర్మాణ లోపాలను తెలుపుతూ మరమ్మతులు చేయాల్సిన బాధ్యతను వివరిస్తూ ఈనెల 10వ తేదీన నీటిపారుదల శాఖ రాసిన లేఖలోని అంశాలతో పూర్తిగా విభేదిస్తున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది.

నీటిపారుదలశాఖ వాదన ఇదీ..

2019 వరదలకు బ్యారేజీ దిగువ భాగంలో సీసీ బ్లాకులు చెల్లాచెదురయ్యాయని, 2020 వరదలకు వేరింగ్ కోట్ ధ్వంసమైందని నీటిపారుదల శాఖ పేర్కొంది. 2020 ఏప్రిల్‌లో గేట్ నం.35,44., 2021 జనవరిలో గేట్‌నం.38,28., 2024లో గేట్‌నం.35ల కిందినుంచి సీపేజీలు బయటపడ్డాయని తెలిపింది. ఇవన్నీ డిఫెక్ట్ లయబిలిటీ కాలంలోనే (బ్యారేజీ నిర్మాణం పూర్తయిన నాటినుంచి రెండేళ్లలోపు ఏ సమస్య వచ్చినా పరిష్కరించే బాధ్యత నిర్మాణ సంస్థది) వచ్చినందున డీఎల్‌ఎఫ్ డీమ్డ్ ఎక్స్‌టెండెడ్‌గా(దానికదే పొడిగించినట్లు) పరిగణనలోకి తీసుకొని అన్నారం బ్యారేజీకి మరమ్మతులు చేయాలని నిర్మాణ సంస్థ అఫ్కాన్స్‌కు గుర్తుచేస్తూ రామగుండం సర్కిల్ ఎస్‌ఈ ఈనెల 10వ తేదీన లేఖ రాసిన విషయం విదితమే.

సర్కారు ఆరోపణలను తిరస్కరించిన అఫ్కాన్స్

ప్రభుత్వ అధికారులు లేవనెత్తిన వాదనలతో విభేదిస్తున్నామని అఫ్కాన్స్-విజేత-పీఈఎస్ జాయింట్ వెంచర్ ప్రతినిధి, అన్నారం ప్రాజెక్టు ఇన్‌ఛార్జి కె.ఎస్.మల్లికార్జునరావు పేర్కొన్నారు. ఈమేరకు శనివారం ఆయన రామగుండం ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్(ఎస్‌ఈ)కు లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీ నిర్మాణం పూర్తయినట్లు 2019 డిసెంబరు 20న కాళేశ్వరం ప్రాజెక్టు డివిజన్-2 ఇరిగేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) సర్టిఫికెట్ జారీ చేశారని, 2021 డిసెంబరులోనే డిఫెక్ట్ లయబిలిటీ కాలం పూర్తయిందని లేఖలో పేర్కొన్నారు. దీంతో బ్యారేజీలో తమ బాధ్యతలు పూర్తయ్యాయని, కొత్తగా ప్రభుత్వం ప్రతిపాదించే పనులన్నీ అదనపు పనులుగానే పరిగణనలోకి తీసుకుంటామని, కాంట్రాక్ట్ ఒప్పందంలోని నిబంధనలకు లోబడి వీటిని చేస్తామన్నారు. ఇప్పటిదాకా తమ మధ్య 81 ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయన్నారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై జూన్ 27న లేఖనం.3153లో వివరణ ఇచ్చామన్నారు. అన్నారం పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నామని, బ్యారేజీని కాపాడుకునే చర్యలకు తమ మద్దతు ఉంటుందన్నారు. బ్యారేజీలో కేంద్ర నీటి,విద్యుత్ పరిశోధన కేంద్రం(సీడబ్ల్యూపీఆర్‌ఎస్-పుణె) చేసే అన్ని పరీక్షలకు యంత్రాలు, సిబ్బందిని సమకూర్చాలని రాసిన లేఖపై గత అక్టోబరు 17న ప్రత్యుత్తరమిచ్చినట్లు పేర్కొన్నారు. మే 19వ తేదీ నాటి సమావేశంలో అంగీకరించిన విధంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.176.49 కోట్లను సత్వరం చెల్లించాలని కోరారు

ఏకలవ్య మోడల్ స్కూళ్లను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ



గుండాల/ములకలపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రికొత్తగూడెం జిల్లా గుండాల మండలం ముత్తాపురం, ములకలపల్లి మండలం మూకమామిడి గ్రామాల్లో నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లను గుజరాత్ రాష్ట్రంలోని డెడియాపడ నుంచి ప్రధాని మోదీ శనివారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏకలవ్య పాఠశాలల ఓఎస్డీ ఎస్. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ నితిన్ మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థుల భవిష్యత్ కోసం ఏకలవ్య మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నత లక్ష్యాలతో ముందుకు అడుగులు వేయాలని సూచించారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం: సీతక్క

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోటి మంది మహిళలను స్వయం సహాయక సంఘాల్లో చేర్చి.. వారందరినీ కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు పని చేస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. శనివారం ప్రజా భవన్‌లో జరిగిన స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) మండల సమాఖ్య అధ్యక్షుల రాష్ట్ర స్థాయి సదస్సులో సీతక్క మాట్లాడారు. ఏటా మహిళా సంఘాలకు రూ.20 వేల కోట్లకు తగ్గకుండా బ్యాంకింగ్ రుణాలు ఇప్పిస్తున్నామని తెలిపారు. బడా బాబులు లోన్లు ఎగవేస్తుంటే.. మహిళా సంఘాలు 99 శాతం రుణాలను చెల్లిస్తున్నాయిని ప్రశంసించారు. రూ.వేల కోట్లు కొల్లగొట్టే ఎంతో మంది బడా బాబుల కన్నా.. తెలంగాణ ఆడ బిడ్డలు ఎంతో మేలని వ్యాఖ్యానించారు. మహిళా సమాఖ్య సభ్యులకు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎస్‌హెచ్‌జీలతోనే యూనిఫాంలను కుట్టించి ఇస్తామని ప్రకటించారు. నవంబరు 19న మహిళా శక్తి బలోపేతానికి పెద్దఎత్తున కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి బజార్ తరహాలో హైదరాబాద్‌లో మరిన్ని బజార్లు ఏర్పాటు చేస్తామని సీతక్క వెల్లడించారు.

గురుకులాల భోజన మెనూలో చేపలు

- మంత్రులు పొన్నం, వాకిటి శ్రీహరి

హుస్నాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గురుకుల పాఠశాలల భోజన మెనూలో మటన్, చికెన్‌లాగా చేపలను కూడా చేరుస్తామని మత్స్య, పశుసంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆరోగ్యానికి చేపలు ఎంతో మేలు చేస్తాయని, చేపల పౌడర్‌ను కూడా తయారు చేసి విద్యార్థులకు అందిస్తామన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువులో ఉచిత చేప పిల్లలను వేసిన అనంతరం ఓ సమావేశంలో మాట్లాడారు. గతంలో చేప పిల్లల పెంపకంలో అవకతవకలు జరిగాయన్నారు. ఈసారి పారదర్శకత కోసం చెరువుల వద్ద పూర్తి వివరాలతో సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని వాకిటి శ్రీహరి వెల్లడించారు.

ఢిల్లీని ఆకట్టుకున్న తెలంగాణ హస్తకళలు

న్యూఢిల్లీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ప్రగతి మైదానంలో జరుగుతున్న ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ (ఐఐటీఎఫ్)లో తెలంగాణ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శుక్రవారం రెసిడెంట్ కమిషనర్ శశాంక్ గోయెల్ తెలంగాణ పెవిలియన్‌ను ప్రారంభించారు. రాష్ట్ర పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక శాఖ ఆధ్వర్యంలో నల్గొండ, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, జోగులాంబ గద్వాల, రంగారెడ్డి, జనగామ, వరంగల్ అర్బన్, నారాయణపేట జిల్లాలకు చెందిన స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. చేనేత వస్త్రాలు, గిరిజన ఆభరణాలు, చేతితో తయారు చేసిన గాజులు, హెర్బల్, మెడికల్ ఉత్పత్తులు, పోచంపల్లి వస్త్రాలు, ఫ్యూజన్ బ్యాగ్స్‌ను ప్రదర్శించారు. ఇక్కత్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, వాస్‌కోట్స్, దుప్పట్టా, కాటన్ బెడ్‌షీడ్స్, షర్టింగ్ ఫ్యాబ్రిక్స్ తదితర వైరైటీలను అందుబాటులో ఉంచారు. పోచంపల్లికి చెందిన స్పెషల్ ఇక్కత్ చేనేత వస్త్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రేషన్ కార్డు ఉంటేనే.. ఆదాయ ధ్రువీకరణ పత్రం

- ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల్లో అనర్హులను అడ్డుకోవాలని సర్కార్ నిర్ణయం
- అమల్లోకి వచ్చిన కొత్త విధానం



హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు పొందాలన్నా.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేయాలన్నా.. ఆదాయ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. సంక్షేమ పథకాలు, ఫీజు రీయింబర్స్‌మెంటును భారీగా అనర్హులు పొందుతున్నారంటూ వస్తున్న ఆరోపణల నేపథ్యంలో.. రాష్ట్ర సర్కార్ చర్యలకు ఉపక్రమించింది. అనర్హులకు అడ్డుకట్ట వేసేందుకు కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చింది. ఆదాయ ధ్రువీకరణ పత్రం దరఖాస్తుకు రేషన్ కార్డును అనుసంధానించింది. దీంతో రేషన్ కార్డు ఉంటేనే ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఆదాయ ధ్రువీకరణ పత్రం కావాలంటే మీసేవ కేంద్రాల్లో రెండు విధానాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. రేషన్ కార్డుతో ఆధార్ అనుసంధానం ఉన్నందున.. ఆధార్ నెంబరు నమోదు చేసి దరఖాస్తు చేసుకోవడం ఒక విధానం. రేషన్ కార్డు ఉంటే దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబంగా ప్రభుత్వం గుర్తిస్తుంది కాబట్టి.. ఈ విధానంలో దరఖాస్తు చేసిన తర్వాత ఎలాంటి విచారణ లేకుండానే రెవెన్యూ అధికారులు ఆదాయ ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు. రేషన్ కార్డులు లేనివారు సైతం దరఖాస్తు చేసే అవకాశం కూడా ఉండేది. ఈ విధానంలో ఆదాయ ధ్రువీకరణ పత్రం జారీ చేయాలంటే రెవెన్యూ అధికారుల క్షేత్రస్థాయి విచారణ తప్పనిసరి. అయితే ఇలాంటి దరఖాస్తులు పెద్దఎత్తున వస్తుండటంతో ఎలాంటి విచారణ లేకుండానే ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా రేషన్ కార్డు లేని దరఖాస్తుదారుల నుంచి తహసీల్దార్ కార్యాలయాల్లో రూ.2 వేల నుంచి 3 వేల వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఉపకారవేతనాలు, సంక్షేమ పథకాల్లో అనర్హులు ఇక్కడి నుంచే పుట్టుకొస్తున్నారని అధికారవర్గాలు ఇప్పటికే గుర్తించాయి. ఈ నేపథ్యంలో అనర్హులను అడ్డుకోవడానికి కొత్త విధానాన్ని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (మీసేవ) విభాగం మూడు రోజుల నుంచి అమల్లోకి తెచ్చింది. ఈ ప్రక్రియతో రేషన్ కార్డు లేనివారు ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేస్తే 'మిస్సింగ్ ఫుడ్ సెక్యూరిటీ కార్డు' అని సందేశం వస్తుంది. ఈ విధానంతో అనర్హులకు అడ్డుకట్ట పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. కొత్తగా రేషన్ కార్డు పొందిన తర్వాతే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.

కాంగ్రెస్ మేధో బృందంలో రేవంత్!

చోటు కల్పించే యోచనలో అధిష్ఠానం!

- దేశవ్యాప్తంగా పార్టీ బలోపేతానికి చర్యలపై.. తెలంగాణ సీఎంతో చర్చించిన ఢిల్లీ నేతలు
- తెలంగాణను బీజేపీ వశం కాకుండా రేవంత్ చూసుకోగలరన్న ధీమా



న్యూఢిల్లీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద పరపతి అమాంతం పెరిగిపోయింది. ఓవైపు బిహార్‌లో తాము ఎంత ఉధృతంగా ప్రచారం చేసినా.. కేవలం ఆరు సీట్లకే పరిమితం కావడం, అదే సమయంలో తెలంగాణలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిని రేవంత్ గెలిపించుకోవడంతో ఆయన పట్ల హైకమాండ్‌కు విశ్వాసం మరింత పెరిగినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ మేధో బృందంలో రేవంత్‌కు చోటు కల్పించే యోచనలో అధిష్ఠానం ఉన్నట్లు సమాచారం. బిహార్‌లో పరాజయం, వచ్చే ఏడాది ఏప్రిల్‌లో పశ్చిమబెంగాల్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనుండడంతో నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీని ఎలా ఎదుర్కోవాలన్న ఆందోళన కాంగ్రెస్ నేతల్లో తీవ్రతరమవుతోంది. అంతేకాకుండా.. ఇప్పటికే అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటకలను కూడా వశం చేసుకునేందుకు కమలం పార్టీ పథకం సిద్ధం చేసి ఉంటుందన్న భయం వారిలో నెలకొంది. నిజానికి బిహార్‌లో ఆర్జేడీ, కాంగ్రెస్‌లతో కూడిన మహా గట్‌బంధన్ విజయం సాధిస్తే కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి తెలంగాణ, కర్ణాటకలపై పడేది. కానీ, బిహార్ ఓటమితో హైకమాండ్ డీలా పడింది. మరోవైపు జూబ్లీహిల్స్‌లో బీఆర్‌ఎస్‌ను సిటింగ్ స్థానంలో.. ఎమ్మెల్యే మరణం తర్వాత సానుభూతి పవనాలను కూడా అధిగమించి కాంగ్రెస్ విజయం సాధించింది.

రేవంత్‌కు ఇక పూర్తి స్వేచ్ఛ..!

రాష్ట్రంలో కాంగ్రెస్ శ్రేణులందరినీ ఏకం చేసి, చివరి పది రోజుల్లో తగిన వ్యూహరచన, సంఘటిత కార్యాచరణతో జూబ్లీహిల్స్‌లో పార్టీని గెలిపించడంతో సీఎం రేవంత్‌కు భవిష్యత్తు ఎన్నికలపై పూర్తి స్వేచ్ఛనిచ్చే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి. డీసీసీ అధ్యక్షుల నియామకం నుంచి స్థానిక ఎన్నికల్లో గెలుపు వరకు రేవంత్ అవసరమైన నాయకత్వం అందించగలరని వారు భావిస్తున్నారు. "రేవంత్.. జూబ్లీహిల్స్‌లో మాదిరి పార్టీ నాయకులందరినీ ఏకతాటిన నడపండి. ఎట్టిపరిస్థితుల్లోనూ బీజేపీ బలోపేతమయ్యేందుకు అవకాశం ఇవ్వకండి" అని శుక్రవారం ఢిల్లీలోని సీనియర్ నేత ఒకరు రేవంత్‌కు చెప్పినట్లు సమాచారం. బిహార్‌లో పార్టీ రాజకీయాలతో సంబంధంలేని కృష్ణ అల్లవారు అనే వ్యక్తికి అభ్యర్థుల ఎంపిక నుంచి పొత్తు వరకు బాధ్యతలు అప్పజెప్పడంతో జరిగిన నష్టాన్ని రాహుల్‌గాంధీ గుర్తించారని తెలుస్తోంది. ఢిల్లీలో పార్టీ వ్యవహారాలు చూస్తున్న కొందరు నేతలు.. కిందిస్థాయి కార్యకర్తలు, నేతలతో సంబంధాలు పెట్టుకోకపోవడం, ముఖ్యమంత్రిని కూడా వేచి చూసేలా చేయడం, మీడియాతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకోకపోవడంపై కూడా ఫిర్యాదులందాయి. దీంతో ఢిల్లీలో అలాంటివారిని తప్పించి, అన్ని వర్గాలతో సంబంధాలు నెరిపేవారు, బూత్ స్థాయి నుంచి ప్రణాళికలు రూపొందించేవారిని నియమించాలన్న చర్చ జరుగుతోంది.

అమిత్ షా లాంటి నేత లేనందునే..

బిహార్‌లో ఓవైపు మోదీ-నితీశ్ ప్రచారం ఉవ్వెత్తున సాగుతుండగా, మరోవైపు అమిత్ షా 19 రోజులపాటు అక్కడి నుంచి కదలకుండా అనుక్షణం పరిస్థితులను సమీక్షించారు. ఎన్డీఏలోని తిరుగుబాటు అభ్యర్థులను శాంతింపజేయడంతోపాటు మహా గట్‌బంధన్ అభ్యర్థుల ఓట్లను చీల్చే వ్యూహాలు రచించారు. ఎస్ఐఆర్, ఓట్ల చోరీ వంటి కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టారు. హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల్లో అవలంబించిన వ్యూహాన్నే బిహార్‌లో ప్రయోగించి అమిత్‌షా బీజేపీలో తిరుగులేని వ్యూహకర్తగా నిరూపించుకున్నారు. కాంగ్రెస్‌లో అలాంటివారు లేకపోవడం, ఉన్నవారు కూడా కలిసికట్టుగా పనిచేయకపోవడం, కృష్ణ అల్లవారు లాంటి బయటి నుంచి వచ్చినవారు పెత్తనం చెలాయించడం, రాహుల్‌కు తప్ప ఎవరికీ అందనంత ఎత్తులో కేసీ వేణుగోపాల్ ఉండడం వల్ల కాంగ్రెస్ తరఫున వ్యూహకర్తలు లేకపోయారు. ఈ పరిస్థితుల్లో రేవంత్‌రెడ్డి చేసిన టీమ్ వర్క్, జూబ్లీహిల్స్ లాంటి ఉప ఎన్నికలో కూడా రాత్రింబవళ్లు పనిచేయడంపై అధిష్ఠానంలో చర్చ జరుగుతోంది. కర్ణాటకలో సిద్దరామయ్య, శివకుమార్ మధ్య చిచ్చు.. పార్టీలో తలనొప్పి తెచ్చిపెడుతుండగా, తెలంగాణలో రేవంత్.. ఉత్తమ్, భట్టి, మహేశ్‌గౌడ్ తదితర నేతలందర్నీ కలుపుకొనిపోయి పనిచేయడం ఢిల్లీ పెద్దలకు ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో బీజేపీ తెలంగాణలో బలోపేతం కాకుండా చూసుకోవడంతోపాటు దేశవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఢిల్లీ నేతలు రేవంత్ తో ఇప్పటికే చర్చించారని సీనియర్ నేత ఒకరు తెలిపారు. ఆయనను తమ థింక్ ట్యాంక్‌లో భాగం చేస్తారని అన్నారు.

ఎక్కడ ఉత్పత్తి చేసినా నచ్చిన చోట వాడుకోవచ్చు!

- సోలార్ రూఫ్‌టాప్‌పై ఈఆర్‌సీ రెగ్యులేషన్స్ విడుదల
- వినియోగదారులు ఓపెన్ యాక్సెస్‌లోనూ కరెంట్ కొనొచ్చు
- టీవోడీ రాయితీని ఎత్తివేస్తూ ఈఆర్‌సీ ఉత్తర్వులు

హైదరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో సొంతిళ్లు ఉంటే సోలార్ రూఫ్‌టాప్ యూనిట్ పెట్టుకొని, అక్కడ ఉత్పత్తి అయ్యే కరెంట్‌ను హైదరాబాద్‌లోని ఫ్లాట్‌లలో వాడుకోవడానికి వెసులుబాటును కల్పిస్తూ తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్‌సీ) రూఫ్‌టాప్ సోలార్ పీవీ గ్రిడ్ ఇంటరాక్టివ్ సిస్టమ్స్ రెగ్యులేషన్స్-2025ను తీసుకొచ్చింది. శనివారం నుంచి ఈ నిబంధనలు అమల్లోకి తెస్తూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈఆర్‌సీ ఈ రెగ్యులేషన్స్‌ను సిద్ధం చేసింది. నెట్ మీటరింగ్, గ్రూప్ నెట్ మీటరింగ్, గ్రాస్ మీటరింగ్, వర్చువల్ నెట్ మీటరింగ్ అనే 4అంశాల ఆధారంగా ఈ రెగ్యులేషన్స్ సిద్ధం చేశారు. తాజా నిబంధనల ప్రకారం నెట్‌మీటరింగ్ విధానంలో 10కిలోవాట్ల దాకా రూఫ్‌టాప్ సోలార్‌కు మీటరింగ్ పెట్టడానికి సాధ్యాసాధ్యాల నివేదిక అక్కర్లేకుండా డిస్కమ్ వినియోగదారుడికి మీటర్ బిగించాలి. గ్రూప్ మీటరింగ్‌లో అయితే జిల్లాల్లో రూఫ్‌టాప్ సోలార్ పెట్టుకుంటే అక్కడ ఉత్పత్తి చేసే విద్యుత్‌ను హైదరాబాద్‌లో వినియోగించుకునే అవకాశం ఉంటుంది. విద్యుత్ ఏమైనా మిగిలితే సంబంధిత డిస్కమ్‌కు అమ్ముకునే అవకాశం ఉంటుంది. దీని ధరను కూడా ఈఆర్‌సీ ఖరారు చేయనుంది. అయితే గ్రూప్ మీటరింగ్‌లో ఈ వెసులుబాటు పొందాలంటే జిల్లాల్లో రూఫ్‌టాప్ సోలార్ ఎవరి పేరుతో ఉందో హైదరాబాద్‌లోని కనెక్షన్లు కూడా వారి పేరుతోనే ఉండాల్సి ఉంటుంది.

100 కిలోవాట్ల దాకా విద్యుత్ మార్పిడికి అవకాశం

గ్రూప్ మీటరింగ్‌లో 100 కిలోవాట్ల దాకా విద్యుత్‌ను మార్పిడి చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ వెసులుబాటు డిస్కమ్ లోపలే ఉంటుంది. ఇక వర్చువల్ మీటరింగ్‌లో మరింత వెసులుబాటు ఇచ్చారు. గ్రామంలో ఎవరైనా సోలార్ ప్లాంట్లు పెట్టుకొని విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంటే, వారి నుంచి హైదరాబాద్‌లో ఉండే వినియోగదారుడు నేరుగా ఒప్పందం చేసుకోవచ్చు. ఈ వెసులుబాటు ప్రకారం 100 కిలోవాట్ల దాకా విద్యుత్‌ను మార్పిడి చేసుకోవచ్చు. సోలార్ రూఫ్‌టాప్ కలిగిన వినియోగదారులు తాము డిస్కమ్‌ల నుంచి ఏమేరకు కాంట్రాక్ట్ లోడ్ కలిగి ఉన్నామో ఆ లోడ్‌కు లోబడి ఓపెన్ యాక్సెస్‌లో కరెంట్ కొనుగోలు చేయడానికి ఈ రెగ్యులేషన్స్‌లో వీలు కల్పించారు. డిమాండ్ లేని సమయంలో విద్యుత్ వినియోగించేవారికి ఇప్పటిదాకా ఇస్తున్న రాయితీని ఎత్తివేయడానికి అనుమతినిస్తూ ఈఆర్‌సీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈఆర్‌సీ ఛైర్మన్ డాక్టర్ జస్టిస్ దేవరాజు నాగార్జున్, సభ్యులు కంచర్ల రఘు, చెరుకూరి శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు.

దేశ 'ఏరో ఇంజన్ రాజధాని'గా తెలంగాణ

- 'ఏరో స్పేస్, డిఫెన్స్ ఎకోసిస్టమ్' అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక
- 2023-24లో రాష్ట్ర ఏరోస్పేస్ ఎగుమతుల విలువ 15,900 కోట్లు
- 2024-25లో మొదటి 9 నెలల్లోనే రూ.30,742 కోట్ల ఎగుమతులు
- ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాబోయే ఐదేళ్లలో 2030 నాటికి తెలంగాణను దేశ 'ఏరో ఇంజన్ రాజధాని'గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. దిగ్గజ పరిశ్రమలు, ప్రముఖ విద్యాసంస్థల భాగస్వామ్యంతో రాష్ట్రంలో 'ఏరోస్పేస్, డిఫెన్స్ ఎకోసిస్టమ్' అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వేసిన పునాదులే ప్రస్తుతం తెలంగాణను దేశ వ్యూహాత్మక డిఫెన్స్ హబ్‌గా మార్చాయన్నారు. శనివారం ఇండియన్ బిజినెస్ స్కూల్ (ఐఎస్‌బీ)లో ఆ సంస్థతో పాటు డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కాలేజీ, ముంజాల్ గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 'విమానయాన, అంతరిక్ష, రక్షణ రంగ ఉత్పత్తుల తయారీలో ఆత్మనిర్భర భారత్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ రంగంలో వేగవంతమైన వృద్ధిని అనుకూలంగా మార్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత ఏడాది దేశ రక్షణ రంగ ఉత్పత్తుల విలువ రికార్డు స్థాయిలో రూ.1.5 లక్షల కోట్ల మార్కును దాటిందన్నారు. ఎగుమతుల్లో 12 శాతం వృద్ధి రేటు నమోదైందని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో ఈ రంగానికి చెందిన 25కు పైగా అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థలు, 1,500కు పైగా ఎంఎస్ఎంఈలు తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ఏరోస్పేస్ ఎగుమతుల విలువ 2023-24లో రూ.15,900 కోట్లు కాగా 2024-25లో మొదటి 9 నెలల్లోనే రూ.30,742 కోట్లకు పెరగడం రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని తెలిపారు. ఆదిభట్లలో రూ.425 కోట్ల పెట్టుబడితో 'టాటా-సాఫ్రాన్' ఏర్పాటైందన్నారు. త్వరలో రూ.800 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ డిఫెన్స్ యూఏవీ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్, రూ.500 కోట్లతో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ డిఫెన్స్ యూనిట్ కూడా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో యువతకు విమానయాన, రక్షణ రంగాలకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించే పలు కోర్సులు ఉన్నాయన్నారు. హీరో ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ కాంత్ ముంజాల్, ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ పీ మదన్, ప్రొఫెసర్ చందన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ సోదాలు.. అయినా మారని అధికారులు

- మంత్రి హెచ్చరించినా బేఖాతరు
- రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల్లో తరచూ ఏసీబీ దాడులు
- పలు చోట్ల సిబ్బందిపై అవినీతి ఆరోపణలు

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): "రిజిస్ట్రేషన్ శాఖలో జరుగుతున్న అవినీతిని చూస్తే సిగ్గేస్తుంది. ఎన్నిసార్లు చెప్పినా మీరు మారడం లేదు. సస్పెండ్ చేస్తే మళ్లీ నాలుగు నెలల్లో ఉద్యోగంలో చేరొచ్చని అనుకుంటున్నారేమో.. మీ ఆటలు సాగనివ్వను, తిన్నదంతా కక్కిస్తా. ఇంకా కొన్ని రోజులు చూస్తా.. ఇలాగే కొనసాగితే నేనే ఏసీబీకి పట్టించి.. మీ సంగతి చూస్తా. మళ్లీ ఉద్యోగంలోకి రాకుండా బయట నిలబెడతా" అంటూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జనవరి 2న హెచ్చరించారు. డిపార్ట్‌మెంట్ గురించి మాట్లాడాలంటేనే సిగ్గేస్తుందని, అధికారులు ఇకనైనా మారి ప్రజలకు మేలు చేసేలా పని చేయాలని హితబోధ చేశారు. అయినా వారిపై అవినీతి ఆరోపణలు ఆగడం లేదు. రెండేళ్లలో మూడు పర్యాయాలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ దాడులు చేయడం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం రాష్ట్రంలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు దాడులు చేశారు. డాక్యుమెంట్ రైటర్లు, కార్యాలయాల్లో పనిచేసే కిందిస్థాయి సిబ్బందిని విచారించి, రిజిస్ట్రేషన్‌కు వచ్చిన డాక్యుమెంట్లను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ విభాగం మీద తరచూ ఏసీబీ దాడులు జరగడంతో అప్రతిష్ఠ పాలవుతున్నామంటూ ఉన్నతాధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు సిబ్బందితో వసూళ్లు

నిబంధనలను కూడా పక్కన పెట్టి, సమర్థులనే పేరుతో ఒక జోన్ నుంచి మరో జోన్‌కు పలువురు అధికారులను బదిలీ చేసినా కీలకమైన పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి ఆరోపణలు ఆగడం లేదు. ఆ శాఖ అధికారులు ప్రైవేటు సిబ్బందిని నియమించుకుని మరీ వారి ద్వారా అవినీతికి పాల్పడటం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం ఏసీబీ జరిపిన సోదాల్లోనూ నల్గొండ జిల్లా మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ వసూళ్ల కోసం ఓ మహిళను నియమించుకుని ఆమెకు రోజుకు రూ.500 చెల్లిస్తున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. అత్యంత రద్దీగా ఉండే నార్సింగి(గండిపేట), వట్టినాగులపల్లి, శేరిలింగంపల్లి, నిజామాబాద్ అర్బన్, జయశంకర్ భూపాలపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సోదాలు జరిగాయి. గండిపేటలో అర్ధరాత్రి వరకు తనిఖీలు జరగడం చర్చనీయాంశంగా మారింది. అనధికారిక వసూళ్లకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు ఉండటంతో డాక్యుమెంట్ రైటర్లను ఏసీబీ అధికారులు విచారించారు. వారి ద్వారా రిజిస్ట్రేషన్ జరిగిన పలు దస్తావేజులను స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్లు నియమించుకున్న ప్రైవేటు వ్యక్తుల వివరాలను సేకరించారు. ఏ తరహా వసూళ్లకు వారిని వినియోగిస్తున్నారనే దానిపై ఏసీబీ అధికారులు ఆరా తీశారు.

పాత వాసనలు వదులుకోలేని ఉద్యోగులు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారదర్శకంగా బదిలీలు చేయాలని నిర్ణయించి ఒకే దఫాలో రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్లను బదిలీలు చేసింది. పాత వాసనలు వదులుకుని అవినీతికి తావు లేకుండా పని చేస్తారని ప్రభుత్వం భావించినా.. చాలా చోట్ల అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది ఉద్యోగులు బదిలీ అయి కొత్త స్థానాలకు వచ్చినా అనధికార వసూళ్లు ఆపకపోవడం చర్చనీయాంశం అయింది. ఇదే విషయంపై జిల్లాల వారీగా తరచూ ఆ శాఖ మంత్రి విజిలెన్స్ నివేదికలు తెప్పించుకుని అధికారులను మందలిస్తున్నా మార్పురావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గర్భనిరోధక మాత్రల అమ్మకాల జోరు

(మొదటిపేజీ తరువాయి)

లెక్కలు చెబుతున్నాయి. 2019లో మనదేశంలో వీటి అమ్మకాలు సుమారు 33.5 మిలియన్ యూనిట్లు ఉండేది. ప్రస్తుతం వీటి అమ్మకాల విలువ 264 మిలియన్ అమెరికన్ డాలర్లు (రూ.23,414,023,776) ఉంది. ఇది 2030 నాటికి 377 మిలియన్ డాలర్ల (రూ.33,435,935,468) కు చేరుతుందని అంచనా. ఈ గణాంకాలను బట్టి మహిళలు కుటుంబ నియంత్రణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. 2009 నుంచి 2014 మధ్యకాలంలో ఈ మార్కెట్ 88% వృద్ధి నమోదు చేసింది. తర్వాతి దశాబ్దకాలంలో సగటున 12% చొప్పున వృద్ధి చెందుతోందని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.

సులభంగా లభ్యం...

లెవోనార్జెస్ట్రెల్ 1.5 ఎం.జీ వంటి నిర్దిష్టమైన గర్భనిరోధక మాత్రలు ఎటువంటి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ అవసరం లేకుండా మెడికల్ షాపుల్లో నేరుగా అమ్ముతున్నారు. వీటి అమ్మకాలు పెరగటానికి ఇదే కారణమని చెబుతున్నారు. 2019- 2021 మధ్య కాలానికి సంబంధించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-5) ప్రకారం.. అత్యవసర గర్భనిరోధక మాత్రలను తీసుకునే మహిళల్లో 57% మంది వాటిని మెడికల్ షాపుల నుంచి నేరుగా కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. మిగిలినవారు ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ క్లినిక్‌ల ద్వారా వాటిని పొందారు. ఈ అమ్మకాల వృద్ధి కారణంగా అన్ని రకాల గర్భనిరోధక పద్ధతుల రేటు కూడా పెరిగింది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో 54 శాతం ఉన్న గర్భనిరోధక పద్ధతుల వినియోగ రేటు, 2019-21 నాటికి 67 శాతానికి పెరిగినట్లు తేలింది. సులభంగా లభించటంతో టీనేజర్లు అవాంఛిత గర్భాన్ని నిరోధించేందుకు వీటిని ఎంచుకుంటున్నారని 2021లో నేషనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ ఇన్ఫర్మేషన్ (ఎన్‌సీబీఐ) అధ్యయనంలో వెల్లడైంది. మనదేశంలో అవాంఛిత గర్భాల రేటు 11.9 శాతం ఉన్నట్లు ఆ అధ్యయనంలో తేలింది. ఈ అవాంఛిత గర్భాల నిరోధానికి విరివిగా వాడుతుండటంతో ఈపీసీల అమ్మకాలు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే కుటుంబ నియంత్రణపై ప్రభుత్వాల చొరవ, అవగాహన కార్యక్రమాలు కూడా ఈ మాత్రల డిమాండ్‌ను పెంచుతున్నాయని చెబుతున్నారు. ఈపీసీల వినియోగం పెరగటంతో కండోమ్ విక్రయాలు తగ్గుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో కండోమ్ విక్రయాల్లో 41%తో అమెరికా అగ్రస్థానంలో ఉండగా, ఫ్రాన్స్ రెండో స్థానంలో ఉంది. భారత్, ఆస్ట్రేలియా, ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మనదేశంలో మొత్తం కండోమ్‌ల విక్రయాల్లో ఆన్‌లైన్ అమ్మకాల వాటా 34 శాతంగా ఉంది. మొత్తంగా చూస్తే ఐదేళ్లలో వీటి విక్రయాలు 17% వరకు తగ్గాయని నివేదికలు చెబుతున్నాయి.

ఈసీపీలు ఎక్కువ కాలం వినియోగిస్తే ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. వాస్తవానికి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే వీటిని విక్రయించేలా నిబంధనలు మార్చాలనే ప్రతిపాదనలు గతంలో వచ్చాయి. కానీ, ఓవర్ ది కౌంటర్ ద్వారా లభ్యమయ్యే నిర్దిష్ట మాత్రల విషయంలో అలాంటి ప్రతిపాదన ఏదీ లేదని కేంద్రప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది.

ఇష్టం వచ్చినట్లు వాడితే ప్రమాదం



ఈసీపీలు ఇష్టం వచ్చినట్లు వాడితే హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. నెలసరిలో సమస్యలు వస్తాయి. బరువు పెరుగుతారు. రక్తపోటు పెరుగుతుంది. కొన్నిసార్లు శరీరం వాపు వస్తుంది. దీంతోపాటు కడుపు ఉబ్బరం, కడుపులో వికారం, తలనొప్పి, వాంతులు లాంటి సమస్యలు వస్తాయి. రొమ్ముల్లో ఒక రకమైన ఇబ్బంది ఏర్పడుతుంది. అలాగే రెగ్యులర్ గర్భనిరోధక మాత్రలు వాడేవారిలో చర్మ సమస్యలు తలెత్తుతాయి. ఎక్కువకాలం వాడితే కొన్నిసార్లు గుండెపోటు కూడా వచ్చే ప్రమాదం ఉంది.

- డాక్టర్ ఎస్. విజయలక్ష్మి, గైనకాలజిస్టు, డీసీహెచ్‌ఎస్, కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి

చట్టబద్ధమైందనే ఆ యాప్‌కు ప్రచారం చేసా

» బెట్టింగ్ యాప్స్ కేసులో సిట్ ఎదుట సినీ నటుడు రానా



హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాను ప్రమోట్ చేసిన గేమింగ్ యాప్ చట్టబద్ధమైందని తన లీగల్ టీం చెప్పిన తర్వాతే దానికి ప్రచారం చేశానని సినీనటుడు దగ్గుబాటి రానా తెలిపారు. బెట్టింగ్, గేమింగ్ యాప్‌లకు సంబంధించి నమోదైన కేసుల్లో విచారణ చేపట్టిన సిట్ అధికారుల ముందు రానా శనివారం హాజరయ్యారు. దాదాపు గంటన్నర విచారణ తర్వాత ఆయన సీఐడీ కార్యాలయం నుంచి బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. తాను ప్రచారం చేసిన యాప్‌కు చట్టబద్ధత ఉందని తెలుసుకున్న తర్వాతే ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొన్నానని, ఈ విషయాన్ని సిట్ అధికారులకు వివరించి అందుకు తగిన డాక్యుమెంట్లను అందచేశానని రానా తెలిపారు. ఇదిలా ఉండగా, రానా రావడానికి ముందు నటి విష్ణుప్రియ సైతం సిట్ కార్యాలయానికి వచ్చి అధికారుల ముందు హాజరయ్యారు. విష్ణుప్రియ తాజ్ 777 బుక్ డాట్‌కామ్ అనే గేమింగ్ యాప్‌కు ప్రచారం చేశారు. ఆమె భారీ పారితోషికం అందుకున్నారన్న ఆరోపణల నేపథ్యంలో విష్ణుప్రియ బ్యాంకు లావాదేవీలను సిట్ అధికారులు పరిశీలించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో శిక్ష పడుతుందని యువకుడి ఆత్మహత్య

చొప్పదండి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో పోలీసులకు చిక్కిన ఓ యువకుడు శిక్ష పడుతుందనే భయంతో శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నరేష్ రెడ్డి కథనం మేరకు.. కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన సూర విజయ్(28) చికెన్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. విజయ్‌కి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఈ నెల 1న చొప్పదండి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా విజయ్ పట్టుబడ్డాడు. అతడిపై కేసు పెట్టిన పోలీసులు శుక్రవారం కోర్టుకు తీసుకెళ్లారు. మేజిస్ట్రేట్ సెలవులో ఉండడంతో విజయ్ తిరిగి ఇంటికి వచ్చాడు. వచ్చిన తర్వాత కేసులో శిక్ష పడుతుందని, ఫైన్ కట్టడానికి డబ్బులు లేవని భార్యతో చెప్పాడు. మనస్తాపం చెంది శనివారం ఉదయం ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విజయ్ తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ కొనివ్వలేదని తల్లిని చంపిన కొడుకు

కోహీర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బైక్ కొనుక్కునేందుకు డబ్బుల ఇవ్వడం లేదనే కోపంతో కన్నతల్లినే కొట్టి చంపేశాడు ఓ కొడుకు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని బడంపేట గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. బడంపేటకు చెందిన గడ్డమీద మొగులయ్య-పద్మమ్మ (52)లకు ఇద్దరు కుమారులు, కూతురు సంతానం. పెద్ద కుమారుడు బాల్‌రాజ్ ఏ పని చేకుండా జులాయిగా తిరుగుతూ తన కుటుంబంతో ఇంటివద్దనే ఉంటున్నాడు. మొగులయ్య కొన్నేళ్ల క్రితమే మృతి చెందాడు. బాల్‌రాజ్ పద్ధతి నచ్చకపోవడంతో పద్మమ్మ గ్రామంలోనే తన అక్క ఇంటి వద్ద ఉంటోం ది. పద్మమ్మకు పొదుపు సంఘం నుంచి రూ.2 లక్షల లోన్ వచ్చింది. అది తెలుసుకున్న బాల్‌రాజ్ బైక్ కొనుక్కునేందుకు ఆ డబ్బులు ఇవ్వాలని వారం రోజుల నుంచి తల్లితో గొడవ పడుతున్నాడు. శుక్రవారం రాత్రి కూడా తల్లితో గొడవకు దిగాడు. కోపంతో తన తల్లి పద్మమ్మ తలపై ప్రెషర్ కుక్కర్ మూతతో బలంగా కొట్టాడు. దీంతో ఆమె తల పగిలి అక్కడికక్కడే మృతి చెందింది.

కానిస్టేబుల్‌పై నుంచి దూసుకెళ్లిన కారు

» బైక్ తనిఖీ చేస్తున్న సమయంలో ఘటన

నాగారం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రహదారి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న కానిస్టేబుల్ పైనుంచి కారు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. బైక్‌పై ఉన్న ఇద్దరు కూడా గాయపడ్డారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని నాగారం బంగ్లా వద్ద శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. నాగారం బంగ్లా వద్ద సూర్యాపేట-జనగాం జాతీయ రహదారిపై ఐదుగురు పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అందులో భాగంగా ఓ బైక్‌ను తనిఖీ చేస్తుండగా.. జనగాం నుంచి సూర్యాపేట వైపు వేగంగా వెళ్తున్న కారు ఎదురుగా ఉన్న కానిస్టేబుల్ కమలాకర్‌ను ఢీకొట్టి అంతే వేగంతో వెళ్లిపోయింది. ఆగిన బైక్‌పై ఉన్న ఇద్దరు కూడా గాయపడ్డారు. అక్కడే ఉన్న కానిస్టేబుళ్లు ముగ్గురు క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కమలాకర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఇంజక్షన్ వికటించి 17 మంది చిన్నారులకు అస్వస్థత

» ఐసీయూకు తరలించి చికిత్స.. కోలుకుంటున్న చిన్నారులు

» నాగార్జునసాగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన

నాగార్జునసాగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఇంజక్షన్ వికటించి 17 మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. వైరల్ ఫీవర్‌తో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు ఇచ్చిన యాంటీ బయాటిక్ ఇంజక్షనే ఇందుకు కారణమని భావిస్తున్నారు. చిన్నారుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగార్జునసాగర్ హిల్‌కాలనీ, పైలాన్ కాలనీలతోపాటు సాగర్ పరిసర గ్రామాలకు చెందిన 21 మంది చిన్నారులు విషజ్వరాలతో మూడు రోజుల క్రితం నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిలో చేరారు. కాగా, శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో డ్యూటీలో ఉన్న నర్సు వీరిలో 17 మంది చిన్నారులకు సెలైన్ పెట్టిన అనంతరం యాంటీ బయాటిక్ ఇంజక్షన్ వేశారు. తరువాత వారిలో 12 మందిని డిశ్చార్జి చేశారు. అయితే ఇంటి కెళ్లిన అరగంట తర్వాత చిన్నారులు వాంతులు, విరేచనాలు, చలిజ్వరంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో తల్లిదండ్రులు రాత్రికి రాత్రే 8 మంది చిన్నారులను తిరిగి ఆస్పత్రికి తీసుకొచ్చారు. దీంతో ఏదో జరిగిందని భావించిన వైద్యులు.. మిగిలిన నలుగురు చిన్నారులనూ ఫోన్ చేసి ఆస్పత్రికి పిలిపించారు. వారితోపాటు ఆస్పత్రిలోనే ఉన్న ఐదుగురి పరిస్థితి కూడా అలాగే మారింది. దీంతో మొత్తం 17 మంది చిన్నారులను ఐసీయూకు తరలించి చికిత్స అందించడంతో ప్రస్తుతం కోలుకుంటున్నారు. అర్ధరాత్రి విషయం తెలుసుకున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భానుప్రసాద్ ఆస్పత్రికి చేరుకొని మరో డాక్టర్‌ను పిలిపించి చిన్నారులకు వైద్య సేవలు అందించారు. దీంతో చిన్నారులు కోలుకుంటున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

డీహైడ్రేట్ కావడం వల్లే: డీసీహెచ్

డీఎంహెచ్‌వో శ్రీనివాస్, డీసీహెచ్ మాత్రునాయక్ ఆస్పత్రికి చేరుకొని చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడి విషయం తెలుసుకున్నా రు. యాంటీ బయాటిక్ ఇంజక్షన్ వేయడంతో చిన్నారుల శరీరం డీహైడ్రేట్ అయిందని, దీంతో కడుపులో మంట, వాంతులు, విరేచనాలు అయి చిన్నారులు అస్వస్థతకు గురయ్యారని డీసీహెచ్ తెలిపారు. ప్రస్తుతం అందరూ ఆరోగ్యంగానే ఉన్నారని పేర్కొన్నారు. అయితే నిజ నిర్ధారణకు కమిటీ వేసి మూడు రోజుల్లో విచారణ చేపడతామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ తెలిపారు.

అమెరికాలో అర్చకత్వం అద్భుతః

(మొదటిపేజీ తరువాయి)

శాన్‌ఫ్రాన్సిస్కోలో తొలి హిందూ దేవాలయాన్ని నిర్మించాయి. ఆ గుడిని 'ఓల్డ్ టెంపుల్'గా వ్యవహరిస్తారు. ఆ తర్వాత అమెరికావ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో, పలు నగరాల్లో పలు ఆలయాలను నిర్మించారు. వాటిలో భారతదేశానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు లేదా పీఠాలకు చెందినవి కొన్ని, ప్రవాసులు కలిసికట్టుగా నిర్మించుకున్నవి కొన్ని ఉండగా.. అమెరికాకు అర్చకత్వం చేయడానికి వచ్చి, కొన్నాళ్ల తర్వాత అర్చకులే సొంతంగా నిర్మించిన గుడులూ కొన్ని ఉన్నాయి. ఒక్క శాన్‌హోజే డౌన్‌టౌన్‌కి 40 కిలోమీటర్ల పరిధిలోనే 200 దాకా దేవాలయాలు ఉన్నాయంటే.. పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ ఆలయాల్లో అర్చకులుగా నియమించడానికి.. భారత్‌లోని ప్రముఖ పీఠాలు/మఠాలు/గురుకులాల్లో శిక్షణ పొందిన, వేద పాఠశాలల్లో వేదాధ్యయనం చేసినవారికి పెద్ద పీట వేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి హెచ్-1బీ వీసాలాగానే.. అమెరికాలో అర్చకత్వం చేయాలంటే ఆర్-1 వీసా కావాలి. ఆలయాల నిర్వాహకులు ఆర్-1 వీసాపై అర్చకులను తీసుకొచ్చి.. వారికి జీతభత్యాలు ఇవ్వడంతోపాటు, వసతి, బీమా వంటి సౌకర్యాలను కల్పిస్తున్నారు. ఇలా వచ్చిన వారికి ప్రారంభ దశలో డిమాండ్ కొంత తక్కువగా ఉంటుంది. కానీ ఆలయాలలో నిలదొక్కుకుని భక్తులతో పరిచయాలు, సంబంధాలు పెంచుకోవడం మొదలుపెట్టాక వారికి డిమాండ్ పెరుగుతుంది. కొన్నేళ్లపాటు అలా చేశాక గ్రీన్‌కార్డు వచ్చిన అర్చకులు.. భక్తుల విరాళాలు, సహకారంతో సొంతంగా ఆలయాలను నిర్మిస్తున్నారు. తద్వారా.. గుడిలో వచ్చే జీతభత్యాల కన్నా ఎన్నో రెట్లు ఎక్కువగా సంపాదిస్తున్నారు. మతపరమైన సంస్థలకు అమెరికా ఆదాయపన్ను శాఖ వంద శాతం పన్ను మినహాయింపు ఇవ్వడం వారికి బాగా కలిసొస్తోంది.



షరతులు వర్తిస్తాయి..

అమెరికాలో అర్చకత్వం చేసేవారికి మంచి సంపాదన ఉంటుందన్న మాట నిజమేగానీ.. అది అందరికీ కాదు. గుడిలోగానీ.. తమ ఇంట్లోగానీ.. పూజలు చేసే పురోహితులు నిష్ఠగా ఉండాలని భక్తులు కోరుకుంటున్నారు. సూర్యోదయానికి ముందే లేచి, సంధ్యావందనం చేసుకుని, నిత్యనైమిత్తికాలను తూచా తప్పకుండా అనుసరించేవారికి, వేద విద్య/స్మార్త విద్యను బాగా అభ్యసించి.. ఆచారాలను, సంప్రదాయాలను నిష్ఠగా పాటించేవారికే డిమాండ్ ఎక్కువ. గుట్కా, పాన్‌మసాలా వంటి చెడు అలవాట్లు ఉన్నవారికి పెద్దగా ప్రాధాన్యం ఇవ్వట్లేదు. ఎవరూ దొరకని పక్షంలో చివ్వరి ప్రత్యామ్నాయంగా మాత్రమే.. తప్పనిసరి పరిస్థితుల్లో.. వారిని పరిగణనలోకి తీసుకుంటున్నారు.

ఏడాది పొడుగునా..

గుళ్లో అర్చకత్వంతో పాటు.. వాహన పూజలు, గృహ ప్రవేశం, అన్నప్రాసన, పుట్టినరోజున జరిపించే ఆయుష్య హోమమాలు, సత్యనారాయణ వ్రతం, యజ్ఞాలు, శాంతిపూజలు, దోష నివారణ పూజలు.. ఇలా రకరకాల కార్యక్రమాలు చేయించడానికి భక్తులు అర్చకులను పిలుస్తూనే ఉంటారు. జీతభత్యాలతోపాటు.. ఏడాది పొడుగునా జరిగే ఇలాంటి కార్యక్రమాల ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుంది. అర్చకుడు ఒకసారి చేసిన పూజ బాగా నచ్చితే మరో అర్చకుడి వద్దకు భక్తులు వెళ్లరు. అదే అర్చకుడిని పదేపదే కోరతారు.

సూపర్ సంభావనలు

మంచి కంఠంతో చక్కటి ఉచ్చారణతో పూజాకార్యక్రమాలు చేయించే పురోహితులు, అర్చకులకు ప్రత్యేకంగా డిమాండ్ ఉంది. వారి సంభావనలు కూడా భారీగానే ఇస్తారు. ఉదాహరణకు.. డాలస్‌లో ముహూర్తాల సీజన్ కాని మామూలు రోజుల్లోనే సత్యనారాయణ వ్రతానికి రూ.20 వేల నుంచి రూ.30 వేల దాకా సంభావన ఇస్తున్నారు. అదే ముహూర్తాల సీజన్‌లో అయితే.. రూ.30 వేల నుంచి రూ.45 వేల దాకా దక్షిణగా తీసుకుంటున్నారు. పక్కాగా ప్రణాళికతో వ్యవహరించే పురోహితులైతే రోజుకు ఒకటి కన్నా ఎక్కువ వ్రతాలు చేయించగలరు. ఇలా వారి ఆదాయం నెలకు సుమారు రూ.4 లక్షల నుంచి కొన్ని సందర్భాల్లో రూ.10 లక్షల దాకా కూడ ఉంటోందంటే అతిశయోక్తి కాదు. ఆర్-1 వీసాపై వచ్చి అమెరికాలో ఆలయంలో అర్చకులుగా పనిచేసేవారు.. భక్తుల ఇళ్లకు వెళ్లి వారింట్లో ఏవైనా కార్యక్రమాలు చేయించాలంటే, అందుకు గుడికి నిర్ణీత ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇంటికొచ్చి పూజ చేసినందుకు అర్చకులకు ఇచ్చేది అదనం.

ఇతర వీసాలపై వచ్చి కూడా..

ఆర్-1 వీసాపై వృత్తి రీత్యా వచ్చేవారే కాదు.. వేరే వీసాలపై వచ్చి పార్ట్‌టైమ్‌గా అర్చకత్వం చేసేవారు కూడా ఉన్నారు. కొందరు భక్తులు.. తమ ఇంటి పురోహితుణ్ని ప్రత్యేకంగా అమెరికాకు తీసుకొచ్చి కావాల్సిన పూజలు చేయించుకుని పంపేస్తారు. వీరిని పర్యాటక పురోహితులు అనొచ్చు. ఐటీ ఉద్యోగం చేసేవారిలో కొందరు.. ఖాళీ సమయంలో పూజలు చేయిస్తున్నారు. కొందరు రిమోట్‌గా ఉద్యోగం చేస్తూనే... పూర్తిస్థాయిలో అర్చకత్వంలో ఉన్నారు. పురోహితులకు కొరత ఉన్నచోట కొందరు యూట్యూబ్‌లో మంత్రాలు, శ్లోకాలు నేర్చుకుని పూజలు చేయిస్తున్నారు. అమెరికాకు విద్యాభ్యాసం కోసం వచ్చి ఓపీటీపై ఉన్న విద్యార్థుల్లో కొందరు సైతం.. అర్చకులకు ఉన్న డిమాండ్ చూసి పెద్దల సహకారంతో ఈ వృత్తిలోకి దిగుతున్నారు. వేరేవేరే ఉద్యోగాలు చేసేవారిలో కొందరు.. తమకు ఖాళీగా ఉండే వారాంతాల్లో పూజలు చేయిస్తున్నారు.

పాలమూరులో కులోన్మాద హత్య

» తన కుమార్తెను ఎస్సీ యువకుడు పెళ్లి చేసుకున్నాడన్న పగతో రగిలిపోయిన తండ్రి

» వరుడి సోదరుడి అపహరణ.. హత్య, దహనం



మృతుడు రాజశేఖర్ (ఫైల్)

షాద్‌నగర్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేరే కులం యువకుడు తన కూతురిని తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడన్న కక్షతో రగిలిపోయిన ఆ తండ్రి.. ఆ యువకుడి అన్నను అపహరించి దారుణంగా హత్య చేశాడు. ఈ కులోన్మాద హత్య మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగింది. రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం మొగిలిగిద్ద శివారు ఎల్లంపల్లి గ్రామానికి చెందిన కాగుల వెంకటేశ్ కూతురు 18 ఏళ్ల భవాని, అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్ (25) అనే దళిత యువకుడు ప్రేమించుకున్నారు. భవాని డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. చంద్రశేఖర్ ఆటో నడుపుకొంటున్నాడు. నెలక్రితం ఇద్దరు వివాహం చేసుకున్నారు. ఇది తెలిసి భవాని కుటుంబసభ్యులు షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమక్షంలో అమ్మాయి, అబ్బాయి వేర్వేరుగా ఉండేలా పెద్దల మధ్య ఒప్పందంకుదిరింది. అయితే ఫోన్లో మాత్రం అమ్మాయి, అబ్బాయి మాట్లాడుకుంటున్నారు. ఇటీవల ఇద్దరూ కలిసి ఊర్లో నుంచి వెళ్లిపోయారు. కాగా చంద్రశేఖర్ అన్న రాజశేఖర్ (30) తన భార్యతో కలిసి షాద్‌నగర్‌లోని అయ్యప్ప కాలనీలో ఆరేళ్లుగా అద్దెకు ఉంటున్నాడు. తన కూతురును చంద్రశేఖర్ తీసుకెళ్లడంతో కోపంతో రగిలిపోయిన వెంకటేశ్ బుధవారం రాత్రి కొందరిని వెంటేసుకొని షాద్‌నగర్‌కు వెళ్లాడు. రాజశేఖర్‌ను ఇంట్లో నుంచి బలవంతంగా తీసుకెళ్లాడు. అతడిని అదేరోజు రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం యన్మన్‌గండ్ల శివారులో హత్యచేశాడు. మృతదేహాన్ని పెట్రోలు పోసి కాల్చివేశాడు. కిడ్నాప్ జరిగిన రోజే మృతుడి భార్య వాణి షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మృతుడి కుటుంబసభ్యులు తెలిపారు. భవాని, చంద్రశేఖర్ అచూకీ లభించలేదు.

అక్రమంగా తరలిస్తున్న 40 ఆవుల పట్టివేత

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గాలి, వెలుతురు, మేత లేకుండా తరలిస్తున్న 40 ఆవులను మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీసులు పట్టుకున్నారు. ఆవులను నగరంలోని గోశాలకు తరలించి, వాహనాన్ని స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేశారు. సీఐ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలోని అవుటర్ రింగ్ రోడ్డు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పద స్థితిలో వస్తున్న(ఏపీ 16 టీక్యూ 1497) అశోక్ లేలాండ్ లారీని ఆపి తనిఖీ చేశారు. అందులో అక్రమంగా తరలిస్తున్న 40 ఆవులు పట్టుబడ్డాయి. డ్రైవర్లు శివ, బన్నిని విచారించగా ఏపీలోని కాకినాడ జిల్లా తుని సంతలో ఆవులను కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని బహదూర్‌పుర కబేళాకు తరలిస్తున్నట్లు తెలిపారు. దీంతో లారీని స్వాధీనం చేసుకుని ఆవులను నగరంలోని జియాగూడ గోశాలకు తరలించారు. లారీ డ్రైవర్లు తునికి చెందిన శివ, చిట్యాల్‌కు చెందిన బన్ని, లారీ క్లీనర్లు గోవింద్, రాజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

32 మంది వైద్య అధ్యాపకులు ఏడాదిగా విధులకు ఎగనామం

» మిమ్మల్ని విధుల నుంచి ఎందుకు తొలగించకూడదు?

» 15 రోజుల్లో వివరణ ఇవ్వండి

» షోకాజ్ నోటీసు ఇచ్చిన డీఎంఈ

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లో పనిచేస్తున్న 32 మంది అధ్యాపకులకు వైద్యవిద్య సంచాలకుడు డాక్టర్ నరేంద్రకుమార్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరంతా ఏడాదికిపైగా అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్నారంటూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరి అనధికార గైర్హాజరు వల్ల కాలేజీలు, ఆస్పత్రుల్లో తీవ్ర అసౌకర్యం కలుగుతోందని, ప్రజలకు వైద్య సేవలు అందకుండా పోతున్నాయని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. సర్వీసు నుంచి ఎందుకు తొలగించకూడదో 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో కోరారు. వివరణ ఇవ్వకుంటే ఎలాంటి సంజాయిషీ ఇవ్వలేదని భావించి సర్వీసు నుంచి తొలగిస్తామని అందులో హెచ్చరించారు. రిమ్స్ ఆదిలాబాద్‌కు చెందిన ఏడుగురు, కొత్తగూడెం బోధనాస్పత్రికి చెందిన ఇద్దరు, కామారెడ్డి జనరల్ ఆస్పత్రికి చెందిన ఐదుగురు, జగిత్యాల, సంగారెడ్డి జిల్లాల్లో తొమ్మిది మంది చొప్పున అధ్యాపకులు షోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో ఉన్నారు.

ఏపీకి రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు

విశాఖ సదస్సులో 613 ఎంవోయూలు.. వాటన్నింటినీ మూడేళ్లలో సాకారం చేస్తాం

» రెండేళ్లలో అమరావతి నుంచి క్వాంటమ్ కంప్యూటర్లు

» సదస్సు ముగింపు సభలో ఏపీ సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో 613 ఎంవోయూలు చేసుకున్నామని, వాటి ద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు ఏపీకి రానున్నాయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ ఎంవోయూలన్నీ మూడేళ్లలో కార్యరూపం దాల్చేలా చేస్తామని.. ఎంవోయూలు చేసుకున్న పరిశ్రమలకు వీలైనంత తొందర్లోనే అన్ని అనుమతులు లభించేలా చేసి, పరిశ్రమలు ప్రారంభమయ్యేలా చూస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వం ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీసిందని, అలాంటి పరిణామాలను పునరావృతం కానివ్వబోమని స్పష్టం చేశారు. రెండు రోజుల సదస్సు ముగింపు సందర్భంగా శనివారం మీడియాతో చంద్రబాబు మాట్లాడారు. ఎంవోయూలు కుదరడంలో కేంద్రం కూడా పూర్తిస్థాయిలో సహకరించిందన్నారు. విశాఖ సదస్సు విజయవంతమైందని, ఏకంగా 4,975 మంది ప్రతినిధులు పాల్గొనడం ఒక రికార్డు అని తెలిపారు. మొత్తం 41 సెషన్స్ నడిచాయని, తాను స్వయంగా 24 ద్వైపాక్షిక చర్చల్లో భాగస్వామినయ్యానని చెప్పారు. కాగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన క్వాంటమ్ మిషన్‌ను అందిపుచ్చుకునేలా ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీతో కలిసి జనవరిలో అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్‌ను సిద్ధం చేస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. రానున్న రెండేళ్లలో క్వాంటమ్ కంప్యూటర్లను అమరావతి నుంచి ఉత్పత్తి చేస్తామని చెప్పారు. గతంలో తాను 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పానని. ఇప్పటికే 24 లక్షల ఉద్యోగాలకు గ్యారంటీ ఇచ్చే పరిస్థితికి వచ్చామని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో 500 బిలియన్ యూఎస్ డాలర్లు పెట్టుబడులు రావాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామని, దానివల్ల 50 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. పదేళ్లలో 1 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు.. కోటి మందికి ఉద్యోగాలు రావాలన్నది తన లక్ష్యమని చెప్పారు. కాగా జగన్ 2023లో విశాఖలో పెట్టిన భాగస్వామ్య సదస్సులో ఎంవోయూలు చేసుకున్నవారిలో ఎవరైనా ముందుకొస్తే ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉన్నామని చంద్రబాబు తెలిపారు. వచ్చే ఏడాది కూడా విశాఖలోనే సదస్సు నిర్వహిస్తామని చెప్పారు.



సీఎం చంద్రబాబు సమక్షంలో సెంటర్ ఫర్ ఎనర్జీ అండ్ సైబర్ రెసిలియెన్స్ సెంటర్(సీఈసీఆర్‌సీ)తో ఒప్పందం. చిత్రంలో మంత్రులు లోకేశ్, గొట్టిపాటి రవి తదితరులు

తెలంగాణపై చలి పంజా

» హైదరాబాద్ శివారులన్నీ గజగజ

» 10 జిల్లాలకు ఆరెంజ్.. మిగతా జిల్లాలకు యెల్లో అలర్ట్

» హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/ ఆదిలాబాద్/ ములుగు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంపై చలి పంజా విసురుతోంది. రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. సాయంకాలం 5 గంటలు దాటితే ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. శీతల గాలుల ప్రభావంతో హైదరాబాద్ శివారు ప్రాంతాలతోపాటు రాష్ట్రంలో పలు చోట్ల రాత్రి, పగలు తేడా లేకుండా ప్రజలంతా వణికిపోతున్నారు. 4, 5 రోజులుగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో నగర వాసులు ఉదయం బయటకొచ్చేందుకు గజగజలాడుతున్నారు. తెల్లవారు జామున పొగ మంచు కప్పేయడంతో రహదారులు కనిపించక వాహనదారులు ముందుకెళ్లేందుకు ఇబ్బందులనెదుర్కొంటున్నారు. ఉత్తర, ఈశాన్య దిశల నుంచి ఉపరితల గాలులు గంటకు 4-6 కి.మీ వేగంతో వీచే అవకాశాలుంటాయి. ఆదిలాబాద్ జిల్లా పరిసర ప్రాంతాలను శనివారం దట్టమైన పొగ మంచు కప్పేసింది. కాగా, వచ్చే 2,3 రోజుల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే 3-4 డిగ్రీలు తక్కువగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. వికారాబాద్, సంగారెడ్డి, కుమరంభీం-ఆసిఫాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, మెదక్, జయశంకర్-భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల్లోపు నమోదవుతాయని తెలిపింది. ఈ జిల్లాలకు వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగతా జిల్లాల్లో 10-12 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు రికార్డయ్యే అవకాశం ఉందని పేర్కొంటూ ఆ జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ చేసింది. సంగారెడ్డి జిల్లా కోహీర్, వికారాబాద్ జిల్లా యాలాల్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 8.1 డిగ్రీలుగా నమోదైంది. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 8.4, కామారెడ్డి జిల్లా బీబీపేట, ఆదిలాబాద్ జిల్లా బజారుహత్నూర్‌లలో 8.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఆదిలాబాద్ జిల్లా పరిసర ప్రాంతాలను కప్పేసిన దట్టమైన పొగ మంచు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.